# మీ విశ్వాసమును ప్రకటించండి



ఎవడైనను ఈ కొండను చూచి–నీవు ఎత్తబడి సముద్రములో పడవేయబడుమని చెప్పి, తన మనస్సులో
సందే హింపక తాను చెప్పినది జరుగునని నమ్మినయెడల వాడు చెప్పినది జరుగునని మీతో
నిశ్చయముగా చెప్పుచున్నాను. (మార్కు 11: 23)

**ఆశిష్ రాయచూర్**

**ఉచిత పంపిణీకి మాత్రమే**
ఆల్ పీపుల్స్ చర్చ్ మరియు వరల్డ్ ఔట్రీచ్, బెంగుళూరు, ఇండియా ద్వారా ముద్రించబడింది మరియు పంపిణీ చేయబడింది.
ప్రస్తుత ముద్రణ: 2025

**సంప్రదింపు సమాచారం**
All Peoples Church & World Outreach,
# 319, 2nd Floor, 7th Main, HRBR Layout,
2nd Block, Kalyan Nagar, Bangalore 560 043
Karnataka, INDIA

**ఫోన్:** +91-80-25452617
**ఇమెయిల్: bookrequest@apcwo.org**
**వెబ్‌సైట్: apcwo.org**

ప్రత్యేకంగా సూచింపబడితే తప్పించి, అన్ని వాక్య భాగాలు పరిశుద్ధ గ్రంథము, తెలుగు పాత వెర్షన్ బైబిల్(O.V. బైబిల్) నుండి తీసుకోబడ్డాయి. కాపీరైట్ © 2016 బైబిల్ సొసైటీ ఆఫ్ ఇండియా. అనుమతి ద్వారా ఉపయోగించబడింది. అన్ని హక్కులు ప్రత్యేకించబడ్డాయి.

**ఆర్థిక భాగస్వామ్యం**
ఆల్ పీపుల్స్ చర్చ్ సభ్యులు, భాగస్వాములు మరియు స్నేహితుల ఆర్థిక సహకారం ద్వారా ఈ ప్రచురణ యొక్క ఉచిత పంపిణీ సాధ్యమైంది. మీరు ఈ ఉచిత ప్రచురణ ద్వారా సంపన్నులైతే, ఆల్ పీపుల్స్ చర్చ్ నుండి ఉచిత ప్రచురణల ముద్రణ మరియు పంపిణీకి సహాయం చేయడానికి ఆర్థికంగా సహకరించమని మేము మిమ్మల్ని ఆహ్వానిస్తున్నాము. దయచేసి **apcwo.org/give** ని సందర్శించండి లేదా మీ సహకారాన్ని ఎలా అందించాలో ఈ పుస్తకం వెనుక ఉన్న **"ఆల్ పీపుల్స్ చర్చ్‌తో భాగస్వాములు కండి"** పేజీని చూడండి. ధన్యవాదాలు!

**ఉచిత వనరులు మరియు సంబంధిత వెబ్‌సైట్‌లు**
**ప్రసంగాలు:** apcwo.org/sermons | **పుస్తకాలు:** apcwo.org/books
**చర్చ్ యాప్:** apcwo.org/app | **బైబిల్ కళాశాల:** apcbiblecollege.org
**ఇ-లెర్నింగ్:** apcbiblecollege.org/elearn | కౌన్సెలింగ్: chrysalislife.org
**సంగీతం:** apcmusic.org | **పరిచారకుల సహవాసం:** pamfi.org
**ఎ.పి.సి వరల్డ్ మిషన్స్:** apcworldmissions.org

(Telugu - Speak Your Faith)

# మీ విశ్వాసమును ప్రకటించండి

ఎవడైనను ఈ కొండను చూచి—నీవు ఎత్తబడి సముద్రములో పడవేయబడుమని చెప్పి, తన మనస్సులో సందేహింపక తాను చెప్పినది జరుగునని నమ్మినయెడల వాడు చెప్పినది జరుగునని మీతో నిశ్చయముగా చెప్పుచున్నాను. (మార్కు 11: 23)

అందుకు యేసు వారితో ఇట్లనెను–మీరు దేవునియందు
విశ్వాసముంచుడి. ఎవడైనను ఈ కొండను చూచి–నీవు ఎత్తబడి
సముద్రములో పడవేయబడుమని చెప్పి, తన మనస్సులో
సందేహింపక తాను చెప్పినది జరుగునని నమ్మినయెడల వాడు
చెప్పినది జరుగునని మీతో నిశ్చయముగా చెప్పుచున్నాను.
**(మార్కు 11:22,23)**

# నీకేయ విశ్వాస ప్రమాణము

పరిశుద్ధ లేఖనాల ఆధారం ఉన్న క్రైస్తవ విశ్వాసంయొక్క గొప్ప సిద్ధాంతాల గురించి సార్వత్రిక సంఘానికి ఉన్న విశ్వాసాన్ని నీకేయ విశ్వాస ప్రమాణము తెలియజేస్తుంది. ఇది మొట్టమొదటిసారిగా క్రీ.శ.325 లో నీకేయ సభలో పాల్గొన్న బిషప్పులచే ఆమోదం పొంది అనేక శతాబ్దాలుగా విశ్వాసాన్ని ధైర్యంగా తెలియజేయాడానికి ఒక ప్రమాణంగా వాడుతున్నారు. 'క్రీడ్' (ప్రమాణము) అనే పదం 'క్రెడో' అనే లాటిన్ పదం నుండి వచ్చింది. ఆ పదానికి "నేను నమ్మి విశ్వసిస్తున్నాను" అని అర్థము.

భూమ్యాకాశములను దృశ్యాదృశ్యమగు సమస్తమును సృజించిన
సర్వశక్తిగల తండ్రియగు ఏక దేవుని నేను నమ్ముచున్నాను.

ఆయన జనితైక కుమారుడును అద్వితీయుడునగు ప్రభువైన
యేసుక్రీస్తును నమ్ముచున్నాను.ఈయన జగములన్నిటికి
ముందు తండ్రి నుండి కలిగినవాడును, దేవుని నుండి దేవుడును,
వెలుగు నుండి వెలుగును, నిజమైన దేవుని నుండి నిజమైన
దేవుడును, సృజింపబడక జన్మించినవాడును,తండ్రితో ఏకతత్వము
గలవాడును, సమస్తమును కలుగజేసిన వాడునై యున్నాడు.
ఈయన మానవులమగు మన కొరకును, మన రక్షణ కొరకును
పరలోకమునుండి దిగి కన్యయగు మరియ నుండి పరిశుద్ధాత్మ
వలన అవతరించి పుట్టి మనుష్యుడాయెననియు, పొంతి పిలాతు
అధికారము క్రింద మనకొరకు సిలువ వేయబడి శ్రమనొంది సమాధి
చేయబడెననియు, లేఖనముల ప్రకారము మూడవ దినమున
తిరిగి లేచి పరలోకమున కెక్కి తండ్రి యొక్క కుడిచేతివైపున
కూర్చుండి యున్నాడనియు, సజీవులకు మృతులకు
తీర్పుచేయుటకు తిరిగి మహిమతో వచ్చుననియు, ఆయన
రాజ్యమునకు అంతము లేదనియు నమ్ముచున్నాను.

తండ్రినుండియు, కుమారునినుండియు బయలు వెడలుచు
తండ్రితోను, కూమారునితోను ఏకముగా ఆరాధింపబడుచు,
మహిమ పరపబడుచు ప్రవక్తల ద్వారా మాట్లాడిన వాడును,
జీవమునకు దాతయు ప్రభువునగు పరిశుద్ధాత్మను
నమ్ముచున్నాను. మరియు పరిశుద్ధమైన క్రైస్తవ అపోస్తలుల
ఏక సంఘమును నమ్ముచున్నాను. పాప పరిహారమునకైన ఒకే
బాప్తిస్మమును ఒప్పుకొనుచు మృతుల పునరుత్థానము కొరకును
రాబోవు లోక సంబంధమగు బ్రతుకుకొరకును నిరీక్షించుచున్నాను.
ఆమేన్.

**గమనిక:** "కాథలిక్" అనే పదానికి "సంపూర్ణం" లేదా "సార్వత్రికం" అని అర్ధము

# మా ప్రకటన

మేము సాధారణంగా ఆదివారపు ఆరాధనలో దేవుని వాక్యాన్ని
వినడానికి ముందుగా అందరం కలిసి ఇలా ప్రకటిస్తాము.

ఇది దేవుని వాక్యము.
ఇది దేవుడు నాతో మాట్లాడుతున్న వాక్యము.
దేవుడు నేను ఎవరని చెప్పారో అదే నేను.
నేను ఏమి చేయగలని దేవుడు చెప్పుతున్నారో అది నేను
చేయగలను.
దేవుడు వాగ్దానం చేసిన ప్రతీది నేను పొందుకుంటాను.
నేను రక్షించబడ్డాను, స్వస్థతపర్చబడ్డాను, విడిపించబడ్డాను,
విమోచించబడ్డాను.
నేను దీవించబడ్డాను, జయశీలుడను, సంపన్నుడను,
విజయవంతుడను.
నేను దేవుని పరిచారకుడను, క్రీస్తు సేవకుడను
మరియు అనేక మందికి ఆశీర్వాదకరంగా ఉన్నాను.
నేను ఆయన వాక్యంను అంగీకరించి దానిని నమ్మి ఆయన
వాక్యానుసారంగా జీవిస్తాను.
క్రీస్తే నా యజమాని, నేను ఆయనకు సంపూర్ణంగా లోబడుతాను.
యేసు నామంలో. ఆమెన్.

# నా జీవితం మీద దేవుని వాక్యాన్ని ప్రకటించడము

మీ జీవితంలోని వివిధ అంశాలలో దేవుని వాక్యంపై మీకున్న విశ్వాసంను ఎలా ప్రకటించాలనే దాని కొరకు కొన్ని ఉదాహరణలు క్రింద ఇవ్వబడ్డాయి. దేవుని వాక్యాన్ని ధ్యానించండి. దేవుని వాక్యం వల్ల మీ హృదయాలలో విశ్వాసం కలగాలి. అటుతర్వాత మీ విశ్వాసాన్ని ప్రకటించండి.

**అధికారం మరియు ఆధిపత్యం**

యేసు ప్రభువు ఆయన నామమును ఉపయోగించే హక్కును, ఆయనకు బదులుగా ఆయన చేయాలనుకున్నది చేసే హక్కును నాకు ఇచ్చారు. ఆయన నామములో నేను దయ్యాలను వెళ్ళగొట్టి, రోగులను స్వస్థపరుస్తాను. యేసు ప్రభువు శత్రువు బలమంతటి మీద నాకు అధికారం ఇచ్చారు, ఏదియు నాకు ఎంతమాత్రమూ హాని చేయదు. నేను యేసు క్రీస్తులో తండ్రి కుడి చేతివైపున కూర్చుని యున్నాను, అంటే అధికారం మరియు ఆధిపత్యం ఉన్న స్థానంలో కూర్చున్నాను. (మార్కు 16:17,18; లూకా 10:19; ఎఫెసీయులకు 2:6)

**ప్రార్థనకు జవాబు**

నేను యేసు ప్రభువు నామములో విశ్వాసముంచి పరలోక తండ్రిని ఏది అడిగినా దానిని నేను పొందుకుంటానని ఆయన వాగ్దానం చేశారు. నేను ప్రార్థన చేసినప్పుడు వేటిని అడుగుతానో అవి దొరుకుతాయని నమ్మితే నేను వాటిని పొందుతాను. నేను ఆయనలో, ఆయన వాక్యం నాలో నిలిచి ఉంటే నేను ప్రార్థించి అడిగినవి నాకు అనుగ్రహించబడతాయి. (యోహాను 16:23,24; మత్తయి 21:22; మార్కు 11:24; యోహాను 15:7)

**అభిషేకం మరియు శక్తి**
పరిశుద్ధాత్మ నా మీదకి వచ్చినప్పుడు నేను శక్తిని పొందుకున్నాను అలాగే యేసు క్రీస్తుకు సాక్షిగా ఉన్నాను. ప్రభువు ఆత్మ నా మీద ఉంది, స్వస్థపర్చడానికి, విడుదల చేయడానికి అలాగే చెరలోనున్న వారిని విడిపించడానికి ఆయన నాకు బలాన్ని అనుగ్రహిస్తారు. నన్ను పిలిచి అభిషేకించింది దేవుడే. నా మీద ఉన్న పరిశుద్ధాత్మ అభిషేకం ప్రజల మీద ఉన్న అపవాది బంధకాలను భారాలను తొలిగిస్తుంది. (అపొస్తలుల కార్యములు 1:8; లూకా 4:18,19; 2 కొరింథీయులకు 1:21; యెషయా 10:27)

**ఆశీర్వాదాలు**
దేవుని నుండి వచ్చే ప్రతి దీవెనతో నేను ఆశీర్వదించబడ్డాను. దేవుడు తన ప్రజలకు ఇచ్చే అన్ని ఆశీర్వాదాలను నేను పొందుకొని ఆనందిస్తాను. నా చేతులు చేసే ప్రతి పనిలో నేను ఆశీర్వదించబడ్డాను. ప్రభువు నాకు వర్ధిల్లడం నేర్పించి, నాకు త్రోవను చూపిస్తారు. నేను దేవుని పట్ల విధేయత కలిగి నడుచుకుంటాను, ఎన్నడూ ఎండిపోని నదిలా ఆయన ఆశీర్వాదాలు ప్రవహిస్తాయి. సముద్ర తీరాన ఎగసిపడే కెరటాలువలే వలే నేను విజయం సాధిస్తాను. (ఎఫెసీయులకు 1:3; కొలొస్సయులకు 1:12; ద్వితీయోపదేశకాండము 28:6; యెషయా 48:17,18)

**ధైర్యం మరియు విశ్వాసం**
నేను బలం కలిగి చాలా ధైర్యంగా ఉంటాను. నేను సింహంవలె ధైర్యంగా ఉన్నాను. దేవుడు నాకు భయపడే ఆత్మను ఇవ్వలేదుగాని, శక్తి ప్రేమ అలాగే ఇంద్రియ నిగ్రహంగల ఆత్మను ఇచ్చారు. యెహోవాయే నా ధైర్యం నా క్షేమము (యెహోషువ 1:9; సామెతలు 28:1; 2 తిమోతికి 1:7; సామెతలు 14:26).

**గొప్ప కార్యాలు**
నేను నా దేవునిని ఎరుగుదును. నేను బలం కలిగి దేవుని రాజ్యం కొరకు గొప్ప కార్యాలు చేస్తాను. నాలో కార్యసాధకమైన ఆయన శక్తి

ద్వారా నేను అడిగే వాటికంటే లేదా ఊహించే వాటికంటే మించిన కార్యాలను నెరవేర్చడానికి దేవుడు నాలో, నా ద్వారా పని చేస్తారు. (దానియేలు 11:32; ఎఫెసీయులకు 3:20)

**భవిష్యత్తు**

దేవునికి నా పట్ల ఉన్న ప్రణాళికలు ఆయనకు తెలుసు, అనగా నన్ను అభివృద్ధి పరచడం నిరీక్షణ కలిగిన భవిష్యత్తును ఇవ్వడము. దేవుడు నేను చేయాలనుకున్న వాటి కోసం ముందుగానే ఆయన ప్రణాళికలు వేశారు. నేను వాటిలో నడుస్తున్నాను. ఆయన ఉద్దేశాలు నెరవేరడం కోసం నన్ను పిలిచారు కాబట్టి సమస్తం నా మేలు కోసమే జరుగుతున్నాయి. నేను ఆయనను ప్రేమిస్తున్నాను కాబట్టి దేవుడు నా కొరకు సిద్ధపరచినవి కంటికి కనిపించలేదు, చెవికి వినిపించలేదు, ఎవరూ వాటిని ఊహించలేరు. (యిర్మీయా 29:11; ఎఫెసీయులకు 2:10; రోమా 8:28; 1 కొరింథీయులకు 2:9)

**ఇల్లు, కుటుంబం, పిల్లలు**

దేవుడు నా ఇంటిని ఆశీర్వదించారు. నా ఇల్లు సంతోషంతో రక్షణ సునాదంతో నిండి ఉంటుంది. నా ఇల్లు ప్రశాంతత నెమ్మది భద్రత ఉన్న స్థలం, దానిలో ఏ చింతలు ఉండవు. దేవుడు నా పిల్లలపై తన ఆత్మను తన ఆశీర్వాదాన్ని కురిపిస్తారు. నా పిల్లలందరూ యెహోవా చేత ఉపదేశాన్ని పొంది గొప్ప విశ్రాంతిని కలిగి ఉంటారు. (సామెతలు 3:33; కీర్తనలు 118:15; యెషయా 32:18; యెషయా 44:3; యెషయా 54:13)

**విశ్వాసము**

దేవుడు నాకు విశ్వాసాన్ని కొలిచి ఇచ్చారు. నేను కంటికి కనిపించే వాటి వలన కాక విశ్వాసంతో జీవిస్తాను. నేను దేవుని మహిమను చూస్తానని నమ్ముతున్నాను. నా హృదయంలో ఉన్న విశ్వాసంతో నేను పర్వతాలతో మాట్లాడినప్పుడు అవి తొలగిపోతాయి. అలాగే నాకు అసాధ్యమైనది ఏదీ లేదు. (రోమా 12:3; 2 కొరింథీయులకు 5:7; యోహాను 11:40; మత్తయి 17:20)

**దయ, సత్సంబంధాలు**

డాలుతో కప్పినట్లు దేవుడు తన దయతో నన్ను కప్పుతారు. దేవుడు నాకు ఘనతను ఐశ్వర్యాన్ని ఇస్తారు. నేను దయ కలిగి నిజాయతీగా ఉంటాను. నా చుట్టూ ఉండే అందరి దయ పొందుతాను. దేవుడు నా శత్రువులను కూడా నాకు మిత్రులుగా చేస్తారు. నేను దేవునిని ఘనపరుస్తాను కాబట్టి నన్ను చూసి దేవున్ని ప్రేమించేవారు సంతోషిస్తారు. (కీర్తనలు 5:12; సామెతలు 22:4; సామెతలు 3:3,4; సామెతలు 16:7; కీర్తనలు 119:74)

**నడిపింపు**

పరిశుద్ధాత్మ దేవుడు నన్ను సర్వ సత్యంలోనికి నడిపిస్తారు. యెహోవా నాకు ఉపదేశం చేసి నేను వెళ్ళవలసిన మార్గాన్ని బోధిస్తారు. ఆయన తన దృష్టిని నాపై ఉంచి నన్ను నడిపిస్తారు. నా అడుగులను దేవుడు స్థిరపరుస్తారు, నా ప్రవర్తన చూసి ఆనందిస్తారు. ఒకవేళ నేను పడిపోయినా సరే ఆయన నన్ను పైకి లేవనెత్తుతారు. దేవుని వాక్యం నన్ను నడిపించే దీపంగా నా త్రోవకు వెలుగుగా ఉంది. నేను ఆయన వాక్యాన్ని అనుసరిస్తాను. (యోహాను 16:13; కీర్తనలు 32:8; కీర్తనలు 37: 23,24; కీర్తనలు 119:105)

**ఆరోగ్యం, స్వస్థత**

యేసు ప్రభువు నా అనారోగ్యాలను వ్యాధులను సిలువ మీద భరించారు. సిలువ మీద యేసు పొందిన గాయాలు వల్ల నేను స్వస్థత పొందాను. దేవుడే నా ప్రభువు, నన్ను స్వస్థపరచువాడు. ప్రభువు నేను తినే ఆహారాన్ని త్రాగే నీటిని దీవించి రోగాలన్నింటిని నాకు దూరంగా ఉంచుతారు. ఆయన నా పాపాలన్నీ క్షమించి నా రోగాలను స్వస్థపరుస్తారు. (మత్తయి 8:17; 1 పేతురు 2:24; నిర్గమ 15:26; నిర్గమ 23:25; కీర్తనలు 103:3)

**సంతోషము**

ప్రభువు ఆత్మ నన్ను సంతోషంతో నింపును. నేను నీతిని ప్రేమించి దుర్నీతిని ద్వేషిస్తాను కాబట్టి దేవుడు నన్ను సంతోషంతో ఆనందంతో అభిషేకించారు. ప్రభువులో ఆనందించడం వల్ల నేను శక్తిని బలాన్ని

పొందుతాను. నిరీక్షణకర్తయైన దేవుడు నన్ను సంతోషసమాధానాలతో నింపుతారు. నేను నీతి, సమాధానం, పరిశుద్ధాత్మలోని ఆనందం కలిగి నడుస్తాను. (గలతీయులకు 5:22; కీర్తనలు 45:7; నెహెమ్యా 8:10; రోమా 15:13; రోమా 14:17)

## నీతిమంతునిగా చేయబడుట

క్రీస్తునందున్న విశ్వాసం ద్వారా నేను దేవుని దృష్టిలో నీతుమంతునిగా చేయబడ్డాను. ఆయన దృష్టిలో నేను "ఏ పాపం చేయని వానిగా" ఉన్నాను, ఎందుకంటే యేసు క్రీస్తు రక్తం నా పాపమంతటిని కడిగివేసింది. నేను ఆయన నీతి వస్త్రాలను ధరించి, దేవుని ముందు ధైర్యంతోను, నిశ్చయతతోను, ఎటువంటి శిక్షావిధి లేకుండా నిల్చున్నాను. నేను దేవుని బిడ్డను అనే నిశ్చయతను పరిశుద్ధాత్మ నాకిచ్చి, నేను ఆయనను "అబ్బా తండ్రి" అని పిలిచేలా చేస్తారు. (రోమా 3:22; 1 యోహాను 1:7; 2 కొరింథీయులకు 5:21; రోమా 8:1,15)

## ప్రేమ

దేవుని ఆత్మ నా హృదయంలో దేవుని ప్రేమను కుమ్మరించెను. నేను దేవుని ప్రేమతో ఇతరులను ప్రేమించేలాగా శక్తిని పొందాను. దేవుని ప్రేమ నేను సహనం కనికరం కలిగి ఉండేలా చేసి, అసూయకు గర్వానికి దుర్మార్గతకు స్వార్ధానికి ఇంకా చిరాకు పడే స్వభావానికి నన్ను దూరంగా ఉంచుతుంది. నాకు పట్ల చేసిన తప్పులను నేను గుర్తుంచుకోను. (రోమా 5:5; 1 కొరింథీయులకు 13:4,5)

## దీర్ఘాయుష్షు

దేవుడు నన్ను దీర్ఘాయుష్షుతో తృప్తి పరుస్తారు. ప్రభువు నేను పక్షిరాజువలే యవ్వన బలంతో ఉండేలా మేలుతో నన్ను నింపుతారు. (కీర్తనలు 91:16; నిర్గమ 23:26; కీర్తనలు 103:5)

## మనసు, ఆలోచనలు

నా మనసు పరిశుద్ధమైనది. నేను సత్యమైన గౌరవనీయమైన న్యాయమైన పవిత్రమైన రమ్యమైన ఖ్యాతిగల ఆలోచనలనే రానిస్తాను.

నాకు స్వస్థబుద్ధి, మంచి జ్ఞాపక శక్తి, పదునైన దృష్టి అలాగే చక్కటి గ్రహింపు ఉంది. నా ఆలోచనలు, భావాలు, ఆశలను దేవునికి ప్రతిష్టించి, ప్రతి ఆలోచనను క్రీస్తుకు లోబరుస్తాను. (ఫిలిప్పీయులకు 4:8;2 తిమోతికి 1:7; 2 కొరింథీయులకు 10:4,5)

## లోకాన్ని శరీరాన్ని జయించడము

నేను దేవుని ద్వారా జన్మించి ఈ లోకాన్ని అందులోని సమస్తాన్ని జయిస్తాను. నేను శరీరాశ, నేత్రాశ, జీవపు డంబంనుండి వచ్చు పాపపు కోరికలను జయిస్తాను. నేను దేవుని దైవస్వభావంలో పాలు పంచుకుని, ఈ లోకంలో ఉన్న చెడు నుండి దూరంగా ఉంటాను. పరిశుద్ధాత్మ శక్తి ద్వారా నా శరీరంలో ఉన్న పాపపు క్రియలన్నిటికి ముగింపు చెప్తాను. నేను ఆత్మలో నడుస్తాను, నా శరీరంలోని పాపపు కోరికలకు లోబడను. (1 యోహాను 5:4; 2 పేతురు 1:3,4; రోమా 8:13; గలతీయులకు 5:16)

## శాంతి, నెమ్మది మరియు విశ్రాంతి

నా భారాలన్నీ ప్రభువు ముందు ఉంచుతాను, అప్పుడు మానవ జ్ఞానానికి మించిన దేవుని సమాధానం నా హృదయాన్ని నా మనసును నింపుతుంది. నేను మౌనంగా ధైర్యంతో నడవడాన్ని ఎంచుకుంటాను, అది నన్ను బలంతో నింపుతుంది. ప్రభువు నాకిచ్చే విశ్రాంతిలో నేను నడుస్తున్నాను. (1 పేతురు 5:7; ఫిలిప్పీయులకు 4:7; యెషయా 30:15; మత్తయి 11:28,29)

## రక్తంలో ఉన్న శక్తి

యేసు ప్రభువు రక్తం నన్ను కొని నన్ను విమోచించింది, నా పాపాలన్నింటిని కడిగింది, నన్ను పరిశుద్ధపరచింది, నన్ను నీతిమంతునిగా చేసింది, దేవుని దగ్గరకు చేర్చింది అలాగే దేవుని అతి పరిశుద్ధ స్థలంలోనికి వెళ్లే ధైర్యాన్ని ఇచ్చింది. యేసు ప్రభువు రక్తంతో నేను కప్పబడి కాపాడబడుతున్నాను. యేసు ప్రభువు రక్తం ద్వారా నేను దేవుని నిబంధనలో ఉన్నాను. నా పూర్వీకుల తప్పుడు మార్గాలలో నుండి ఆ రక్తమే నన్ను విమోచించింది. యేసు ప్రభువు రక్తం ద్వారా నేను శత్రువును జయిస్తాను. (అపొస్తలుల కార్యములు

20:28; ఎఫెసీయులకు 1:7; 1 యోహాను 1:7; హెబ్రీయులకు 13:12; నిర్గమ 12:13; 1 పేతురు 1:18-20; ప్రకటన 12:11).

**సమృద్ధి మరియు జయము**

నీటి కాల్వల దగ్గర నాటబడి దాని కాలంలో ఫలమిచ్చే చెట్టులా నేను ఉన్నాను. నేను ప్రతి కాలంలో ఫలిస్తాను. నా ఆకు వాడదు, నేను చేసే ప్రతి పని సఫలమవుతుంది. నా చేతి పనులన్నిటిలో దీవించబడతాను. నేను యెహోవాను, ఆయన వాక్యాన్ని, ఆయన మార్గాల్ని అనుసరిస్తాను. ఆయన నేను వర్ధిల్లేలా చేసి మంచి జయాన్ని ఇస్తారు. నేను వినయంగా దేవుని యందు భయభక్తులతో నడువగా ఆయన నన్ను ఐశ్వర్యంతో ఘనతతో దీర్ఘాయుష్షుతో దీవిస్తారు. (కీర్తనలు 1:1-3; ద్వితీయోపదేశకాండము 28:8; యెహోషువ 1:8; సామెతలు 22:4).

**కాపుదల మరియు విడుదల**

యెహోవాను నా రక్షకునిగాను, మహోన్నతుని నన్ను కాపాడేవానిగా చేసుకున్నాను. ఏ అపాయం నన్ను తాకాదు, ఏ కీడు నా ఇంటిని చేరదు. కష్టాలలో దేవుడు నాతో ఉంటారు. ఆయన నాకు సమాధానం ఇచ్చి, నన్ను విడిపిస్తారు. దేవుని దూత నాకు కావలి యుండి, నన్ను విడిపిస్తుంది. నాకు విరోధంగా రూపించబడిన ఏ ఆయుధం నాకు హాని చేయదు. దేవుడు నన్ను రక్షించి నాకు విజయాన్ని ఇస్తారు. నాకు వ్యతిరేకంగా మాట్లాడే ప్రతి నాలుకను నా ముందు అణచివేస్తారు. (కీర్తనలు 91:10,11,15; కీర్తనలు 34:7; యెషయా 54:17)

**పదోన్నతి ఎదుగుదల**

నా పదోన్నతి, ఎదుగుదల అలాగే పెరుగుదల అన్ని దేవుని నుండే వస్తాయి. నా పదోన్నతి కొరకు దేవుడు పరిస్థితులను అనుకూలపరుస్తారు. నేను యెహోవాకు లోబడగా ఆయన తగిన కాలంలో నన్ను హెచ్చిస్తారు. నాకు అధికారాన్ని, ప్రభావాన్ని అలాగే నాయకత్వాన్ని ఇచ్చింది దేవుడే. (కీర్తనలు 7:6,7; యాకోబు 4:10; ద్వితీయోపదేశకాండము 28:13)

**సంరక్షణ పోషణ**
నా దేవుడు తన మహిమైశ్వర్యము చొప్పున యేసు క్రీస్తులో నా ప్రతి అవసరాన్ని తీరుస్తారు. యెహువా నా కాపరి, నాకు లేమి లేదు. యెహోవాయే నా సూర్యుడు, నా కేడెమునై యున్నాడు. నాకు ఇవ్వకుండా ఏ మంచి వాటిని కూడా ఆయన దాచిపెట్టరు. దేవుడు ఎప్పుడు నాకు పుష్కలంగా ఉంటూ ఇతరులతో కలిసి పంచుకోడానికి సమృద్ధిగా ఉండేలాగా నాకు అవసరమ్యే దానికంటే ఎక్కువే ఇస్తారు. ధనం సంపాదించే సామర్థ్యాన్ని దేవుడే నాకు ఇస్తారు. (ఫిలిప్పీయులకు 4:19; కీర్తనలు 23:1; కీర్తనలు 84:11; 2 కొరింథీయులకు 9:8; ద్వితీయోపదేశకాండము 8:18).

**సూచక క్రియలు, అద్భుతాలు, ఆశ్చర్యకార్యాలు**
యేసు నామములో విశ్వాసముంచిన నేను కొత్త బాషలలో మాట్లాడతాను, దయ్యాలను వెళ్లగొడతాను, రోగుల మీద చేతులు ఉంచినప్పుడు వారికి స్వస్థత కలుగుతుంది. దేవుడు నాతో ఉన్నారు. సూచక క్రియలు ద్వారా, అద్భుతాలు ఇంకా ఆశ్చర్యకార్యాలు ద్వారా ఆయన వాక్కును స్థిరపరుస్తారు. యేసు ప్రభువు తండ్రి దగ్గరకు వెళ్లారు కాబట్టి యేసు ప్రభువు చేసిన అద్భుత కార్యాలే కాకుండా ఇంకా గొప్పవి నేను చేయగలను. నేను, యేసు ప్రభువు సువార్తను తెలియజేసినప్పుడు, సూచక క్రియలు, అద్భుతాలు ఆశ్చర్య కార్యాలు పరిశుద్ధాత్మ వరముల ద్వారా దేవుడే సాక్ష్యమిస్తున్నారు. (మార్కు 16:17,18; మార్కు 16:20; యోహాను 14:12; హెబ్రీయులకు 2:3,4)

**నిద్ర**
యెహోవా నాకు మంచి నిద్రని ఇస్తారు. నేను పండుకున్నప్పుడు భయపడను. నేను పండుకున్నప్పుడు సుఖంగా నిద్రిస్తాను. నేను స్వేద తీరి నూతన ఉత్సాహంతో మేలుకుంటాను. (కీర్తనలు 127:2; కీర్తనలు 4:8; సామెతలు 3:24; కీర్తనలు 3:5)

**నా జీవితంలో దేవుని ఆత్మ**
నేను పరిశుద్ధాత్మకు ఆలయంగా ఉన్నాను. దేవుని ఆత్మ నాలో

నివసిస్తుంది. ఆయన నన్ను నడిపించి ముందుకు తీసుకువెళ్తారు. ఆయన నాకు అన్ని నేర్పిస్తారు. నేను ఆత్మలో నడుస్తున్నప్పుడు శరీర క్రియలకు లోబడను. ఆయన నాకు శక్తిని ఇస్తూ నన్ను ఆవరించియుంటారు. ఆయన సన్నిధి, శక్తి నాలో నుండి నదిలా ప్రవహించి, నా చుట్టూ ఉన్నవారిని దీవించి, స్వస్థపరచి విడుదల చేస్తుంది. (1 కొరింథీయులకు 3:16; రోమా 8:14; 1 యోహాను 2:27; గలతీయులకు 5:16; యోహాను 7:38,39)

## గెలుపు, విజయము

దేవుడు నేను అన్ని విషయాలలో గెలిచేలాగా చేస్తారు. యేసు ప్రభువు సిలువలో నా తరపున పొందిన విజయంలో నేను నడుస్తాను. నా దేవుని ద్వారా నేను పరాక్రమ కార్యాలను చేస్తాను. (2 కొరింథీయులకు 2:14; కొలొస్సయులకు 2:14; యెషయా 53:12; కీర్తనలు 60:12)

## జ్ఞానము, గ్రహింపు మరియు ప్రేరణ

క్రీస్తే నా జ్ఞానము. జ్ఞానవివేకములకు ఆలోచన బలములకు ఆధారమైన ఆత్మ నా మీద నిలిచి ఉంటుంది. అన్ని విషయాలలో ప్రభువు నాకు గ్రహింపునిస్తారు. ఆయన వాక్యము, వెలుగు ఇంకా గ్రహింపుతో మనల్ని నింపుతుంది. నా అంతరంగంలోని దేవుని ప్రేరణ నాకు గ్రహింపునిస్తుంది. (1 కొరింథీయులకు 1:30; యెషయా 11:1,2; 2 తిమోతికి 2:7; కీర్తనలు 119:130; యోబు 32:8)

## సాక్ష్యము

నేను ధైర్యంగా యేసు క్రీస్తుకు సాక్షిగా ఉంటాను. యేసు క్రీస్తు సువార్త గురించి నేను సిగ్గుపడను. ప్రజల ముందు నేను ఆయనను అంగీకరిస్తాను, అప్పుడు ఆయన పరమ తండ్రి ముందు నన్ను అంగీకరిస్తారు. (అపొస్తలుల కార్యములు 1:8; రోమా 1:16; మత్తయి 10:32)

## నా జీవితంలో దేవుని వాక్యము

దేవుని వాక్యం సత్యమని నేను ప్రకటిస్తాను. ఆయన వాక్యం నా జీవితాన్ని ప్రభావితం చేస్తుంది. ఆయన వాక్యపు శక్తి చేత నా జీవితం

సమర్థింపబడుతుంది, నిలబడుతుంది, నియంత్రించబడుతుంది. నా లోకంలో ఉన్న ప్రతిదీ దేవుని వాక్యానికి విధేయత చూపి వాక్యానుసారంగా మారుతుంది. (యోహాను 17:17; కీర్తనలు 119:128; హెబ్రీయులకు 1:3; హెబ్రీయులకు 11:3)

# “క్రీస్తులో నేను”

నేను క్రీస్తులో ఏమైయున్నానో అదే నేను! నా గుర్తింపు, భద్రత, ప్రాముఖ్యత అలాగే విలువ ఆయనలో, ఆయన నుండి, ఆయన కొరకే ఉన్నాయి. నా గుర్తింపు, ఆత్మ గౌరవం విశ్వాసం అనేవి క్రీస్తులో నన్ను దేవుడు ఎలా చేశారో అనేదానిపై ఆధారపడి ఉన్నాయి. నేను క్రీస్తులో ఏమైయున్నానో అనేది సంపూర్ణంగా దేవునికి నామీద ఉన్న హద్దులు లేని అపరిమితమైన ప్రేమను బట్టి ఆయన నాకు చేసిన దాని మీద ఆధారపడి ఉంది.

నేను క్రీస్తులో ఏమైయున్నానో అదే నేను అని ప్రకటిస్తున్నాను.

క్రీస్తులో నేను నూతన సృష్టిని. పాతవి గతించిపోయాయి. నా అంతరంగంలో నేను నూతనంగా ఉన్నాను (2 కొరింథీయులకు 5:17). నా పాత జీవితం ముగిసిపోయింది, నా నూతన జీవితం క్రీస్తులో భద్రంగా ఉంది. నేను ఇప్పుడు జీవించే నూతన జీవితం క్రీస్తు నుండే వస్తుంది (కొలొస్సయులకు 3:3). నాలో ఇప్పుడు ఉన్న నూతన స్వభావం దేవుని పోలికలో సృష్టించబడింది. అది దేవుని గుణంతో నీతితో పరిశుద్ధతతో నిండి ఉంటుంది. క్రీస్తులోని నూతన సృష్టిగా నేను జీవిస్తాను (ఎఫెసీయులకు 4:24).

క్రీస్తులో నేను దేవుని బిడ్డను, దేవుని వారసుడను, యేసు క్రీస్తుతో సహవారసుడను. నేను దేవుని కుటుంబంలో అలాగే దేవుని రాజ్యంలో భాగంగా ఉంటాను (రోమా 8:17). తండ్రియైన దేవుడు తన కుమారుడైన యేసు క్రీస్తు ప్రభువు ప్రేమించినట్లుగానే క్రీస్తులో నన్ను కూడా ప్రేమిస్తారు. ఈ ప్రేమలో నేను నిశ్చింతగా ఉంటాను (యోహాను 16:27; యోహాను 17:23). క్రీస్తులోని దేవుని ప్రేమ నుండి నన్ను ఏది కూడా వేరు చేయలేదు. ఆయనకు నా పట్ల ఉన్న ప్రేమను బట్టి నేను అన్నింటిలో విజయం సాధిస్తాను (రోమా

8:37,39). క్రీస్తులో పరిశుద్ధాత్మలో ముద్రించబడ్డాను. దేవుడే నాకు యజమానిగా ఉన్న ఉన్నారు (ఎఫెసీయులకు 1:13,14). క్రీస్తులో దేవుని పరిశుద్ధాలయంలో భాగంగాను, ఆయన ఆత్మ మూలంగా దేవుని నివాస స్థలంగాను ఉన్నాను. దేవుడు నాలో నివసించి నా ద్వారా ప్రత్యక్షపరుచుకుంటారు (ఎఫెసీయులకు 2:21,22).

నేను దేవుని దృష్టిలో నీతిమంతునిగా తీర్చబడి, యేసు క్రీస్తు ద్వారా దేవునితో సమాధానం కలిగి ఉన్నాను. క్రీస్తులో దేవునితో సరైన సంబంధం కలిగి ఉంటాను (రోమా 5:1,2). క్రీస్తులో నాకు ఏ శిక్షావిధి లేదు. నేను ధైర్యంగా, సిగ్గు అపరాధభావం లేదా విమర్శ లేకుండా స్వేచ్ఛగా దేవునితో సంబంధం కలిగి ఉంటాను (రోమా 8:1). క్రీస్తులో దేవుని నీతిగా చేయబడ్డాను. ఇది నాకు ధైర్యాన్ని ఇచ్చి విశ్వాసంతో ఆయన సన్నిధికి వెళ్లేలా చేస్తుంది (2 కొరింథీయులకు 5:21). నేను తన ఎదుట పరిశుద్ధంగా నిర్దోషిగా ఉండాలని ప్రేమ చేత దేవుడు క్రీస్తులో నన్ను ఎంచుకున్నారు (ఎఫెసీయులకు 1:4). క్రీస్తులో దేవునికి దగ్గరగా తీసుకురాబడ్డాను. ఆయన ఆత్మ ద్వారా తండ్రి సన్నిధికి చేరగలను (ఎఫెసీయులకు 2:13,18).

నా పాత పాపపు స్వభావం క్రీస్తుతో పాటు సిలువ వేయబడింది, నా జీవితం మీద పాపానికున్న అధికారం తొలగిపోయింది, పాపబంధకాల నుండి నేను విడుదల పొందాను. ఇకపై నా మీద పాపానికి అధికారం లేదు (రోమా 6:6,14). క్రీస్తులో నేను చీకటి శక్తుల నుండి విడుదల పొంది, యేసు క్రీస్తు రాజ్యంలోనికి చేర్చబడ్డాను. సాతానుకు నాలో స్థానం లేదు, నా మీద అధికారం లేదు అలాగే ఏ హక్కు లేదు. ప్రాణం ఆత్మ దేహంతో సహా నేను దేవుని సొత్తును (కొలొస్సయులకు 1:13,14; 1 కొరింథీయులకు 6:20). నేను యేసు క్రీస్తు రక్తం వలన విడుదల పొందాను. నేను దేవుడు కొనుకున్న సొత్తును. నేను పూర్తిగా దేవునికే చెందుతాను (ఎఫెసీయులకు 1:7). క్రీస్తులో పాపపు శక్తి నుండి నేను విడుదల పొందాను. క్రీస్తుతో మరణించి, క్రీస్తుతో కూడా తిరిగి లేచాను. నా పాత

జీవితానికి ఉన్న శక్తి పోయింది (కొలొస్సయులకు 2:11,12).

నేను ఆత్మలో యేసుతో ఒక్కటిగా ఉన్నాను. ఆయన ద్రాక్షావల్లి, నేను ఆయనలో అంటుకట్టబడ్డ తీగను. ఆయన నాలో ఉన్నారు, నేను ఆయనలో ఉన్నాను. ఆయన జీవం నా ద్వారా ప్రవహిస్తూ నా ద్వారా వ్యక్తమవుతుంది. నాలో ప్రవహించే ఆయన జీవానికి ఉన్న శక్తిని గుణాన్ని నేను వ్యక్తపరుస్తాను. ఆయన మహిమార్థమై నేను బహుగా ఫలిస్తాను (1 కొరింథీయులకు 6:17; యోహాను 15:1-7). ఆయనలో నేను సంపూర్ణమై ఉన్నాను, ఆయన సంపూర్ణతతో నేను నింపబడి ఉన్నాను. ఆయనే నాలో నింపబడతారు (కొలొస్సయులకు 2:9,10). నేను యేసులో ఉండి యేసులా నడుస్తాను. నేను ఆయన ప్రేమలో, ఆయన కృపలో ఆయన శక్తిలో నడుస్తాను (1 యోహాను 2:6). యేసు ప్రభువు దేవుని కుమారుడని ఒప్పుకుంటాను. నేను దేవునిలో నివసిస్తాను, దేవుడు నాలో నివసిస్తారు. నేను ఆయనలో ఏకమై జీవిస్తాను (1 యోహాను 4:15).

యేసు ప్రభువే నా జ్ఞానము. ఆయనలో నేను దేవునితో సరియైన సంబంధం కలిగి ఉంటాను. నేను పరిశుద్ధుడిగా మారాను, దేవుని కొరకు ప్రత్యేకించబడ్డాను, విడుదల పొందాను (1 కొరింథీయులకు 1:30). క్రీస్తులో నేను ఆయన చేతిపనిని. ఆయన ముందుగా నిర్ణయించిన సత్కార్యాలను చేయడానికి ఆయన నన్ను సృష్టించారు (ఎఫెసీయులకు 2:10).

నేను దేవుని అత్యధిక కృపను నీతి అనే బహుమానాన్ని పొందుకుని జీవం కలిగి పాలిస్తాను. యేసు క్రీస్తు ద్వారా జీవితంలో ఆధిపత్యాన్ని కలిగి ఉన్నాను (రోమా 5:17). క్రీస్తులో అన్ని స్థితిగతులలో దేవుడు నేను ఎల్లప్పుడూ జయించేలాగా చేస్తారు. నేను అన్నివేళలా యేసులో విజయాన్ని సాధిస్తాను (2 కొరింథీయులకు 2:14). దేవుని మూలంగా పుట్టిన నేను లోకాన్ని, చీకటి కార్యాలను, అలాగే లోకంలో ఉన్న చెడును

జయించాను. క్రీస్తులో నేను జయించువాడను (1 యోహాను 5:4). దేవుడు నన్ను లేవనెత్తి, పరలోకంలో క్రీస్తుతో కూడా తన కుడిచేతివైపున నన్ను కూర్చోపెట్టారు. చీకటి శక్తుల మీదను, సాతాను మీద దురాత్మల మీద అధికారముండే స్థానంలో నేను కూర్చున్నాను (ఎఫెసీయులకు 2:4-6).

పరలోకంలోనున్న ప్రతి ఆశీర్వాదంతో క్రీస్తులో నేను దీవించబడ్డాను. దేవుని దీవెనలన్నీ నావే. విశ్వాసం ద్వారా నేను వాటిని పొందుకుని వాటిలో నడుస్తాను (ఎఫెసీయులకు 1:3). క్రీస్తులో నేను అబ్రాహాము దీవెనలకు వారసుడను. నేను నీతిగా చేయబడ్డాను. నేను దేవుని స్నేహితుడను. నేను అన్ని విషయాలలో దీవించబడ్డాను. నేను అనేక దేశాలకు దీవెనగా ఉండడానికి దీవించబడ్డాను. నా శత్రువులమీద నాకు జయముంది (గలతీయులకు 3:29). దేవునిలో ఆయన వాగ్దానాలన్ని అవును అన్నట్లుగానే ఉన్నాయి. నా జీవితంలో ఆయన వాగ్దానాలు నెరవేరతాయి (2 కొరింథీయులకు 1:20).

"క్రీస్తులో నేను" ఏమైయున్నానో అదే నేను!

# విషయ సూచిక


1. మాటలు రెండు రంగములలో నూ ప్రాముఖ్యమైనవి 1
2. ఆధిపత్యం మాటల ద్వారా వ్యక్తమవుతుంది 3
3. మిమ్మల్ని మీరు వాక్యానుసారంగా పిలుచుకోండి 5
4. మీ మాటలు ఆశీర్వాదాన్ని ఇస్తాయి 7
5. దేవుని వాక్యము నీ కొరకు ముందుగా వ్రాయబడిన నివేదిక, దానిని ప్రకటించు! 9
6. ఆయన వాక్యము నీ దగ్గరనే ఉంది — ఆయన వాక్కును ప్రకటించు 11
7. మీ నోటిలో ఆయన మాటలను ఉంచండి 13
8. ఆయన వాగ్దానాలు నిలుచును — అలాగే మన ప్రకటన కూడా నిలుచును 15
9. దేవునితో మీ నిబంధనను ప్రకటించండి 17
10. దేవునికి అంగీకారంగా ఉన్న మాటలనే మాట్లాడండి 19
11. ప్రతి పరిస్థితిలో దేవుడు నీకు ఏమైయున్నాడో ప్రకటించు 21
12. ప్రకృతి యెహోవా స్వరానికి స్పందిస్తుంది 23
13. ప్రకృతి ఆయన వాక్కు ద్వారా రూపించి నిర్మించబడింది 25
14. నీ నాలుక నీకు మంచి రోజులను మరియు దీర్ఘాయుష్షును తీసుకురాగలదు 27
15. ఆయన మాటను ప్రకటించడం ఆయన నిబంధనను ప్రకటించడమే 29
16. నేను యెహోవా గురించి చెప్తాను 31
17. దూతలు ఆయన వాక్యపు స్వరాన్ని వింటాయి 34

18. యెహోవా విమోచించినవారు ఆ మాట
పలుకుదురు గాక 36
19. రక్షణను గూర్చిన ఉత్సాహ స్వరాన్ని వినిపించండి 38
20. నీ జీవితాన్ని తీర్చిదిద్దే శక్తులు నీ హృదయంలో
నుండి వస్తాయి 40
21. నీతిమంతుని మాటలు జీవాన్ని బలాన్ని కలిగిస్తాయి 42
22. మాటలు, స్వస్థపరచి మరియు సంపూర్ణులుగా
చేయగలవు 44
23. ఇంపైన మాటల శక్తిని విడుదల చేయండి 46
24. నీ జీవితము, నీ నోటి మాటల ఫలము ద్వారా
నింపబడుతుంది 48
25. నీ మాటలకు జీవమరణముల శక్తి ఉంది 50
26. నీ నోట ఆయన వాక్కు, దేశములను ప్రభావితము
చేస్తుంది 52
27. ఎండిన ఎముకలలో జీవాత్మ వచ్చునట్లు వాటితో
ప్రకటించు 53
28. మీ మాటలు పరలోకంలో వినబడతాయి 55
29. మాటలు ఆత్మీయ రంగము నుండి భౌతిక
రంగములోనికి ప్రసారమవుతాయి 57
30. బలహీనుడు నేను బలవంతుడను అనుకోవాలి 59
31. మీ మాటలతో దేవున్ని దుఃఖపర్చవద్దు 62
32. "ఇలా రాయబడింది" అని యేసు ప్రభువు చేప్పి
నట్ లుగా చెప్పడం నేర్చు కోండి 64
33. వాక్యంతో దురాత్మలను పారద్రోలండి 66
34. మీరు భూమి మీద ఆయనను ఒప్పుకుంటే,
పరలోకంలో ఆయన మిమ్మల్ని ఒప్పుకుంటారు 68
35. మాటలు మీ హృదయంలో ఉన్న దానినే మీ
జీవితంలోనికి విడుదల చేస్తాయి 70

36. మీ మాటలను బట్టే మీరు నీతిమంతులుగా తీర్పుతీర్చబడతారు లేదా ఖండించబడతారు 72
37. మాటలు బంధించడానికి విప్పడానికి రాజ్యపు అధికారాన్ని విడుదల చేస్తాయి 74
38. పర్వతంతో మాట్లాడండి 76
39. మీరు ఆశించిన ఫలితాన్ని ప్రకటించండి 78
40. మీరు చెప్పింది జరుగుతుందని నమ్మండి 80
41. విశ్వాసపు మాటలతో ప్రార్థించండి 82
42. ఆయన మాటను అంగీకరించండి 84
43. వ్యాధులను విడిచిపొమ్మని ఆజ్ఞాపించండి 86
44. తుఫానుతో మాట్లాడండి 88
45. ప్రజలు తమ బంధకాల నుండి విడుదల పొందారని ప్రకటించండి 90
46. అభిషేకించబడిన మాటలు ఆత్మ యొక్క జీవాన్ని కలిగి ఉంటాయి 92
47. విశ్వాసంతో ఆజ్ఞాపించండి 94
48. వాక్యం మిమ్మల్ని మీ స్వాస్థ్యములోనికి తీసుకువస్తుంది 96
49. నాకు చెప్పిన ప్రకారమే జరుగుతుందని నేను నమ్ముతున్నాను 98
50. లేనివి ఉన్నట్లుగానే ప్రకటించండి 100
51. ఆయన వాగ్దానం ప్రకారం ప్రకటించండి 102
52. జీవం కలిగి పాలించండి — అధిపత్యం కలిగిన మాటలను ప్రకటించండి 104
53. విశ్వాసం ఇలా చెప్తుంది 106
54. ఒప్పుకోవడం రక్షణ పొందడానికే 108
55. ఆయన ఇచ్చిన అన్ని వాగ్దానాలకు మీరు “అవును, ఆమెన్” అని ప్రకటించండి 110

56. మేము నమ్మాము కాబట్టి మేము ప్రకటిస్తాము 112
57. కృప కలిగిన మాటలనే మాట్లాడండి 114
58. ఆత్మ ఖడ్గాన్ని ఉపయోగించండి 115
59. ప్రవచనాత్మక మాటలతో మంచి పోరాటం పోరాడండి 117
60. క్రీస్తును బట్టి మీలో ఉన్న ప్రతి మంచి విషయాన్నీ అంగీకరించండి 118
61. ఆయన వాక్యం మీ లోకాన్ని నిలబెట్టి క్రమపరుస్తుంది 120
62. యేసు ప్రభువు మనం ఒప్పుకున్నదానికి ప్రధాన యాజకుడు 122
63. మీరు ఒప్పుకొన్నదానిని గట్టిగా పట్టుకోండి 123
64. ఆయన మాటలు ఈ లోకాన్ని రూపొందించాయి 125
65. దేవుడు చెప్పారు కాబట్టి మనం ధైర్యంగా చెప్తాము 127
66. మీ నాలుకను నియంత్రించి, మీ వ్యక్తిత్వమంతటిని పాలించండి 129
67. మీ మాటలు మీ జీవితాన్ని నడిపిస్తాయి, పాలిస్తాయి, ఆశీర్వదిస్తాయి 131
68. విశ్వాసాన్ని నిలకడగా ప్రకటించండి 133
69. అపవాదిని ఎదురించండి 135
70. దీవెనకరమైన మాటలను మాట్లాడండి 136
71. మాటలు విజయం కొరకు మీ విశ్వాసాన్ని విడుదల చేస్తాయి 138
72. మనం దేవుని సంబంధులం, కాబట్టి మనం దేవుని సంబంధులుగా మాట్లాడతాము 140
73. మనం గొర్రెపిల్ల రక్తం ద్వారా, మనమిచ్చిన సాక్ష్యం ద్వారా జయిస్తాము 142

# పరిచయం

యేసులో నా వ్యక్తిగత ఆత్మీయ ప్రయాణాన్ని మరోసారి పరిశీలించి నప్పుడు, నన్ను బలపరుచుటలో సహాయపడిన అభ్యాసాలలో లేదా క్రమశిక్షణాంశాలలో ఒకటి ఏమిటంటే నా విశ్వాసాన్ని ప్రకటించడమే. నేను యవ్వన ప్రాయంలో ఉన్నప్పటి నుండే ప్రతిరోజు నేను దేవునితో గడిపే సమయంలో కనీసం 30 నిముషాలను లేదా అంతకంటే ఎక్కువ సమయాన్నీ నా జీవిత వర్తమానం కొరకు భవిష్యత్తు కొరకు దేవుని వాక్యాన్ని ప్రకటించడం నాకు గుర్తుంది. మొదటి నుండి చివరి వరకు నా జీవితంలోని అన్ని అంశాలపై దేవుని వాక్యాన్ని ప్రకటిస్తూ క్రీస్తులో నేను ఏమైయున్నానో అది ప్రకటించేవాడిని. దీని వల్ల ప్రతి రోజు నా విశ్వాసం వృద్ధి చెందింది. దాదాపు ప్రతి సందర్భంలోను ఈ విధంగా ఆలోచించడం, దేవుడు చెప్పేది చెప్పడం, నా విశ్వాసాన్ని ప్రకటించడంతో నా స్వభావంగా మారిపోయింది. ఇలా చేయడం వలన ప్రతి స్థితిలోనుండి విజయోత్సాహంతో బయటకు రావడానికి అది నాకు సహాయపడింది. ఇలా నిష్ఫలం కానీ శక్తివంతమైన ఆయన వాక్కును చివరి వరకు నేను విశ్వాసంతో ప్రకటిస్తూ జీవించడమే నాకు ఇష్టమైన జీవిత విధానము. నన్ను ఎంతో సంపన్నం చేసిన దానిని అంటే దేవుని మీద అలాగే ఆయన వాక్యం మీద ఉన్న విశ్వాసాన్ని నిత్యం ప్రకటించడమనే ఈ సులువైన అలవాటును మీకు అందించడానికే ఈ పుస్తకాన్ని రూపొందించాము. **దీనిని మీ జీవన శైలిగా చేసుకోండి.**

దేవుడు సృష్టినంతా సృష్టించారు. ఆయన సృష్టించిన లోకాలను పాలించే నియమాలను కూడా ఆయన నియమించారు. మనం సహజమైన భౌతిక లోకంలోని నియమాలను అర్థం చేసుకుంటాము. భౌతిక శాస్త్రంలో, రసాయన శాస్త్రంలోను అలాగే ఇతర శాస్త్రాలలో ఉన్న అనేక నియమాలను మనం పాటిస్తాము. మన మేలుకై వాటిని

ఉపయోగించుకుంటాము. వాటిని మీరితే ఫలితం చాలా వినాశకరంగా ఉంటుంది కాబట్టి వాటి పట్ల జాగ్రత్తగా ఉంటాము. అదే విధంగా ఆత్మీయ రంగముతో సహజ రంగముతో కలిసి పని చేసే ఆత్మీయ నియమాలు కూడా ఉన్నాయి. సహజ రంగము ఆత్మీయ రంగము నుండే వచ్చింది కాబట్టి ఆత్మీయ నియమాలు సహజ రంగాన్ని కూడా ప్రభావితం చేస్తాయి. ఆత్మీయ నియమాలలో కొన్ని దేవుని వాక్యంలో మనకు బయలు పర్చబడ్డాయి కాబట్టి వాటిని గ్రహించి వాటి ప్రకారం మనం జీవించాలి.

లేఖనాలలో తెలిపిన అనేకమైన ఆత్మీయ నియమాలు లేదా సత్యాల్లో మనం దేవుని వాక్కుకున్న శక్తిని, మనం ప్రకటించిన మాటల్లో ఉన్న శక్తిని, విశ్వాసంతో మనం ప్రకటించిన దేవుని వాక్యానికున్న శక్తిని, ఇంకా పరిశుద్ధాత్మ ప్రేరేపణతో ప్రకటించిన మాటల శక్తిని (ప్రవచనాలు) మనం తెలుసుకుంటాము. దేవుని వాక్యంలోనే అంతర్లీన శక్తి ఉంది. బైబిలు అనేది మనం గ్రహించడానికి లిఖిత పూర్వకంగా ఇవ్వబడిన దేవుని వాక్యము. వ్యక్తిగతంగా మన జీవితాలను ప్రభావితం చేసే శక్తి మన నోటి మాటలకు ఉంది. దేవుని మీద ఆయన వాక్యం మీద ఉన్న విశ్వాసంతో మనం ప్రకటించిన మాటలలో శక్తి ఉంది. మన విశ్వాసం దేవునిలోను ఆయన వాక్యంలోను ఉంటుంది. మన హృదయాలలోనున్న దేవుని వాక్యం నుండి విశ్వాసంతో ప్రకటించిన మాటలు పర్వతాలను కదిలిస్తాయి, తుఫానును నెమ్మదింప చేస్తాయి, అలాగే మన రంగములో మానవాతీతమైన కార్యాలను చేస్తాయి. పరిశుద్ధాత్మ ప్రేరేపణతో మాట్లాడే మాటలలో కూడా శక్తి ఉంది. పరిశుద్ధాత్ముడు మనల్ని ప్రేరేపించి ఆయన ఉద్దేశాలు మన రంగములో ప్రకటించమని సూచిస్తారు. మనం ఆయన చెప్పినట్లు చేస్తే సహజ రంగములో బలమైన కార్యాలు జరుగుతాయి. ఇవన్నీ మనం మాట్లాడే మాటలతో ముడిపడి ఉన్నాయి.

లేఖనమంతటిలో, దేవుడు తన ప్రజలను తన వాక్యంను

ప్రకటించమని ఆజ్ఞాపించారు. మన హృదయాలలో ఉన్న విశ్వాసంతో మన నోటితో పలికిన ఆయన వాక్కు అద్భుతాలను చేసే ఆయన సృజనాత్మక శక్తిని మన సహజ రంగములో విడుదల చేస్తుంది. మన నోటితో ప్రకటించే ఆయన వాక్యం శత్రువుని వ్యతిరేకించే మన ఆయుధంగా మారుతుంది.

మన వర్తమానం భవిష్యత్తు మీద దేవుని వాక్యం ప్రకటించడం ద్వారా మన లోకాన్ని రూపొందించుకోవచ్చు. మనం ఎప్పుడూ అన్ని పరిస్థితిలలో విశ్వాసంతో నిండిన మాటలనే మాట్లాడడం నేర్చుకోవాలి. విశ్వాసంతో మాట్లాడడమంటే, ఆటంక పరిచే పర్వతం లేదనో లేదా తీవ్రమైన తుఫాను లేదనో చెప్పడం కాదు కాని ఆ పర్వతానికి అడ్డుగా నిలబడే హక్కు లేదని విశ్వాసంతో చెప్పడమే. విశ్వాసం గాలి తుఫానులకు తీవ్ర నష్టాన్ని కలిగించే హక్కు లేదని చెప్పి, దేవుడు విడుదల చేసే శాంతికి నెమ్మదికి మార్గాన్ని ఇస్తుంది. విశ్వాసం అనారోగ్యంతో మాట్లాడి విడిచిపొమ్మని ఆజ్ఞాపించి, దేవుని నుండి వచ్చే స్వస్థతకు సంపూర్ణతకు దారి ఇస్తుంది.

అనేకమంది ఆత్మనూన్యతతో, అవిశ్వాసంతో, భయంతో, సందేహాలతో, ఆందోళనతో, నిరాశతో అలాగే అనేకమైన భావోద్రేకమైన సమస్యలతో భారాలతో సతమతమవుతున్నారు. మానసికమైన సంపూర్ణమైన స్వేచ్ఛ కోసం స్వస్థత కోసం దేవుని వాక్యాన్ని మన జీవితాలలో అలాగే అన్ని పరిస్థితులలో మనస్ఫూర్తిగా ప్రకటించడం మనం అలవాటు చేసుకోవాలి. అది అలవాటు చేసుకోండి. అది ఉచితమే! దానికి కావాల్సిందంతా కాస్త విశ్వాసం, క్రమశిక్షణ మాత్రమే. మీరు మరలా అదే స్థితిలో ఉండరు.

మన మాటలకు, దేవుని వాక్యాన్ని ప్రకటిస్తే వచ్చే శక్తికి, విశ్వాసంతో ప్రకటించే మాటల శక్తికి, ఆత్మ ప్రేరేపణతో మాట్లాడే మాటల శక్తికి ఉన్న ప్రాముఖ్యత గురించి మనకు తెలియజేసే కొన్ని ముఖ్యమైన లేఖనభాగాలను అందించే ప్రయత్నం ఇక్కడ

చేశాము. (ఈ జాబితాకు మీరు మరి కొన్ని లేఖన భాగాలను జత చేయాలనుకుంటే వాటిని కూడా తప్పకుండ చేర్చవచ్చు.) వీటినంటిని క్లుప్తంగా సులభంగా అర్ధమయ్యే అధ్యాయాలుగా మీకోసం పొందుపరచాము. మీ వ్యక్తిగత ప్రార్ధన సమయంలో, కుటుంబ ప్రార్ధనలో లేదా చిన్న గ్రూపులలో అనుదినం ధ్యానించడానికి ఈ పుస్తకాన్ని ఉపయోగించండి. మీ వర్తమాన భవిష్యత్తుల మీద దేవుని వాక్యాన్ని విశ్వాసంతో ప్రకటించడానికి ఉన్న శక్తిని మీరు జ్ఞాపకం చేసుకోవడానికి దీనిని తరచూ చదవండి. మీ విశ్వాసాన్ని ప్రకటిస్తున్నప్పుడు దేవుని వాక్యపు శక్తి మీ జీవితాన్ని మార్చనివ్వండి.

దేవుడు మిమ్మల్ని దీవించునుగాక!
ఆశిష్ రాయచూర్

# 1
# మాటలు రెండు రంగములలో నూ ప్రాముఖ్యమైనవి

**ఆదికాండము 1:1-5**
**1 ఆదియందు దేవుడు భూమ్యాకాశములను సృజించెను.**
**2 భూమి నిరాకారముగాను శూన్యముగాను ఉండెను; చీకటి అగాధ జలము పైన**
**కమ్మియుండెను; దేవుని ఆత్మ జలములపైన అల్లాడుచుండెను.**
**3 దేవుడు–వెలుగు కమ్మని పలుకగా వెలుగు కలిగెను.**
**4 వెలుగు మంచిదైనట్టు దేవుడు చూచెను; దేవుడు వెలుగును చీకటిని వేరుపరచెను.**
**5 దేవుడు వెలుగునకు పగలనియు, చీకటికి రాత్రి అనియు పేరు పెట్టెను.**
**అస్తమయమును ఉదయమును కలుగగా ఒక దినమాయెను.**

దేవుడు గొప్ప రూపకర్త శిల్పి, సమస్తాన్ని సృష్టించిన సృష్టికర్త. ఈ విశాలమైన సృష్టిలో ఉన్న అనేక విషయాలను కనుగొనడానికి, వాటిని గ్రహించడానికి మనం ఇంకా ప్రయత్నిస్తూనే ఉన్నాము. దేవుడు అనంతుడు. ఆయన అనంతుడని ఆయన సృష్టి అనేక విధాలుగాప్రకటిస్తుంది. నిజానికి దేవుడు తన సృజనాత్మక శక్తిని అనేక విధాలుగా చూపించవచ్చు. ఒకవేళ ఆయనకు ఆలోచన వస్తే చాలు ఆయన ఆలోచన ఈ భౌతిక లోకంలో రూపుదిద్దుకుంటుంది. బహుశా ఆయన తమ నమూనా ప్రకారం సహజ రంగమునకు ఆకృతిని ఇచ్చి రూపొందించడానికి దూతల సమూహమును ఉపయోగించుకోవచ్చు. అయితే, దేవుడు తన మాటలతో అన్నింటిని ఉనికిలోనికి తెచ్చారు. దేవుడు తన మాటలతో సృష్టిని చేసారని బైబిలు బయలుపరుస్తుంది. “దేవుడు... పలికెను... ఆ ప్రకారము ఆయెను...”

ఆయన మనసులో ఉన్నదానిని ఉనికిలోనికి తీసుకొని రావడానికి ఆయన మాటలలో ఆయన ప్రణాళిక ఆయన సృజనాత్మక శక్తి ఉన్నది. ఈ సత్యాన్ని లేఖనాలలో మనకు మరల మరల తెలిపారు. దేవుడు తన మాటల ద్వారా పని చేస్తారు. ఆయన మాట్లడతారు,

ఆయన మాట్లాడింది జరుగుతుంది. సహజ రంగములో ప్రతిదీ కూడా ఆయన వాక్కుకు లోబడి ఆయన మాటలకు స్పందిస్తుంది.

దేవుడు ఆత్మయై ఉన్నారు. ఆయన మాటలను ఉపయోగించి సహజ రంగమును ఉనికిలోనికి తీసుకువచ్చారు. కాబట్టి, మాటలు ఈ రెండు రంగములను కలుపుతాయి. ఆత్మీయ రంగము నుండి వచ్చే మాటలకు సహజ రంగము స్పందిస్తుంది.

మానవులమైన మనం దేవుని పోలికలో చేయబడ్డామని బైబిలు చెప్తుంది. మనం ఆత్మ, జీవం (మనస్సు, భావాలు), శరీరం కలిగి ఉంటాము (1 థెస్సలొనీకయులకు 5:23). మన మాటలు ఆత్మీయ రంగమును సహజ రంగమును రెంటిని కలుపుతాయి. మన మాటలు దేవునితో (లేదా ఇతర వాటితో అనగా మంత్రగాళ్లు దురాత్మలతో సంబంధాన్ని కలిగి ఉండడానికి తమ మాటలనే ఉపయోగిస్తారు) సంబంధం కలిగి ఉండేలా చేస్తాయి. మన మాటలు సహజమైన రంగమును ప్రభావితం చేస్తాయి. దేవుడు మన ద్వారా తన మాటలను తెలియజేసినప్పుడు ఆయన శక్తి మన ద్వారా విడుదలై మన లోకాన్ని ప్రభావితం చేస్తుంది.

# 2
# ఆధిపత్యం మాటల ద్వారా వ్యక్తమవుతుంది

**ఆదికాండము 1:26-28**
**[26] దేవుడు–మన స్వరూపమందు మన పోలిక చొప్పున నరులను చేయుదము;**
**వారు సముద్రపు చేపలను ఆకాశపక్షులను పశువులను సమస్త భూమిని**
**భూమిమీద ప్రాకు ప్రతి జంతువును ఏలుదురుగాకనియు పలికెను.**
**[27] దేవుడు తన స్వరూపమందు నరుని సృజించెను; దేవుని స్వరూపమందు వాని**
**సృజించెను; స్త్రీనిగాను పురుషునిగాను వారిని సృజించెను.**
**[28] దేవుడు వారిని ఆశీర్వదించెను; ఎట్లనగా–మీరు ఫలించి అభివృద్ధిపొంది విస్తరించి**
**భూమిని నిండించి దానిని లోపరచుకొనుడి; సముద్రపు చేపలను ఆకాశపక్షులను**
**భూమిమీద ప్రాకు ప్రతి జీవిని ఏలుడని దేవుడు వారితో చెప్పెను.**

**ఆదికాండము 2:19,20**
**[19] దేవుడైన యెహోవా ప్రతి భూజంతువును ప్రతి ఆకాశపక్షిని నేలనుండి నిర్మించి,**
**ఆదాము వాటికి ఏ పేరు పెట్టునో చూచుటకు అతని యొద్దకు వాటిని రప్పించెను.**
**జీవముగల ప్రతిదానికి ఆదాము ఏ పేరు పెట్టెనో ఆ పేరు దానికి కలిగెను.**
**[20] అప్పుడు ఆదాము సమస్త పశువులకును ఆకాశపక్షులకును సమస్త**
**భూజంతువులకును పేరులు పెట్టెను. అయినను ఆదామునకు సాటియైన**
**సహాయము అతనికి లేక పోయెను.**

దేవుడు పురుషుడిని స్త్రీని సృష్టించి వారికి ఒక ఆజ్ఞ ఇచ్చారనే విషయాన్ని ఆదికాండములోని మొదటి రెండు అధ్యాయాలలో మనం చూస్తాము. దానినే మనం 'ఆదికాండపు ఆజ్ఞ' అని పిలుస్తాము. 'ఆదికాండపు ఆజ్ఞలో' భాగంగా మానవులు భూమి మీదనున్న సృష్టినంతటి మీద ఆధిపత్యాన్ని కలిగివుండాలి. ఆధిపత్యం కలిగి ఉండడమంటే ఏలుబడి చేయడం లేదా పాలించడము. ఆశ్చర్యకరంగా, పేరు పెట్టమని ప్రతి జీవిని దేవుడు ఆదాము దగ్గరకు రప్పించారు. దాని అర్థం ఏమిటంటే, ప్రతి జీవికి ఎవరు ఆధిపత్యంలో ఉన్నారో తెలుస్తుంది. దేవుడు ఆదాముకు భూమంతటి మీద అధికారం ఇచ్చారు. దాని అర్థం ప్రతి జీవి ఆదాము ఆధిపత్యం క్రింద ఉన్నట్లే, అందులో సందేహమేమీ లేదు. స్వయానా దేవుని దగ్గర నుండే ఆదాముకు ఈ

అధికారం వచ్చింది. ఆదాము ప్రతి జీవికి పేరు పెట్టడమనే బాధ్యతను పొందినప్పుడు దేవుడు తనకిచ్చిన ఆ ఆధిపత్యాన్ని అలాగే పాలనను మాటల ద్వారా అతడు వ్యక్తపరిచాడు. ఈ ప్రక్రియ అంతటిలో దేవుడు అతనికి తోడుగా ఉన్నారు.

దేవుడు ఈ ఆదికాండపు ఆజ్ఞను వెనక్కి తీసుకోలేదు. మనం ఆధిపత్యం కలిగి ఉండడానికి దేవుని చేత రూపించబడ్డాము. ఆధిపత్యం మాటల ద్వారా అమలుపర్చబడుతుంది. ఈ లోకంలో దేవుడు మీకిచ్చిన ఆధిపత్యాన్ని మీ మాటలతో వ్యక్తపరచండి.

# 3
# మిమ్మల్ని మీరు వాక్యానుసారంగా పిలుచుకోండి

**ఆదికాండము 17:4,5,15,16**
**4 ...ఇదిగో నేను నియమించిన నా నిబంధన నీతో చేసియున్నాను; నీవు అనేక జనములకు తండ్రివగుదువు.**
**5 మరియు ఇకమీదట నీ పేరు అబ్రాము అనబడదు; నిన్ను అనేక జనములకు తండ్రినిగా నియమించితిని గనుక నీ పేరు అబ్రాహాము అనబడును.**
**15 మరియు దేవుడు–నీ భార్యయైన శారయి పేరు శారయి అనవద్దు; ఏలయనగా ఆమె పేరు శారా**
**16 నేనామెను ఆశీర్వదించి ఆమెవలన నీకు కుమారుని కలుగ జేసెదను; నేనామెను ఆశీర్వదించెదను; ఆమె జనములకు తల్లియై యుండును; జనముల రాజులు ఆమెవలన కలుగుదురని అబ్రాహాముతో చెప్పెను.**

అబ్రాహామును నూతన నిబంధనలో 'విశ్వాసులకు తండ్రి' అని పిలుస్తారు. ఆసక్తికరంగా దేవుడు అబ్రాము శారయిల విషయంలో ఆయన వారికిచ్చిన వాగ్దనం ప్రకారం వారు ఒకరిని ఒకరు పేరులను మార్చుకుని పిలుచుకోవడం అవసరమని తలంచారు.

అబ్రాము అంటే, "హెచ్చించబడ్డ తండ్రి" అని అర్ధమయితే అబ్రాహాము అంటే "జనములకు తండ్రి" అని అర్ధము.

శారయి అంటే "యువరాణి లేదా ఆధిపత్యం చేసే వ్యక్తి" అని అర్ధమయితే శారా అంటే "రాణి లేదా యువరాణికి తల్లి" అని అర్ధము.

అబ్రాహాము తనను తాను ఆ పేరుతో పిలుచుకున్న ప్రతిసారి తన జీవితం మీద దేవుని వాగ్దానాన్ని ప్రకటిస్తున్నాడు. దేవుడు నా గురించి చెప్పిన ప్రకారం "నేను అనేక జనములకు తండ్రిని" అనే విషయాన్ని అతడు చెప్పుతున్నాడు. శారా తనను తాను ఆ పేరుతో పిలుచుకున్నప్పుడు ఆమె తన జీవితం మీద దేవుని

వాగ్దానాన్ని ప్రకటిస్తుంది. దేవుడు నా గురించి "జనములకు, రాజులకు, యువరాజులకు తల్లిని" అని చెప్పారనే విషయాన్నీ ఆమె వెల్లడిస్తుంది. అప్పటికి వారికి ఇంకా బిడ్డ పుట్టలేదు. అయినా వారు దేవుడు పలికిందే నిజమని ప్రకటిస్తున్నారు. అలా వారు దేవుని వాగ్దానం ప్రకారం పిలుచుకునేటప్పుడు మొదట్లో అది చాలా బుద్ధిహీనంగా హాస్యాస్పదంగా అనిపించవచ్చు. కానీ ఆ వాగ్దానం నెరవేరింది, దేవుడు వారిని ప్రకటించిగానే వారు అయ్యారు! అలా వారు తమను తాము దేవుని వాగ్దానం ప్రకారం పిలుచుకోవడంలో ఏమైనా తప్పు చేస్తున్నారా? ఖచ్చితంగా కాదు! అలా చేయమని దేవుడే వారికి చెప్పారు. రోమా పత్రిక 4వ అధ్యాయంలో పౌలు దీని గురించి వివరించాడు. దీనిని మనం తర్వాత పరిశీలిద్దాము. అబ్రాహాముకున్న విశ్వాసపు మాదిరిని అనుసరించమని మనకు చెప్పారు.

దేవుడు తన ప్రజలకు అలాగే యేసు క్రీస్తులో విశ్వాసముంచిన వారికి ఇచ్చి వాగ్దానాలు రాయబడిన దేవుని వాక్యం మనకు ఉంది. ఈ వాగ్దానాలు దేవుని ప్రజలందరికి అందుబాటులో ఉన్నాయి. తన ప్రజలకు ఆయన ఇచ్చే వారసత్వంలో పాలు పంచుకునే భాగ్యాన్ని దేవుడు మనకిచ్చారు (కొలొస్సయులకు 1:12). మీ జీవితంలో దేవుని వాగ్దానాలలో ఉన్న సత్యాన్ని ప్రకటించాలి. దేవుని వాక్యానుసారంగా మిమ్మల్ని మీరు పిలుచుకోండి. మీరు ఎవరని దేవుడు చెప్తున్నారో అదే మీరు. మీరు ఏమి చేయగలరని దేవుడు చెప్పుతున్నారో అది మీరు చేయగలరు. ఆయన వాగ్దానం చేసిన ప్రకారంగానే మీరు ఉంటారు.

# 4
# మీ మాటలు ఆశీర్వాదాన్ని ఇస్తాయి

**సంఖ్యాకాండము 6:22-27**
**22 యెహోవా మోషేకు ఈలాగు సెలవిచ్చెను–నీవు అహరోనుతోను అతని కుమారులతోను ఈలాగనుము**
**23 –మీరు ఇశ్రాయేలీయులను ఈలాగు దీవింపవలెను.**
**24 యెహోవా నిన్ను ఆశీర్వదించి నిన్ను కాపాడునుగాక;**
**25 యెహోవా నీకు తన సన్నిధిని ప్రకాశింపజేసి నిన్ను కరుణించునుగాక;**
**26 యెహోవా నీమీద తన సన్నిధి కాంతి ఉదయింపజేసి నీకు సమాధానము కలుగజేయును గాక.**
**27 అట్లు వారు ఇశ్రాయేలీయులమీద నా నామమును ఉచ్చరించుటవలన నేను వారిని ఆశీర్వదించెను.**

మాటలు ఆశీర్వాదాన్ని అందించే సాదనాలు. దేవుడే దీనిని నియమించారు. మనం ఇక్కడ, దేవుడు తన ప్రజలను దీవించేలా దేవుని నామమును వారి మీద ప్రకటించి దేవుని ప్రజలను దీవించడానికి ప్రధాన యాజకునికి దేవుడు స్పష్టమైన సూచనలిచ్చారు. ప్రధాన యాజకుడు ప్రజలతో చెప్పుతూ యెహోవా నామములో వారి మీద ఆశీర్వాదాన్ని ప్రకటిస్తాడు. ఈ విధానంలో పాత నిబంధనలోని దేవుని ప్రజలు ఆశీర్వాదించేవారు. ఇస్సాకు యాకోబు మీద ఆశీర్వాదాలను ప్రకటిస్తూ అతడిని దీవించాడు (ఆదికాండము 27:27-29). యాకోబు ఆశీర్వాదపు మాటలు ప్రకటించి తన కుమారులను దీవించాడు (ఆదికాండము 48,49).

నూతన నిబంధనలోని యాజకులుగా మనం మన జీవితాల మీద, మన కుటుంబాల మీద అలాగే ఇతరుల మీద ప్రభువు నామములో ఆశీర్వాదాల్ని తెచ్చే అవకాశం మనకు కూడా ఉంది. మీ మీద, మీ వర్తమానం మీద అలాగే మీ భవిష్యత్తు మీద ఎలాంటి

మాటలను ప్రకటిస్తున్నారు? మీ కుటుంబం మీద వారి భవిష్యత్తుమీద ఎలాంటి మాటలు ప్రకటిస్తున్నారు? మీ ఆశీర్వాద మాటలు ప్రభువు ఆశీర్వాదాన్ని వారి మీదకి తెస్తాయి.

# 5
# దేవుని వాక్యము నీ కొరకు ముందుగా వ్రాయబడిన నివేదిక, దానిని ప్రకటించు!

**సంఖ్యాకాండము 13:30-33**
**30 కాలేబు మోషే యెదుట జనులను నిమ్మళ పరచి–మనం నిశ్చయముగా వెళ్లుదుము; దాని స్వాధీనపరచుకొందుము; దాని జయించుటకు మన శక్తి చాలుననెను.**
**31 అయితే అతనితోకూడ పోయిన ఆ మనుష్యులు–ఆ జనులు మనకంటె బలవంతులు; మనము వారి మీదికి పోజాలమనిరి.**
**32 మరియు వారు తాము సంచరించి చూచిన దేశమునుగూర్చి ఇశ్రాయేలీయులతో చెడ్డ సమాచారము చెప్పి–మేము సంచరించి చూచిన దేశము తన నివాసులను భక్షించు దేశము; దానిలో మాకు కనబడిన జనులందరు ఉన్నత దేహులు.**
**33 అక్కడ నెఫీలీయుల సంబంధులైన అనాకు వంశపు నెఫీలీయులను చూచితిమి; మా దృష్టికి మేము మిడతలవలె ఉంటిమి, వారి దృష్టికిని అట్లే ఉంటిమనిరి.**

**సంఖ్యాకాండము 14:11**
**యెహోవా–ఎన్నాళ్లవరకు ఈ ప్రజలు నన్ను అలక్ష్యము చేయుదురు? ఎన్నాళ్లవరకు నేను వారిమధ్యను చేసిన సూచకక్రియలన్నిటిని చూచి నన్ను నమ్మక యుందురు?**

పన్నెండు వేగుల కథ మనకి బాగా తెలుసు, వారిలో ఇద్దరు యెహోషువ కాలేబులు. యెహోషువ కాలేబులు కూడా అదే బలమైన శత్రువులను చూశారు కానీ దేవుని యెరిగిన వారిగా ఆయన వారికి చేసిన వాగ్దానాన్ని ఆధారం చేసుకుని తమ అంతిమ నివేదికను ఇచ్చారు. కాలేబు “మనము వారిని జయించగలము” అని చెప్పాడు. 45 సం.ల తర్వాత అదే కాలేబు “కాబట్టి ఆ దినమున యెహోవా సెలవిచ్చిన యీ కొండ ప్రదేశమును నాకు దయచేయుము; ...యెహోవా నాకు తోడైయుండినయెడల యెహోవా సెలవిచ్చినట్లు వారి దేశమును స్వాధీనపరచుకొందును” అని చెప్పాడు (యెహోషువ 14:12). దేవుని వాగ్దానాన్ని పట్టుకుని ఉండి, 45 సం.ల తర్వాత కూడా తాను చెప్పిన విషయంలో ఏ మాత్రం మారలేదు!

దేవుని వాక్యమనేది ముందుగానే రాసిన ఫలితము, నివేదిక. దేవుని వాక్యానుసారంగా మాట్లాడండి. అవును, మనం బలవంతులను ఎదుర్కోవాల్సి ఉండవచ్చు, వారు మనల్ని భయపెట్టేవారిగా కూడా ఉండవచ్చు. పోరాడవలసిన యుద్ధాలు అక్కడ ఉండవచ్చు. దేవుడు మనకు ఇచ్చే దాన్ని స్వత్రించుకునే మార్గం యుద్ధాలు గాని బలవంతులు గాని లేని మార్గం కాదు. బలవంతులు ఎదురైనా యుద్ధాల మధ్యలో ఉన్నా సరే దేవుడు ఎవరో, దేవుడు ఏమి వాగ్దానం చేశారో ప్రకటించండి. మీరు జయిస్తామని ప్రకటించండి, ఎందుకంటే దేవునిలో పుట్టినవారు లోకాన్ని జయిస్తారు (1 యోహాను 5:4). దేవుడు మిమ్మల్ని ఎప్పుడు జయించేలా చేస్తారని ప్రకటించండి (2 కొరింథీయులకు 2:14). దేవుడు మిమ్మల్ని జిగటగల ఉబిలోనుండి పైకి లేవనెత్తుతారని, బండ మీద మీ కాళ్ళు ఉంచుతారని అలాగే మీ నోటిలో కొత్త పాత ఉంచుతారని ప్రకటించండి (కీర్తనలు 40:1-4). భూమ్యాకాశములను సృష్టించిన యెహోవా నుండి మీకు సహాయం వస్తుందని ప్రకటించండి. మిమ్మల్ని కాపాడువాడు కునుకడు నిదురపోడు (కీర్తనలు 121). మీ దేవుడు ఎవరో ఆయన మీకు ఏమి వాగ్దానం చేశారో ప్రకటించండి. ముందుగానే రాసిన మీ ఫలితం అదే.

# 6
# ఆయన వాక్యము నీ దగ్గరనే ఉంది — ఆయన వాక్కును ప్రకటించు

**ద్వితీయోపదేశకాండము 30:11-14**
**[11] నేడు నేను నీకాజ్ఞాపించు ఈ ధర్మమును గ్రహించుట నీకు కఠినమైనది కాదు, దూరమైనది కాదు.**
**[12] మనము దానిని విని గైకొనునట్లు, ఎవడు ఆకాశమునకు ఎక్కిపోయి మనయొద్దకు దాని తెచ్చును? అని నీవనుకొనుటకు అది ఆకాశమందు ఉండునది కాదు;**
**[13] మనము దాని విని గైకొనునట్లు, ఎవడు సముద్రము దాటి మన యొద్దకు దాని తెచ్చును అని నీవను కొననేల? అది సముద్రపు అద్దరి మించునది కాదు.**
**[14] నీవు దాని ననుసరించుటకు ఆ మాట నీకు బహు సమీపముగా నున్నది; నీ హృదయమున నీ నోటనున్నది.**

దేవుని ప్రజలు ఆయన మాటను తమ నోటిలో, తమ హృదయంలో ఉంచుకోవాలని ఆయన కోరుకున్నారు. వారు తమ నోటిలో తమ హృదయంలోను ఆయన వాక్కును ఉంచుకుని దాని ప్రకారం జీవించాలని ఆయన కోరుకున్నారు. మన హృదయాలలో మన నోటిలో దేవుని వాక్యం ఉండాలి. ఆయన వాక్కుతో మన హృదయాలు నిండిపోవాలి. ఆయన వాక్కు ద్వారా మన హృదయాలలో విశ్వాసం పుడుతుంది. మన హృదయాలలో ఉన్న ఆయన వాక్కును మనం విశ్వసించాలి.ఆయన వాక్యం మన నోటిలో కూడా ఉండాలి. మనం దానిని చెప్తాము ప్రకటిస్తాము. మనం ఆయన నోటి మాటలే మన నోటి మాటలుగా చేసుకోవాలి. ఆయన మాట రహస్యమైనది కాదు లేదా మన ఆలోచనకు అందనిది కాదు. ఆయన వాక్కు మనలో ఉంది - మన హృదయాలలో మన నోటిలో ఉంది. ఈ విధంగా మనం జీవిస్తూ ఉంటే ఆయన వాక్యం మన జీవనశైలిగా మారుతుంది. ఆయన వాక్యానుసారంగానే మనం జీవిస్తాము.

ఆయన వాక్యం మనలో నివసించడం, రక్త మాంసాలుగా

మనలో ఉండడమే దేవుని మార్గము. ఈ విధానాన్నే ఆయన మనకు ఇచ్చారు. ఆయన వాక్యాన్ని మనకు అందుబాటులోకి తెచ్చారని ఆయన చెప్పారు. మన నోటిలో (మన మాటలలో భాగంగా) అలాగే మన హృదయాలలోను (మన నమ్మికలో ఆలోచనలలో భాగంగా) ఆయన వాక్యాన్ని ఉంచినట్లయితే ఆయన వాక్యం మన అనుదిన జీవితంగా మారుతుంది.

# 7
# మీ నోటిలో ఆయన మాటలను ఉంచండి

**యెహోషువ 1:8**
**ఈ ధర్మశాస్త్రగ్రంథమును నీవు బోధింపక తప్పిపోకూడదు. దానిలో వ్రాయబడిన వాటన్నిటి ప్రకారము చేయుటకు నీవు జాగ్రత్తపడునట్లు దివారాత్రము దాని ధ్యానించినయెడల నీ మార్గమును వర్ధిల్లజేసికొని చక్కగా ప్రవర్తించెదవు.**

దేవుని ప్రజలను వాగ్దాన భూమిలోకి నడిపించాలనే అతి పెద్ద బాధ్యత యెహోషువ మీద ఉంది. అతడు మోషే స్థానంలోని వచ్చి దేవుని ప్రజలను ముందుకు నడిపించాలి. దేవుడు ఇచ్చిన అనేక సూచనలలో ఒక సూచన ఏమిటంటే ఈ గ్రంథంలోని మాటలను తన మాటలలో తన ఆలోచనలో (ధ్యానించడం) ఉండాలి. ముఖ్యంగా, దేవుడు యెహోషువకు ఇలా ఆజ్ఞాపించారు, “ఈ ధర్మశాస్త్రగ్రంథమును నీవు బోధింపక తప్పిపోకూడదు. దానిలో వ్రాయబడిన వాటన్నిటి ప్రకారము చేయుటకు నీవు జాగ్రత్తపడునట్లు దివారాత్రము దాని ధ్యానించినయెడల నీ మార్గమును వర్ధిల్లజేసికొని చక్కగా ప్రవర్తించెదవు.”

కాలాలు మారాయి కానీ దేవుని వాక్యం, అలాగే ఆయన వాక్కులోని శక్తి ఏ మాత్రం తరిగిపోలేదు. దేవుని వాక్యం యెహోషువకు అతని కాలంలో తన సమయంలో అతని జీవిత ఉద్దేశ్యం కొరకు ఏమి చేసిందో దానినే మన కాలంలో మన సమయంలో మనందరి ఉద్దేశ్యాల కొరకు కూడా దేవుని వాక్యం చేయగలదు. మనం రాత్రింబగళ్లు దేవుని గ్రంథంలోని మాటలను మన నోటిలో మన ఆలోచనలో (ధ్యానించడం) నింపుకున్నప్పుడు మనం ఆయన వాక్యానుసారంగా నడుచుకుంటాము. అలా చేయడం వల్ల మనం వర్ధిల్లుతాము ఇంకా మనం చేయవలసిన దానిలో మంచి విజయాన్ని పొందే మార్గాన్ని సులభతరం చేసుకుంటాము.

యెహోషువ 1:8లో ఈ నియమాన్ని మీ జీవితానికి అన్వయించుకొనండి. ఆయన గ్రంథంలోని మాటలను నీ నోటి మాటలుగా చేసుకోండి. దేవుడు చెప్పమనేది చెప్పండి. ఆయన వాక్యాన్ని ధ్యానించి దాని ప్రకారం ఆలోచించండి. ఆయన వాక్యానుసారంగా జీవించండి. అప్పుడు మీరు మీ పనిలో వర్ధిల్లుతారు, గొప్ప విజయాన్ని పొందుతారు.

# 8

# ఆయన వాగ్దానాలు నిలుచును —అలాగే మన ప్రకటన కూడా నిలుచును

**యెహోషువ 14:10-12**

**[10] యెహోవా చెప్పినట్లు యెహోవా మోషేకు ఆ మాట సెలవిచ్చినప్పటి నుండి ఇశ్రాయేలీయులు అరణ్యములో నడచిన యీ నలువది ఐదు ఏండ్లు ఆయన నన్ను సజీవునిగా కాపాడి యున్నాడు; ఇదిగో నేనిప్పుడు ఎనబదియయిదేండ్ల వాడను.**

**[11] మోషే నన్ను పంపిననాడు నాకెంత బలమో నేటివరకు నాకంత బలము. యుద్ధము చేయుటకుగాని వచ్చుచు పోవుచునుండుటకుగాని నాకెప్పటియట్లు బలమున్నది.**

**[12] కాబట్టి ఆ దినమున యెహోవా సెలవిచ్చిన యీ కొండ ప్రదేశమును నాకు దయచేయుము; అనాకీయులును ప్రాకారముగల గొప్ప పట్టణములును అక్కడ ఉన్న సంగతి ఆ దినమున నీకు వినబడెను. యెహోవా నాకు తోడైయుండినయెడల యెహోవా సెలవిచ్చినట్లు వారి దేశమును స్వాధీనపరచుకొందును.**

45 సం.ల తర్వాత కూడా 85 సం.ల వయసున్న కాలేబు అదే తపన పట్టుదల కలిగి దేవుడు వాగ్దానం చేసిన దానిని స్వతంత్రించుకోవాలని చూశాడు. అతడు ఇంకా కొంత మంది బలవంతులతో పోరాడి జయించాల్సి ఉంది, దానికి అతడు సిద్ధంగానే ఉన్నాడు. అతడు 45 సం.ల క్రితం ఎలా చెప్పాడో అదే విధంగా ఇప్పుడు కూడా తన దేవుని మీద తనకున్న విశ్వాసాన్ని ప్రకటించాడు.

దేవుని వాక్యం మీ జీవితంలో నిజమవుతుందని మీరు ఎంతకాలం ప్రకటిస్తారు? అబద్ధం చెప్పడానికి దేవుడు మనిషి కాదు. ఆయన వాక్కు సత్యము. ఆయన వాక్యం నిత్యం నిలిచి ఉంటుంది. ఆయన వాక్కు ఎన్నడూ మారదు. దేవుడు తన వాక్యంలో మీ కోసం ప్రకటించిన వాగ్దానాలు సత్యమైనవి. అది పరలోకంలో స్థిరపరచబడి నిత్యం నిలిచి ఉంది. మన దేవుడు ఉన్నవాడను అనే దేవుడు. ఆయన ఎన్నడూ మార్పు చెందరు. కాబట్టి మనం మన దేవుని గురించి అలాగే ఆయన వాగ్దానాల గురించి చెప్పేది కూడా మార్చకూడదు.

మన దేవుడు ఎవరో మనం చెప్తూనే ఉండాలి. ఆయన మన రక్షకుడు, స్వస్థపరచువాడు, విమోచకుడు, విడిపించేవాడు, సమకూర్చేవాడు, మార్గం ఏర్పరచేవాడు, అద్భుతాలను చేసేవాడు. ఇంకా మన పరమ తండ్రి ఆయనే. ఆయన మనకు మన జీవితంలోని ప్రతి అంశంలో వాగ్దానం చేసిన ప్రతిదీ మేలైనదే నిజమైనదే అని మనం ప్రకటిస్తాము. అప్పుడది సమయం గడుస్తున్నా కొలది మన జీవితంలోని అన్ని సమయాలలో మేలుకరంగా సత్యంగా ఉంటుంది. కాబట్టి ఆయన వాగ్దానం చేసిన దానిని మనం గట్టిగా పట్టుకొని ఉందాము.

కాలేబుకు జరిగినట్లుగానే దేవుడు వాగ్దానం చేసిన దానిలో మీరు అడుగుపెట్టడానికి కాస్త సమయం పట్టవచ్చు. కాబట్టి ఆయన వాగ్దానాలు నిలిచి ఉంటాయని జ్ఞాపకముంచుకోండి. అవి సమయంతో పాటు మారిపోవు. మీ వాగ్దానాలను ప్రకటిస్తూనే ఉండండి.

# 9
# దేవునితో మీ నిబంధనను ప్రకటించండి

**1 సమూయేలు 17:26,36,45**
**[26] దావీదు–జీవముగల దేవుని సైన్యములను తిరస్కరించుటకు ఈ సున్నతి లేని ఫిలిష్తీయుడు ఎంతటి వాడు? వాని చంపి ఇశ్రాయేలీయులనుండి యీ నింద తొలగించిన వానికి బహుమతి యేమని తనయొద్ద నిలిచినవారి నడుగగా**
**[36] మీ దాసుడనైన నేను ఆ సింహమును ఎలుగుబంటిని చంపితినే, జీవముగల దేవుని సైన్యములను తిరస్కరించిన యీ సున్నతిలేని ఫిలిష్తీయుడు వాటిలో ఒకదాని వలె అగుననియు,**
**[45] దావీదు–నీవు కత్తియు ఈటెయు బల్లెమును ధరించుకొని నా మీదికి వచ్చుచున్నావు అయితే నీవు తిరస్కరించిన ఇశ్రాయేలీయుల సైన్యములకధిపతియగు యెహోవా పేరట నేను నీమీదికి వచ్చుచున్నాను.**

దావీదు గొల్యాతును ఓడించడానికి సిద్ధపడుతున్నప్పుడు దావీదుకు తెలిసిన ఒక ముఖ్యమైన సత్యం ఉంది. దావీదు సున్నతి పొందాడు అంటే, అతడు దేవునితో నిబంధన చేసుకున్నాడు. అతడు గొల్యాతును, "సున్నతిలేని ఫిలిస్తీయుడని" పిలిచాడు అంటే, అతనికి దేవునితో నిబంధన చేసుకోలేదు. దావీదు దేవునితో నిబంధన చేసుకున్నాడు కాబట్టి జీవంగల దేవుడు తన పక్షాన్న ఉన్నారని అతనికి తెలుసు. సైన్యములకు అధిపతియైన దేవుడు, పరలోకంలోని భూలోకంలోని దూతల సమూహాల దేవుడు దావీదుతో ఉన్నారు. ఇది చాలా వ్యత్యాసాన్ని తీసుకుని వచ్చింది.

దేవునితో తనకున్న నిబంధనను ఆధారం చేసుకుని దావీదు గొల్యాతును ఎదుర్కోవడానికి వెళ్ళాడు. దావీదు ధైర్యంగా దేవుడు ఎవరో, ఆయన ఏమి చేశారో అలాగే తన ద్వారా ఏమి చేయగలరో ప్రకటించాడు. దావీదు దేవునితో నిబంధన చేసుకున్న వ్యక్తి కాబట్టి ధైర్యంగా మాట్లాడగలిగాడు.

మీరు ఎదుర్కొంటున్న మహాకాయులు ఎవరు? దేవుని మించిన మహాకాయులు ఎవరూ లేరు. సౌలు సైన్యంలో సుశిక్షితులైన సైనికులు గొల్యాతుతో తమను తాము పోల్చుకుంటున్నారు. అందుకే వారెంతో భయపడ్డారు. వారు అతడిని ఎదుర్కోడానికి వెళ్ళలేదు. అయితే దావీదు ఆ మహాకాయుని చూసి, అతడు సైన్యములకు అధిపతియైన యెహోవా ముందు దేనికి సరితూగడని గ్రహించాడు. మీరు ఎదుర్కొంటున్న మహాకాయులు అంటే వ్యాధులు, ఆర్థిక సమస్యలు, అప్పులు, కుటుంబ సమస్యలు, పని చేసే చోట సమస్యలు, కోర్టు సమస్యలు, ఇంకా ఏమైనా సరే అవి దేవునితో సరితూగవని జ్ఞాపకం ఉంచుకోండి. మీరు దేవునితో నిబంధన చేసుకున్నారు కాబట్టి ఆయన మీ పక్షాన్న ఉన్నారు. మీరు మహాకాయులు జయించామని ప్రకటించండి. మహాకాయులు ఓడిపోయారని, మీరు వారిని జయించారని ప్రకటించండి. యేసు క్రీస్తు నామములో మీ విజయాన్ని ప్రకటించండి. దేవుడు మీ పక్షాన ఉన్నారు ఆయనే మీ కోసం పోరాడతారు.

# 10
# దేవునికి అంగీకారంగా ఉన్న మాటలనే మాట్లాడండి

**కీర్తనలు 19:14**
**యెహోవా, నా ఆశ్రయదుర్గమా, నా విమోచకుడా,**
**నా నోటి మాటలును నా హృదయ ధ్యానమును**
**నీ దృష్టికి అంగీకారములగును గాక.**

కీర్తనలు 19లో దావీదు దేవుని గొప్పతనాన్ని ఆయన వాక్యంలోని పరిశుద్ధతను ప్రకటించిన తర్వాత, తన నోటి మాటలు ఆయన దృష్టికి అంగీకారగా ఉండాలని ప్రార్థించాడు. "అంగీకారం" అనే పదానికి హెబ్రీ భాషలో "ఇష్టమైనది, సంతోషకరమైనది, అనుకూలమైనది" అని అర్థము.

మనం మాట్లాడే పదాలను మనం ఎంచుకోవచ్చు. మనం ఆయన దృష్టికి, అంగీకారమైనవి, ఇష్టమైనవి, సంతోషకరమైనవి మాట్లాడడానికి ఎంచుకోవచ్చు. పరిశుద్ధమైన, సంపూర్ణమైన న్యాయమైన వాక్యానుసారంగా మన మాటలు ఉన్నప్పుడు అవి దేవుని దృష్టికి ఖచ్చితంగా అంగీకారమైనవిగా ఇష్టమైనవిగా సంతోషకరమైనవిగా ఉంటాయి. మన మాటలు ఆయన మహిమ గురించి ప్రకటించినప్పుడు అవి ఆయన దృష్టికి అంగీకారంగా ఉంటాయి. మన దేవుడు చేయగల వాటి గురించి మనం చెప్పినప్పుడు మన మాటలు ఆయన దృష్టికి ఇష్టంగా ఉంటాయి. మన దేవుని అద్భుతమైన స్వభావం గురించి, ఆయన ప్రేమ గురించి, ఆయన కనికరం గురించి, ఆయన దయ గురించి మాట్లాడినప్పుడు మన మాటలు ఆయన దృష్టికి అంగీకారంగా ఉంటాయి.

విశ్వాసం దేవునికి ఇష్టుడిగా చేస్తుందని హెబ్రీయులకు 11:6

మనకు బోధిస్తుంది. విశ్వాసపు మాటలు ప్రకటించండి. దేవునిలో మీకున్న విశ్వాసాన్ని ప్రకటించే మాటలను ఆయన తన ప్రజలకు చేసిన కార్యాలను ప్రకటించండి. దేవునిలో మీకున్న విశ్వాసాన్ని, ఆయన వాక్యాన్ని, మీ జీవితంలో కార్యం చేస్తున్న ఆయన శక్తిని తెలిపే మాటలను ప్రకటించండి. విశ్వాసం దేవున్ని సంతోషపరుస్తుంది. దేవునికి విశ్వాసపు మాటలు అంగీకారమైనవిగా ఇష్టమైనవిగా సంతోషకరమైనవిగా ఉంటాయి.

ప్రతీ పరిస్థితిలో దేవుని దృష్టికి అంగీకారమైన, ఇష్టమైన, సంతోషకరమైన మాటలనే మాట్లాడండి. విశ్వాసంగల హృదయంలో నుండి విశ్వాసపు మాటలనే మాట్లాడండి.

# 11
# ప్రతి పరిస్థితిలో దేవుడు నీకు ఏమైయున్నాడో ప్రకటించు

**కీర్తనలు 27:1-3**
**1 యెహోవా నాకు వెలుగును రక్షణయునైయున్నాడు,**
**నేను ఎవరికి భయపడుదును?**
**యెహోవా నా ప్రాణదుర్గము, ఎవరికి వెరతును?**
**2 నా శరీరమాంసము తినుటకై దుష్టులు నామీదికి వచ్చినప్పుడు**
**నన్ను బాధించు శత్రువులు నామీదికి వచ్చినప్పుడువారు తొట్రిల్లికూలిరి**
**3 నాతో యుద్ధము చేయుటకు దండు దిగినను**
**నా హృదయము భయపడదు**
**నామీదికి యుద్ధము రేగినను**
**దీనిలో నేను ధైర్యము విడువకుందును.**

దావీదు తన కష్టసమయంలో ఏమి చెప్పుతున్నాడో గమనించండి. అతడు తనకు చాలామంది శత్రువులు ఉన్నారని గుర్తించాడు. అయినా సరే దేవుడు తనకు ఏమైయున్నారో ప్రకటించాడు—యెహోవా నాకు వెలుగు, నా రక్షణ, నా ప్రాణదుర్గము అని ప్రకటించాడు. దేవుడు తనకు ఏమైయున్నారో అతనికి తెలుసు కాబట్టి దావీదు, "నేను ఎవరికి భయపడుదును?", "నేను ఎవరికీ వెరతును?", "నా హృదయము భయపడదు," "దీనిలో నేను ధైర్యము విడువకుందును" అని ధైర్యంగా చెప్పాడు. దేవుడు తనతో ఉన్నారు కాబట్టి దావీదు తన శత్రువుల ఓటమి గురించి ప్రకటించాడు.

దావీదు మాదిరిని పాటించడం సరియైనదేనా? ఖచ్చితంగా సరైనదే, దేవుడు మనకు ఏమైయున్నారో అనే దానిపై మనం ధైర్యంగా నిలబడాలి. "యెహోవా నాకు వెలుగు నా రక్షనైయున్నారు; నేను ఎవరికి భయపడుదును? యెహోవా నా ప్రాణ దుర్గము; నేను ఎవరికి

వెరతును?" అని మనం కూడా చెప్పవచ్చు. క్లిష్టపరిస్థితులలో దేవుడే మన విమోచకుడని మనం ప్రకటించవచ్చు. వ్యాధి రోగాల మధ్యలో దేవుడే మనల్ని స్వస్థపరుస్తారని ప్రకటించవచ్చు. అవసరతల మధ్యలో దేవుడే మన పోషకుడని ప్రకటించవచ్చు. నిరీక్షణలేని పరిస్థితులలో దేవుడు మన దుఃఖాన్ని నాట్యంగా మారుస్తారని ప్రకటించవచ్చు. మనం రాత్రంతా ఏడ్చినప్పటికి ఉదయాన్నే సంతోషం కలుగుతుందని మనం ప్రకటించవచ్చు.

మనం ఎదుర్కొంటున్న సవాళ్లను మనం నిరాకరించట్లేదు. మనకు శత్రువులు ఉన్నారన్న విషయాన్నీ నిరాకరించట్లేదు. అయితే మనం దేవుడు ఎవరూ అని, ఆయనలో మనకున్న దానిని, ఇంకా మనం ఎలాంటి పరిస్థితులు ఎదుర్కొంటున్నప్పటికి ఆయన వలన మనకున్న నమ్మకాన్ని ప్రకటిస్తున్నాము. ప్రతి పరిస్థితిలో దేవుడు మీకు ఏమైయున్నారో ప్రకటించండి. ప్రతి పరిస్థితిలో ఆయనలో మీకున్న దానిని ప్రకటించండి. ప్రతి పరిస్థితిలో ఆయనవలన మీకున్న ధైర్యాన్ని, విశ్వాసాన్ని, సంతోషాన్ని, విజయాన్ని ప్రకటించండి. దావీదు అలాగే చేశాడు. మీరు కూడా చేయగలరు.

# 12
# ప్రకృతి యెహోవా స్వరానికి స్పందిస్తుంది

**కీర్తనలు 29:3-9**
**3 యెహోవా స్వరము జలములమీద వినబడుచున్నది**
**మహిమగల దేవుడు ఉరుమువలె గర్జించుచున్నాడు.**
**మహాజలములమీద యెహోవా సంచరించుచున్నాడు.**
**4 యెహోవా స్వరము బలమైనది**
**యెహోవా స్వరము ప్రభావము గలది.**
**5 యెహోవా స్వరము దేవదారు వృక్షములను విరచును**
**యెహోవా లెబానోను దేవదారు వృక్షములను ముక్కలుగా విరచును.**
**6 దూడవలె అవి గంతులు వేయునట్లు ఆయన చేయును**
**లెబానోనును షిర్యోనును గురుపోతు పిల్లవలె గంతులు వేయునట్లు ఆయన చేయును.**
**7 యెహోవా స్వరము అగ్నిజ్వాలలను ప్రజ్వలింప జేయుచున్నది.**
**8 యెహోవా స్వరము అరణ్యమును కదలించును**
**యెహోవా కాదేషు అరణ్యమును కదలించును**
**9 యెహోవా స్వరము లేళ్లను ఈనజేయును**
**అది ఆకులు రాల్చును. ఆయన ఆలయములోనున్నవనియు ఆయనకే ప్రభావము అనుచున్నవి.**

దావీదు కీర్తనలలో దేవుని గొప్పతనం గురించి ప్రకటిస్తున్నప్పుడు యెహోవా స్వరానికున్న గొప్పతనాన్ని శక్తిని ప్రకటించాడు. యెహోవా స్వరం యెహోవా వాక్యం ద్వారా విడుదల అవుతుంది. దేవుడు తాను మాట్లాడే మాటల ద్వారా తన స్వరాన్ని వినిపిస్తారు. ప్రకృతిలోని ప్రతీదీ యెహోవా స్వరానికి అంటే యెహోవా వాక్యానికి స్పందిస్తుందని మరోసారి ఈ వాక్యభాగం మనకు తెలియజేస్తుంది. దేవుని వాక్యం (స్వరం) జలముల మీద సంచరిస్తుంది అంటే దేవుడు జలములమీద సంచరిస్తున్నారని అర్థం. యెహోవా వాక్యం (స్వరం) ఆయన శక్తిని ఆయన మహిమను వివరిస్తుంది. సృష్టి అంతా అనగా జీవం ఉన్నవి జీవం లేనివి అన్నీ యెహోవా వాక్యానికి (స్వరానికి) స్పందిస్తాయి.

లేఖనాలలో కొన్నిసార్లు పరిశుద్ధాత్మ దేవుడు ప్రజలను కదిలించినప్పుడు యెహోవా స్వరం మనుషుల స్వరం ద్వారా వచ్చింది. పరిశుద్ధాత్మ దేవుడు వారిని ప్రేరేపించిన కొలది వారి ద్వారా యెహోవా వాక్యం (స్వరం) వచ్చింది. యెహోవా వాక్యం (స్వరం) వారితో ఉందని వారి గురించి చెప్పబడింది. పరిశుదాత్మ అభిషేకం ద్వారా యెహోవా వాక్యం (స్వరం) మనుషుల స్వరం ద్వారా వచ్చినప్పుడు అద్భుతాలు జరిగాయి. బండ నుండి నీరు ప్రవహించింది, సముద్రం ఇంకా నదులు రెండుగా విడిపోయాయి, సూర్యుడు నిలిచిపోయాడు, సూర్యుడు పది అడుగులు వెనక్కి వెళ్ళాడు, నూనె పిండి అధికమయ్యాయి, గొడ్డలి నీటిమీద తేలింది ఇలా అనేకమైనవి జరిగాయి.

విశ్వాసులుగా మనం విశ్వాసంతో దేవుని వాక్యాన్ని ప్రకటించే ధన్యత మనకు ఉంది. దేవుడు ముందే పలికిన వాక్కును తీసుకుని దానిని నమ్మి ఈ రోజు దానిని ప్రకటిస్తున్నాము. గతంలోలాగా దేవుని ఆత్మ మనల్ని కదిలించినప్పుడు ఆయన మనల్ని ప్రేరేపించి మాట్లాడమన్న మాటను మాట్లాడతాము. మనం ఆ మాట మాట్లాడినప్పుడు యెహోవా వాక్యం (స్వరం) మన స్వరాల ద్వారా వస్తుంది. ప్రకృతి దేవుని స్వరానికి స్పందిస్తుంది. ఈ రెండూ చేయడం నేర్చుకోండి. మీ హృదయంలో ఉన్న విశ్వాసంతో దేవుని వాక్యాన్ని ప్రకటించండి. పరిశుద్ధాత్మ దేవుడు ప్రేరేపిస్తున్న కొలది యెహోవా స్వరాన్ని ప్రకటించండి.

# 13
# ప్రకృతి ఆయన వాక్కు ద్వారా రూపించి నిర్మించబడింది

**కీర్తనలు 33:6,9**
**6 యెహోవా వాక్కు చేత ఆకాశములు కలిగెను**
**ఆయన నోటి ఊపిరిచేత వాటి సర్వసమూహము కలిగెను.**
**9 ఆయన మాట సెలవియ్యగా దాని ప్రకారమాయెను**
**ఆయన ఆజ్ఞాపింపగానే కార్యము స్థిరపరచబడెను.**

దేవుడు సమస్తాన్ని తన మాట ద్వారా సృష్టించారనే సత్యం లేఖనమంతా ఉంటుంది. ఆయన మాట్లాడారు. ఆయన ఆజ్ఞాపించారు. తన నోటి ఊపిరిని ఊదారు. ఆయన మాటలు పలికారు. భౌతిక లోకం కలగాలని ఆయన పలికారు. మనం దీనిని అర్థం చేసుకోవడం చాలా ముఖ్యము.

ప్రకృతిలో అలాగే భౌతిక రంగములో కనిపించే ప్రతిదీ దేవుని వాక్యానికి లోబడుతుంది.

దేవుని వాక్యం ఇంకా సృష్టిస్తూనే ఉంటుంది. దేవుని వాక్యం మన లోకంలో (అంటే మన జీవితంలో, మనం రోజు నివసించే లోకంలో) లేని వాటిని ఉండేలా వాటిని కలుగజేస్తుంది. మనం దేవుని వాక్యపు శక్తిని మన లోకంలోనికి విడుదల చేసినప్పుడు, దేవుడు మనకు చేసిన వాగ్దానాన్ని మనం పొందుకుంటాము.

దేవుని వాక్యం మార్చుతుంది, రూపాంతరం చెందిస్తుంది. దేవుని వాక్యం మన లోకంలోనున్న (మన జీవితం, రోజు మనం నివసించే లోకం) వాటిని దేవుడు మనకు చేసిన వాగ్దానం ప్రకారం మార్చి

రూపాంతరం చెందిస్తుంది. కాబట్టి మనం దేవుని వాక్యపు శక్తిని మన లోకంలోనికి విడుదల చేయడాన్ని ఖచ్చితంగా నేర్చుకోవాలి.

ఆయన వాక్యపు శక్తిని మన లోకంలోనికి విడుదల చేయాలంటే దేవుని వాక్యాన్ని విశ్వాసంతో ప్రకటించడమేనని లేఖనమంతటిలో దేవుడు తెలియజేసారు. మనం ఆయన వాక్యాన్ని నమ్మి మన లోకంలోనికి—అంటే మన పరిస్థితులలోనికి, మన మనసుల మీద, శరీరాల మీద, ఆర్థిక విషయాలమీద, కుటుంబం, పని చేసే చోటు మొదలైన వాటిలో ప్రకటించుట ద్వారా- దేవుని వాక్యపు శక్తిని మన లోకంలోకి విడుదల అవుతుంది. మన లోకంలోని ప్రతిదీ ఆయన వాక్యానికి లోబడి ఉంటుంది. అలాగే ఆయన వాక్యానుసారంగా ఉంటుంది. మీ లోకాన్ని వాక్యం ద్వారా నిర్మించి రూపుదిద్దుకోనివ్వండి.

# 14
# నీ నాలుక నీకు మంచి రోజులను మరియు దీర్ఘాయుష్షును తీసుకురాగలదు

**కీర్తనలు 34:12-14**
**12 బ్రతుక గోరువాడెవడైన నున్నాడా?**
**మేలునొందుచు అనేక దినములు బ్రతుక గోరువాడెవడైన నున్నాడా?**
**13 చెడ్డ మాటలు పలుకకుండ నీ నాలుకను**
**కపటమైన మాటలు పలుకకుండ నీ పెదవులను కాచుకొనుము.**
**14 కీడుచేయుట మాని మేలుచేయుము**
**సమాధానము వెదకి దాని వెంటాడుము.**

మన మాటలు ప్రభావం మన జీవితాల నిడివి మీద దాని ప్రమాణాల మీద ఉంటుందని లేఖనాలు మనకు నేర్పిస్తున్నాయి. సుదీర్ఘమైన మంచి జీవితం కావాలంటే మొట్టమొదటిగా మనం చేయవల్సిన పని ఏమిటంటే చెడు, కపటమైన, అపవిత్రమైన అలాగే క్రూరమైన మాటలు పలకకూడదని దావీదు ఈ వాక్య భాగంలో చెప్పాడు. అబద్ధాలు చెప్పడం మోసకరమైన మాటలు మానుకోవాలి. నాలుకను అదుపులో ఉంచుకోవాలి. సరియైన మాటలు పలకాలి. సత్యాన్ని మాట్లాడాలి. అదే మొట్టమొదటి చేయాల్సిన విషయము. చెడు చేయకూడదు. దానికి బదులుగా మేలు చేసి, సమాధానాన్ని వెంటాడాలి.

మన మాటలు మన లోకాన్ని ప్రభావితం చేస్తాయి. అవి మేలును, జీవాన్ని ఇంకా ఆశీర్వాదాన్ని కలుగు చేస్తాయి లేదా కీడు, మరణం ఇంకా శాపాన్ని కలుగు చేస్తాయి. చాలాసార్లు మన మాటలు ప్రాముఖ్యత లేనివిగా ఉండవచ్చు కానీ అవి మన జీవిత అనుభవానికి నిర్మించే ఇటుకల వంటివి. మన జీవితాల్లోకి వాటి జాతి ప్రకారం పంటను ఇచ్చే విత్తనల వంటివి మన మాటలు. మన జీవితాల్లో

మన మాటలకు దేవుడు చాలా ముఖ్యమైన పాత్రను ఇచ్చారు. మీ మాటలను తేలికగా తీసుకోకండి. వాటి విషయంలో జాగ్రత్త వహించండి. ఆ మాటలు ద్వారా మీ జీవితం రూపు దిద్దుకుంటుంది కాబట్టి మీ మాటలను జాగ్రత్తగా ఎంచుకోండి.

మనం దేవుని వాక్యాన్ని మాత్రమే ప్రకటిస్తే మన మాటలు ఇంకెంత శక్తివంతంగా ఉంటాయో కదా! మన జీవితాల మీద దేవుని వాక్యాన్ని మాత్రమే ప్రకటిస్తే మాట్లాడితే మన జీవితాలు ఎంత ఆశీర్వాదకరంగా ఉంటాయో కదా! దేవుని వాక్యం నుండి వచ్చే మాటలే మన జీవితాలను కట్టే ఇటుకలుగా ఉండాలి. దేవుని వాక్యం నుండి వచ్చే మాటలే రాబోయే రోజుల్లో మన జీవితాల్లో ఫలాన్ని తెచ్చే విత్తనాలుగా ఉండాలి. మీ నాలుక మంచి రోజులను అలాగే దీర్ఘాయుష్షును తీసుకురావాలి. ఆయన వాక్యాన్ని ప్రకటించండి.

# 15

# ఆయన మాటను ప్రకటించడం ఆయన నిబంధనను ప్రకటించడమే

**కీర్తనలు 50:14-17**
**14 దేవునికి స్తుతి యాగము చేయుము**
**మహోన్నతునికి నీ మ్రొక్కుబడులు చెల్లించుము.**
**15 ఆపత్కాలమున నీవు నన్నుగూర్చి మొరపెట్టుము**
**నేను నిన్ను విడిపించెదను నీవు నన్ను మహిమ పరచెదవు.**
**16 భక్తిహీనులతో దేవుడు ఇట్లు సెలవిచ్చుచున్నాడు**
**–నా కట్టడలు వివరించుటకు నీకేమి పని?**
**నా నిబంధన నీనోట వచించెదవేమి?**
**17 దిద్దుబాటు నీకు అసహ్యముగదా**
**నీవు నా మాటలను నీ వెనుకకు త్రోసివేసెదవు.**

దేవుని వాక్యాన్ని మీ నోటితో ప్రకటించడం ఆయన నిబంధనను మీ నోటిలోనికి తీసుకోవడమే అంటే ఆయన నిబంధనను లేదా వాగ్దానాలను ఆశ్రయించి ఎత్తి పట్టుకోవడమే. భక్తిహీనులు దేవుని వాక్యాన్ని త్రోసివేసారు కాబట్టి ఆయన వారిని గద్దించారు. వారు ఆయన వాక్యాన్ని పనికిరాని దానిగా పక్కనపెట్టారు. దేవుని వాక్యాన్ని తృణీకరించిన వారికి తమ నోటితో ఆయన వాక్యాన్ని ప్రకటించే హక్కు, ఆయన నిబంధనలోని మేలులను ఎత్తి పట్టుకునే హక్కు లేదు.

అయితే, ఆయన వాక్యాన్ని నమ్మి ఘనపరిచే మనం ఆయన వాక్యాన్ని ప్రకటించినప్పుడు ఆయనతో మనకున్న నిబంధనను ఎత్తిపట్టుకున్నామని దేవుడు చూస్తారు. ఆయన వాక్యాన్ని ప్రకటించి ఆయన నిబంధనను మన నోటిలోనికి తీసుకున్నప్పుడు, మనతో దేవునికి ఉన్న నిబంధన వలన కలిగే మేలులను మనం ఎత్తిపట్టుకుంటాము.

నిత్యుడూ స్వయంభూతుడూ మార్పులేని దేవుడైన యెహోవా నిబంధనను పాటించి వాగ్దానాలను నెరవేర్చే దేవుడు. ఆయన తన నిబంధనను మీరరు, తన మాటలను మార్చరు. ఆయన కుమారుడైన యేసు క్రీస్తు ద్వారా సర్వశక్తిగల దేవునితో మనం నిబంధన రక్తంలో ఉన్నాము. తన నిబంధన రక్తం ద్వారా సర్వసంపూర్ణుడైన ఆయన మనకు అందుబాటులో ఉన్నారు. ఆయన నిబంధన నామాల ద్వారా దీనిని మనకు కొంతవరకూ గ్రహించగలము. మీ నిబంధన దీవెనలను తెలుసుకోండి. ఏ పరిస్థితుల్లోనైనా సరే ఆయన వాక్యాన్ని ప్రకటించండి. మీ నిబంధన దీవెనలను ఎత్తిపట్టుకుని కొనసాగండి.

# 16
# నేను యెహోవా గురించి చెప్తాను

**కీర్తనలు 91:1,2**
**[1] మహోన్నతుని చాటున నివసించువాడే సర్వశక్తుని**
**నీడను విశ్రమించువాడు.**
**[2] – ఆయనే నాకు ఆశ్రయము నా కోట నేను నమ్ముకొను నా దేవుడని**
**నేను యెహోవానుగూర్చి చెప్పుచున్నాను.**

మీరు యెహోవా గురించి ఏమని చెప్తారు? యెహోవా దేవుడే తన ఆశ్రయమని కోట అని కీర్తనకారుడు చెప్తున్నాడు. అతడు తన నమ్మకాన్ని, ఆధారాన్ని, తన విశ్వాసాన్ని యెహోవాపై ఉంచి తన రక్షణ కొరకు ఆయనపై ఆధారపడ్డాడు.

మీరు యెహోవా గురించి ఏమని చెప్తారు?

- నేను యెహోవా గురించి ఇలా చెప్తాను. ఆయనే నా రక్షకుడు. నా పాపాలన్నిటి నుండి ఆయన నన్ను రక్షించారు. నా జీవితం మీద ఉన్న పాపపు శక్తిని ఆయన విరచి వేశారు. నేను పాపపు ఆధిపత్యం నుండి విడుదల పొందాను.
- నేను యెహోవా గురించి ఇలా చెప్తాను. ఆయనే నా పరలోకపు తండ్రి. ఆయన నన్ను తన సొంతవానిగా చూస్తారు. ఆయన ప్రేమ ఎన్నడూ తరిగిపోదు, విఫలమవ్వదు. నేను ఆయన సొంతవానిగా అంగీకరించబడ్డాను.
- నేను యెహోవా గురించి ఇలా చెప్తాను, ఆయనే నన్ను స్వస్థపరిచేవాడు, నా విమోచకుడు. నా వ్యాధులన్నిటిని ఆయన స్వస్థపరుస్తారు. ఆయన నా వేదనలన్నిటి నుండి ప్రతికూలతలనుండి నన్ను విడిపిస్తారు.

- నేను యెహోవా గురించి ఇలా చెప్తాను, ఆయనే నా విమోచకుడు. ఆయన నన్ను చీకటి శక్తులనుండి విడిపించి తన రాజ్యంలోనికి చేర్చుకున్నారు. ఆయన కుమారుడైన యేసు క్రీస్తు రక్తం ద్వారా నేను విమోచన పొందాను!
- నేను యెహోవా గురించి ఇలా చెప్తాను, ఆయనే నా నీతి. ఏ అపరాధ భావన, సిగ్గు, అభద్రతా, శిక్ష లేకుండా ఆయన నీతిని ధరించుకుని నేను నిల్చున్నాను. నేను ఆయన ముందు పరిశుద్ధునిగా నిందారహితంగా ఉన్నాను.
- నేను యెహోవా గురించి ఇలా చెప్తాను, ఆయనే నా పోషకుడు. ఆయన తన మహిమైశ్వర్యం చొప్పున నా అవసరతలన్ని తీరుస్తారు. ఆయన నా నుండి ఏ మంచిని దాచరు అలాగే ఆయన కృపనంతటిని నాకు అధికంగా ఇస్తారు.
- నేను యెహోవా గురించి ఇలా చెప్తాను, ఆయనే నన్ను తన కోసం ప్రత్యేకపరిచి పరిశుద్ధపరిచారు. ఆయన పరిశుద్ధుడు కనుక నేనూ పరిశుద్ధుడనే. తన ప్రత్యేకమైన ప్రజలలో భాగంగా ఉండడానికి ఆయననే నన్ను పరిశుద్ధ పరిచారు.
- నేను యెహోవా గురించి ఇలా చెప్తాను, ఆయన నా కాపరిగా ఉండి నన్ను నడిపిస్తారు, పోషిస్తారు, కాపాడతారు, నడిపిస్తారు, అలాగే పునరుద్ధరిస్తారు. నా శత్రువుల ఎదుట ఆయన నాకు భోజనం సిద్ధపరుస్తారు!
- నేను యెహోవా గురించి ఇలా చెప్తాను, ఆయనే నన్ను నడిపించి నా మార్గాలను నిర్దేశించే నా ఆలోచనకర్త. నా అడుగులను యెహోవాయే క్రమపరుస్తారు, నేను పడిపోయిన సరే ఆయనే నన్ను నిలబెడతారు.
- నేను యెహోవా గురించి ఇలా చెప్తాను, ఆయనే నా సహాయకుడు. భూమ్యాకాశములను సృష్టించి దేవుని నుండి నాకు సహాయం వస్తుంది. ఆయన నన్ను ఎన్నడూ ఓడిపోనివ్వరు.

- నేను యెహోవా గురించి ఇలా చెప్తాను, ఆయనే నా నీతివంతుడైన న్యాయాధిపతి నన్ను సమర్థించే దేవుడు. నావన్నీ ఆయన ముందు ఉంచుతాను. నేను కీడుకు ప్రతి కీడు చేయను. నేను మేలుతో కీడును జయిస్తాను. నా దేవుడే నన్ను నిర్దోషిగా నిలబెడతారు.
- నేను యెహోవా గురించి ఇలా చెప్తాను, ఆయనే నా ధ్వజము, ఆయన నామములోనే నాకు విజయముంది. అన్ని పరిస్థితులలో నేను జయించులా ఆయన చేస్తారు. ఆయన నాకు జయాన్నిస్తారు కాబట్టి నేను పరాక్రమ కార్యాలను చేస్తాను.
- నేను యెహోవా గురించి ఇలా చెప్తాను, ఆయనే నా సమాధానము. ఆయన నా జీవితాన్ని సంపూర్ణ శాంతితో, సంపూర్ణ షాలోముతో, సంపూర్ణ క్షేమంతో నింపుతారు.
- నేను యెహోవా గురించి ఇలా చెప్తాను, ఆయనే నన్ను కాపాడేవారు. ఏ కీడు నాకు రాదు. నన్ను కాపాడేవాడు నిదురపోడు. నన్ను సంరక్షించే బాధ్యతను ఆయన తన దూతలకు అప్పగించారు.
- నేను యెహోవా గురించి ఇలా చెప్తాను, ఆయనే నన్ను బలపరిచేవారు. ఆయన నా జీవితానికి బలంగా ఉన్నారు. నేను ఆయన కోసం వేచి ఉండగా, ఆయన నన్ను నిలబెట్టి పక్షిరాజు వలే రెక్కలు చాపి ఎగిరేలా నన్ను బలపరుస్తారు.
- నేను యెహోవా గురించి ఇలా చెప్తాను, ఆయనే నాకు బహుమానము ఇచ్చేవారు. ఆయన నామములో నేను ప్రేమతో చేసిన ప్రయాసను నా దేవుడు ఎప్పుడూ మర్చిపోరు. నన్ను బహూకరించి, వర్ధిల్లేలా చేసి ఇంకా ఫలాల్ని కలిగేలా చేసేది ఆయనే.

ఈ సారి యెహోవా గురించి మీరు చెప్పే వాటిని వీటికి మీరు జత చేయండి.

# 17
# దూతలు ఆయన వాక్యపు స్వరాన్ని వింటాయి

**కీర్తనలు 103:20,21**
**[20] యెహోవాదూతలారా, ఆయన ఆజ్ఞకులోబడి ఆయన వాక్యము నెరవేర్చు బలశూరులారా, ఆయనను సన్నుతించుడి.**
**[21] యెహోవా సైన్యములారా,**
**ఆయన చిత్తము నెరవేర్చు ఆయన పరిచారకులారా,**
**మీరందరు ఆయనను సన్నుతించుడి.**

దేవుని దూతలు బలమైనవి శక్తిగలవి. అవి ఆయన వాక్యాన్ని నెరవేరుస్తాయి. ఆయన వాక్యపు స్వరానికి శ్రద్ధ కలిగి, దేవుని వాక్యం ప్రకారం కార్యాన్ని చేస్తాయి.

ఇక్కడ మనమొక విషయాన్నీ ఊహిస్తున్నాము, ఈ రెండు వచనాల నుండి దానిని పూర్తిగా చెప్పలేము గాని లేఖనాల నుండి దేవదూతలు వాటి పనుల గురించి మనం తెలుసుకున్న దానిని బట్టి చెప్తున్నాము. దేవుడు మనది అని చెప్పిన దానిని చెప్తూ వాక్యాన్ని ప్రకటిస్తూ ఉండగా, దేవ దూతలు మన ద్వారా ఆయన వాక్యపు స్వరాన్ని వింటాయి కాబట్టి, రక్షణ ద్వారా వారసులమైన మనకు దేవుని వాక్యం ప్రకారం అవి పరిచర్య చేస్తాయి. ఇది మన ఊహ మాత్రమే అయినా కాని చెల్లుతుంది.

రక్షణకు వారసులమైన మనకు దేవదూతలు పరిచర్య చేస్తాయి (హెబ్రీయులకు 1:14). దేవుడు మనకు అంటే పరిశుద్ధులమైన మనకు ప్రకటించిన దానికి అవి పరిచర్య చేస్తాయి. దేవుడు మనము అంటే ఆయన ప్రజలమైన మనం ఏమి చేయాలనీ కోరుకుంటున్నారో

వాటిని దేవ దూతలు చేస్తాయి. దానియేలుకు (దానియేలు 10) ఆది సంఘానికి (అపొస్తలుల కార్యములు 12:5-7) కలిగిన అనుభవాలను గమనించగా మన తరపున పని చేయడానికి దేవ దూతలను ఆహ్వానించవలసిన ఆత్మీయ కార్యక్రమాలు కూడా ఉన్నాయని గ్రహిస్తాము. మన ఆరాధన, మన దాతృత్వము, దేవుని పట్ల మనకున్న విధేయత అనేవి దేవ దూతలను మన తరపున పనిచేసేలాగా కదిలిస్తాయనేది కూడా వాస్తవమే. దేవ దూతలు దేవుని వాక్కును శ్రద్ధగా విని ఆయన వాక్కును నెరవేసారుస్తాయని మనకి తెలుసు కాబట్టి దేవుని వాక్యంపై ఆయన వాగ్దానాలపై మనకున్న విశ్వాసాన్ని ప్రకటించినప్పుడు మన తరపున దేవ దూతలు కూడా పని చేస్తాయని చెప్పడం సరైనదే. దేవ దూతలు ఆయన వాక్యానికి విరుద్ధంగా ఏమి చేయవు. కాబట్టి మనం దేవుని వాక్యానికి వ్యతిరేకంగా మాట్లాడినప్పుడు ఆ మాటలు దేవ దూతలను కదిలించలేవు.

దేవుని వాక్యం మీ జీవితంలో నెరవేరాలని మీరు ఆశిస్తున్నారని దేవ దూతలకు తెలిసేలా చేయండి. వాక్యాన్ని ప్రకటించండి. ఏ పరిస్థితిలోనైనా సరే ఆయన వాక్యాన్ని ఉద్దేశ్యపూర్వకంగానే ప్రకటించండి. మీ అవసరతలలో, "నా దేవుడు తన ఐశ్వర్యము చొప్పున క్రీస్తుయేసునందు మహిమలో మీ ప్రతి అవసరమును తీర్చును" అని ప్రకటించండి. మీకు కలవరం కలిగించే పరిస్థితులలో, "నేను పరిపూర్ణ శాంతిని, మంచి వివేకాన్ని అలాగే ఈ పరిస్థితులలోకి సహకారాన్ని ఆజ్ఞాపిస్తున్నాను. దేవుడు సమాధానమునకే కర్త గాని అల్లరికి కర్త కాడు" అని ప్రకటించండి. దేవ దూతలు మీ స్వరం ద్వారా ఆయన వాక్యపు స్వరాన్ని విని, ఆ వాక్కుకు అనుగుణంగా క్రియ జరిగించాలి.

# 18
# యెహోవా విమోచించినవారు ఆ మాట పలుకుదురు గాక

**కీర్తనలు 107:2**
**యెహోవా విమోచించినవారు ఆ మాట పలుకుదురు గాక**
**విరోధుల చేతిలోనుండి ఆయన విమోచించినవారును**

మనల్ని యెహోవా విమోచించారు, కాబట్టి మనం దానిని ప్రకటించాలి!

ఖైదీ విడుదలై బయటకు వచ్చిన తర్వాత నేను ఒక ఖైదీని అని చెప్పడు. అతడు ధైర్యంగా గర్వంగా నేను విడుదల పొందానని చెప్తాడు. అతడు ఖైదీగా ఉండేవాడు. అది గతంలో. అతడు ఇప్పుడు ఎలా ఉన్నాడు అన్నదే ముఖ్యము! అతడు ఇప్పుడు ఒక స్వేచ్ఛ జీవి. అతడు తన స్వేచ్ఛలోని హక్కులన్నీ ఉపయోగించుకోవచ్చు. విశ్వాసులమైన మనం చీకటి శక్తులనుండి విడుదల పొంది యేసు క్రీస్తు రాజ్యంలోనికి చేర్చబడ్డాము. దేవుడు తన ప్రజలకు అంటే పరిశుద్ధులకు ఇచ్చిన వారసత్వంలో పాలుపొందే అర్హత పొందాము. మనం యేసు క్రీస్తు ప్రశస్తమైన రక్తం ద్వారా విడుదల పొందాము (కొలొస్సయులకు 1:12-14). విమోచించడమంటే “తిరిగి కొనడం”, చెరనుండి విడిపించడం, అసలైన మహిమ స్థానంలోనికి పునరుద్ధరించడము. మనల్ని యెహోవా విమోచించారు. ఇంకాపై మన మీద సాతానుకు ఏ అధికారం లేదు, ఏ ఆధిపత్యం లేదు, ఏ హక్కు లేదు. మనం దేవుని చేత కొనబడ్డ స్వాస్థ్యము (1 కొరింథీయులకు 6:20).

- నన్ను యెహోవా విమోచించారు, కాబట్టి నేను దానిని ప్రకటిస్తాను!
- నేను సాతాను శక్తి నుండి, వాని దయ్యాల నుంచి విమోచింపబడ్డాను (కొలొస్సయులకు 1:13). చీకటి శక్తులకు నా

మీద ఎటువంటి హక్కు గాని అధికారం గాని లేదు.

- నేను పాపపు శక్తి నుండి విమోచింపబడ్డాను (రోమా 6:6,14). పాపానికి నా మీద ఎటువంటి ఆధిపత్యం లేదు.
- నేను ధర్మశాస్త్రపు శాపం నుండి విమోచింపబడ్డాను (గలతీ యులకు 3:13). ఇప్పుడు నేను అబ్రాహాము యొక్క ఆశీర్వాదాలను కలిగి ఉన్నాను.
- నేను ఇప్పుడున్న చెడ్డ లోకంనుండి విమోచింపబడ్డాను (గలతీయులకు 1:4). ప్రస్తుత లోకపు మార్గాలు, ప్రభావాలు ఇంకా వాటి చెడుతనానికి నా మీద ఎటువంటి అధికారం లేదు.
- నేను ప్రతి పాపకార్యం నుండి విమోచన పొందాను (తీతుకు 2:14). గతకాలపు పాప జీవితానికి నా మీద ఎటువంటి శక్తి లేదు. నేను ఆయన కొరకు అలాగే మంచి కార్యాల కొరకు శుద్ధీకరించబడ్డాను.
- నా పూర్వీకుల యొక్క వ్యర్థమైన పాప జీవిత విధానాల నుండి విడుదల పొందాను (1 పేతురు 1:18,19). నేను నూతన సృష్టిని, నూతన జీవితాన్ని గడుపుతాను.
- గొర్రెపిల్ల రక్తం కారణంగా నేను విమోచన పొందాను, శత్రువును జయించాను (ప్రకటన 12:11). సాతానును వాని దురాత్మలను నా కాళ్ళ క్రింద అణగద్రొక్కుతాను (లూకా 10:19; రోమా 16:20).
- నన్ను యెహోవా విమోచించారు, కాబట్టి నేను దానిని ప్రకటిస్తాను!

# 19
# రక్షణను గూర్చిన ఉత్సాహ స్వరాన్ని వినిపించండి

**కీర్తనలు 118:15-17**
**15 నీతిమంతుల గుడారములలో రక్షణనుగూర్చిన ఉత్సాహ సునాదము వినబడును**
**యెహోవా దక్షిణహస్తము సాహస కార్యములను చేయును.**
**16 యెహోవా దక్షిణహస్తము మహోన్నత మాయెను**
**యెహోవా దక్షిణహస్తము సాహసకార్యములను చేయును.**
**17 నేను చావను సజీవుడనై యెహోవా క్రియలు వివరించెదను.**

నీతిమంతుల ఇంటిలో రక్షణను గూర్చిన ఉత్సాహ స్వరాలు వినబడతాయి. "రక్షణ" అనే పదానికి హెబ్రీ పదమైన 'యేషూవ' కు (గ్రీకులో 'సోజో' అనే పదం) రక్షణ, కాపుదల, విమోచన, విజయం, అభివృద్ధి, ఆరోగ్యం, సహాయం, సంక్షేమం, క్షేమం వంటి అనేక అర్థాలు ఉన్నాయి.

ప్రతి గృహంలో ఈ లోకపు సవాళ్లు ఏదొక విధంగా వస్తూనే ఉంటాయి. నీతిమంతుని గృహాలు జీవితంలో ఎదురయ్యే సవాళ్ళను తుఫానులను ఎదుర్కొంటాయి. అయితే, "యెహోవా దక్షిణ హస్తము" నీతిమంతుని కొరకు గొప్పకార్యాలు చేస్తుంది. "యెహోవా దక్షిణ హస్తము" అంటే దేవుని శక్తి, అది ఎప్పుడూ విజయాన్ని సాధిస్తుంది, అన్నింటి కన్నా శక్తివంతమైనది. కాబట్టి నీతిమంతుల ఇండ్లలో ఎప్పుడూ ఉత్సాహ ధ్వనులు, విజయం, వేడుకలు, రక్షణ ఉంటాయి. కాబట్టి, "నేను చనిపోను, సజీవుడనై యెహోవా కార్యాలను ప్రకటిస్తాను" అని మనం చెప్పాలి.

మనం కొన్ని సవాళ్ళను ఎదుర్కొన్నప్పుడు ఏమి చేయాలి?

మన స్వరాన్ని మార్చుతామా? లేదు! మన ఇంటిలో రక్షణను గూర్చిన ఉత్సాహ స్వరాలు వినబడుతూనే ఉండాలి. మన దేవుడు శక్తివంతుడని ప్రకటిస్తూనే ఉండాలి. దేవుడు మనలను రక్షించి, కాపాడి, భద్రపరచి, స్వస్థపరిచి, విడిపించి, వర్ధిల్లింప చేసి ఇంకా విజయాన్ని ఇస్తారు కాబట్టి, మనం రక్షణ స్వరాన్ని వినిపిస్తునే ఉండాలి! యెహోవా దక్షిణ హస్తము ఎప్పుడు అన్ని కాలాల్లోను శక్తివంతంగా జయించేదిగా ఉంటుంది. మీ ఇంటిలో రక్షణను గూర్చిన ఉత్సాహ స్వరాలు వినబడాలి. ప్రతి కాలంలో రక్షణను గూర్చిన ఉత్సాహ స్వరాలు వినబడాలి.

# 20
# నీ జీవితాన్ని తీర్చిదిద్దే శక్తులు నీ హృదయంలోనుండి వస్తాయి

**సామెతలు 4:20-23**
**[20] నా కుమారుడా, నా మాటలను ఆలకింపుము**
**నా వాక్యములకు నీ చెవి యొగ్గుము.**
**[21] నీ కన్నుల యెదుటనుండి వాటిని తొలగిపోనియ్యకుము**
**నీ హృదయమందు వాటిని భద్రముచేసికొనుము.**
**[22] దొరికినవారికి అవి జీవమునువారి సర్వశరీరమునకు ఆరోగ్యమును ఇచ్చును.**
**[23] నీ హృదయములోనుండి జీవధారలు బయలుదేరును**
**కాబట్టి అన్నిటికంటె ముఖ్యముగా నీ హృదయమును భద్రముగా కాపాడుకొనుము**

దేవుని వాక్యంతో మన హృదయాలను నింపుకోమని ఈ వాక్యంలో మనకు ఆజ్ఞాపించబడింది. మన అంతరంగంలో ఆయన వాక్యం ఉండాలంటే ఆయన వాక్యం మీద శ్రద్ధ వహించి దానిపై ఆనుకుని, ఆయన వాక్యాన్ని విని ఆయన వాక్యం మీద మన దృష్టిని ఉంచాలి. ఆయన వాక్యం మనల్ని జీవంతో, ఆరోగ్యంతో సంపూర్ణతతో ఆశీర్వదిస్తుంది. మన హృదయాలను జాగ్రత్తగా కాపాడుకోమని ఆయన సూచిస్తున్నారు. దేవుని వాక్యానికి వ్యతిరేకమైనది ఏది కూడా మన హృదయాలలోకి అనుమతించకూడదు. మన హృదయాలను మనం కాపాడుకోవాలి, అంటే హృదయంలో నింపుకున్న వాక్యాన్ని కాపాడుకోవాలి.

మన అంతరంగమైన హృదయం చాలా ప్రాముఖ్యమైనది. మన హృదయాలలోనుండి వచ్చే శక్తులే మన జీవితాలను రూపుదిద్దుతాయి. మన హృదయాలలో ఉన్నది మన జీవితాల్లోకి విడుదల అవ్వడానికి ఒక మార్గం మనం మాట్లాడే మాటలే. మన జీవితాలను రూపుదిద్దే శక్తులు మన అంతరంగం నుండే వస్తాయి, ఆ

శక్తులు మనం మాట్లాడే మాటల ద్వారా విడుదల అవుతాయి.

మన హృదయాలు ఆయన వాక్యంతో నిండి ఉంటే, మనం మాట్లాడే మాటలు ఆయన వాక్యానికి అనుగుణంగా ఉంటాయి. మనం ఆయన వాక్యాన్ని మాట్లాడతాము. మన జీవితాలను రూపుదిద్దే శక్తులు ఆయన వాక్యం నుండే వస్తాయి. అప్పుడు మన జీవితాలలో పని చేయడానికి స్వయంగా దేవుని వాక్యపు శక్తినే విడుదలై మన జీవితాల్లోని అన్ని విషయాలను అనగా వర్తమాన భవిష్యత్తులను ప్రభావితం చేస్తుంది.

మీ హృదయాలను దేవుని వాక్యంతో నింపండి. ఆయన వాక్యాన్ని ప్రకటించండి. మీలో ఉన్న దేవుని వాక్యం నుండి వచ్చి శక్తులు మీ జీవితాన్ని రూపుదిద్దాలి.

# 21
# నీతిమంతుని మాటలు జీవాన్ని బలాన్ని కలిగిస్తాయి

**సామెతలు 10:11,20,21,31,32**
**11 నీతిమంతుని నోరు జీవపు ఊట**
**భక్తిహీనుల నోరు బలాత్కారము మరుగుపరచును.**
**20 నీతిమంతుని నాలుక ప్రశస్తమైన వెండివంటిది**
**భక్తిహీనుల ఆలోచన పనికిమాలినది.**
**21 నీతిమంతుని పెదవులు అనేకులకు ఉపదేశించును**
**బుద్ధి లేకపోవుట చేత మూఢులు చనిపోవుదురు.**
**31 నీతిమంతుని నోరు జ్ఞానోపదేశమును పలుకును**
**మూర్ఖపు మాటలు పలుకు నాలుక పెరికివేయబడును.**
**32 నీతిమంతుని పెదవులు ఉపయుక్తములైన సంగతులు**
**పలుకును భక్తిహీనుల నోట మూర్ఖపు మాటలు వచ్చును.**

ఈ వచనాలలో నీతిమంతుల మాటలకు దుష్టుల మాటలకు ఉన్న వ్యత్యాసాన్ని మనం చూడవచ్చు. నీతిమంతుల మాటలు "జీవపు ఊటలు". అవి జీవాన్ని, సంపూర్ణతను, క్షేమాన్ని అలాగే "జీవానికి" సంబంధించిన సమస్తాన్ని అందిస్తాయి. నీతిమంతుల మాటలు "ప్రశస్తమైన వెండి" వంటివి అంటే "శుద్ధమైనవి, విలువైనవి ఇంకా అమూల్యమైనవి". నీతిమంతుల మాటలు "అనేకులకు ఉపదేశించును". అవి అనేక మందికి పోషణను, బలాన్ని, జీవాన్ని, సహాయాన్ని అలాగే ఆశీర్వాదాన్ని ఇస్తాయి. జ్ఞానము, ఉపయుక్తమైనవి (సంతోషకరమైనవి) అనే రెండు అదనపు లక్షణాలు నీతిమంతుల మాటలకు ఉంటాయి.

మాటలు ఇతరులకు జీవాన్ని ఆశీర్వాదాన్ని అందిస్తాయి. మనం మాట్లాడే మాటలు కొంతమందికి జీవపు ఊటగా ఉంటాయి. వెదకేవారికి మన మాటలు ప్రశస్తమైన వెండిని పోలి ఉంటాయి.

మరికొందరికి పోషణ ఇచ్చేవిగా బలపరిచేవిగా ఉంటాయి.

మీ మాటలు సరైనవిగా (నీతిమంతుల మాటలుగా) ఉన్నాయో లేదో తెలుసుకోవాలంటే అవి దేవుని వాక్యానికి అనుగుణంగా ఉన్నాయో లేదో చూస్తే సరిపోతుంది. మనం అలా చేసినట్లయితే, మన మాటలు జ్ఞానం గల మాటలుగా ఉండి ప్రజలను విడిపించి వారికి సంతోషాన్ని, స్వేచ్ఛను ఇస్తాయి. నీతిమంతుల మాటలనే మాట్లాడాలని ఎంచుకోండి. దేవుని వాక్యానికి అనుగుణంగా మాట్లాడండి.

# 22
# మాటలు, స్వస్థపరచి మరియు సంపూర్ణులుగా చేయగలవు

**సామెతలు 12:18**
**కత్తిపోటువంటి మాటలు పలుకువారు కలరు**
**జ్ఞానుల నాలుక ఆరోగ్యదాయకము.**

**సామెతలు 15:4**
**సాత్వికమైన నాలుక జీవవృక్షము**
**దానిలో కుటిలత యుండిన యెడల ఆత్మకు భంగము కలుగును.**

సామెతలు 12:18లో జ్ఞానుల నాలుక ఆరోగ్యాన్ని అందిస్తుందని మనం నేర్చుకుంటాము. "ఆరోగ్యము" అనే పదానికి హెబ్రీ పదమైన 'మార్పే'కు నయం చేయడం, ఔషధం, స్వస్థతనివ్వడం, విడుదల చేయడం, స్వస్థ బుద్ధినివ్వడం అలాగే సంపూర్ణతనివ్వడం అనే అర్థాలు ఉన్నాయి. మాటలను సరైన రీతిలో జ్ఞానయుక్తంగా వాడితే అవి మీకు అలాగే మీ మాటలు వినేవారికి స్వస్థతను సంపూర్ణ ఆరోగ్యాన్ని ఇస్తాయి.

సామెతలు 15:4లో ఉపయోగించిన 'మార్పే' అనే పదాన్ని "సాత్వికమైన" అని అనువదించారు. సాత్వికమైన మాటలు మాట్లాడే నాలుక జీవవృక్షము అంటే స్వస్థతను విడుదల ఇచ్చే మాటలు. ప్రకటన 22:1,2లో మనం జీవ వృక్షము గురించి చదువుతాము *"మరియు స్ఫటికమువలె మెరయునట్టి జీవజలముల నది దేవునియొక్కయు గొఱ్ఱెపిల్లయొక్కయు సింహాసనమునొద్దనుండి ఆ పట్టణపు రాజవీధిమధ్యను ప్రవహించుట ఆ దూత నాకు చూపెను. ఆ నదియొక్క ఈవలను ఆవలను జీవవృక్షముండెను; అది నెలనెలకు ఫలించుచు పండ్రెండు కాపులు కాయును. ఆ వృక్షముయొక్క*

*ఆకులు జనములను స్వస్థపరచుటకై వినియోగించును."* జీవ వృక్షపు ఆకులు స్వస్థత కలిగిస్తాయి. మనం స్వస్థత, ఆరోగ్యం, విడుదల అలాగే స్వస్థబుద్ధి గల మాటలు మాట్లాడినప్పుడు మనకు అలాగే మనం మాట్లాడేవారికి స్వస్థత కలిగిస్తాము.

మాటలు స్వస్థపరిచి, సంపూర్ణులుగా చేయగలవు. దేవుడు, ఆయన వాక్యము జీవమైయుండి (తాజాతనము, బలము) అలాగే ఆరోగ్యమును ('మార్పే') మన సంపూర్ణ శరీరానికిస్తాయి (సామెతలు 4:22). ప్రజలు ఆయనకు మొరపెట్టినప్పుడు, దేవుడు తన వాక్కును పంపి వారిని స్వస్థపరిచారు ('రాఫా' నయము చేయుట, సంపూర్ణులుగా చేయడం) (కీర్తనలు 107:20). దేవుని వాక్యానికి ఒక వ్యక్తిని స్వస్థపరిచే శక్తి, సంపూర్ణ ఆరోగ్యాన్నిచ్చే శక్తి ఉంది. కాబట్టి, స్వస్థపరిచే శక్తి కలిగియున్న దేవుని వాక్యాన్ని మీ నోటి మాటల ద్వారా విడుదల చేయండి. ఆరోగ్యాన్నిచ్చే మంచి ఔషధంవలే జీవవృక్షం లాంటి మాటలను మీ నోటి ద్వారా విడుదలవ్వనివ్వండి. మీకు మీ చుట్టూ ఉన్నవారికి సంపూర్ణ ఆరోగ్యం కలిగేలాగా దేవుని స్వస్థపరిచే వాక్యాన్ని మాట్లాడండి.

# 23
# ఇంపైన మాటల శక్తిని విడుదల చేయండి

**సామెతలు 16:21,24**
**[21] జ్ఞానహృదయుడు వివేకి యనబడును**
**రుచిగల మాటలు పలుకుటవలన విద్యయెక్కువగును.**
**[24] ఇంపైన మాటలు తేనెపట్టువంటివి**
**అవి ప్రాణమునకు మధురమైనవి యెముకలకు ఆరోగ్యకరమైనవి.**

ఏ పరిస్థితిలోనైనా సరే మనం మాట్లాడాలనుకునే మాటలను మనం ఎంచుకోవచ్చు. దయగలిగిన, సాత్వికమైన, ఆహ్లాదమైన, మేలైన, సానుకూలమైన బలపరచే మాటలు చాలా శక్తివంతమైన ప్రభావాన్ని చూపిస్తాయి. మృదువైన దయగల మాటల వలన విద్య అధికమవుతుంది. వాటి వలన ప్రజలు సూచనను మరింత ఎక్కువగా గ్రహిస్తారు, నమ్ముతారు, వారి మనసు కరుగుతుంది. దయగల, ఆహ్లాదమైన మేలైన మాటలు ఆత్మను బలపరుస్తాయి, మన అంతరంగంలో ఆరోగ్యాన్ని ఇస్తాయి. మనం ఇక్కడ పొగడ్తల గురించి మాట్లాడట్లేదు. ఎందుకంటే పొగడ్తలు కృత్రిమంగా ఉంటాయి, ఒకరిని సంతోషపెట్టాలనే ఉదేశ్యంతో మాట్లాడే ఈ మాటలలో నిజాయితీ ఉండదు. మనం నిజాయితీగా సత్యమైన మాటలను జాగ్రత్తగా దయకలిగి సౌమ్యంగా మాట్లాడడం గురించి చెప్తున్నాము.

దేవుని శక్తివంతమైన వాక్యాన్ని మన మాటల్లో భాగంగా చేసుకున్నప్పుడు మనం విశ్వాసాన్ని, నిరీక్షణను, బలాన్ని, ధైర్యాన్ని, స్వస్థతను, జ్ఞానాన్ని సలహాలను మన మాటల ద్వారా అందించగలము. మధురంగా మాట్లాడండి. ఆహ్లాదంగా మాట్లాడండి. ప్రజలను నిలబెట్టగల మాటలను మాట్లాడండి. ప్రజలకు మేలు చేసి, స్వస్థపరిచే మాటలు మాట్లాడండి. మీరు దేవుని గురించి ఆయన

చేయగల వాటిని గురించి, ఆయన చేసిన వాగ్దానం గురించి ప్రజలతో మాట్లాడినప్పుడు మీరు దేవునికి పరిచర్య చేస్తున్నారు. ఇంపైన మాటల శక్తిని విడుదల చేయండి.

# 24
# నీ జీవితము, నీ నోటి మాటల ఫలము ద్వారా నింపబడుతుంది

**సామెతలు 12:14**
**ఒకడు తన నోటి ఫలముచేత తృప్తిగా మేలుపొందును**
**ఎవని క్రియల ఫలము వానికి వచ్చును**

**సామెతలు 18:20**
**ఒకని నోటి ఫలముచేత వాని కడుపు నిండును**
**తన పెదవుల ఆదాయముచేత వాడు తృప్తిపొందును.**

మన మాటలు అన్ని విధాలుగా మన జీవితాలను ప్రభావితం చేస్తాయి. అవి మన అంతరంగాన్ని ప్రభావితం చేస్తాయి. ఒకరి కడుపు వారి అంతరంగాన్ని సూచిస్తుంది. ఆహారంతో కడుపు నిండినట్లు మన మాటల ద్వారా మన అంతరంగాన్ని మేలులతో నింపి తృప్తిపరచి, పోషించి, ఆశీర్వాదాన్ని పొందుతాము. మన జీవితంలో జరిగే వాటిని మన మాటలు ప్రభావితం చేస్తాయి. మనం మాట్లాడే మాటల ఫలితంతో మన జీవితం నింపబడుతుంది. కాలం గడిచే కొలది మనం మాట్లాడిన మాటల పర్యవ్యసనాల ఎదుర్కొంటూ మనం జీవిస్తాము.

మీ అంతరంగం దేనితో నిండి ఉండాలని అనుకుంటున్నారు? నమ్మిక, ధైర్యం, విశ్వాసం, నిరీక్షణ, నీతి, సమాధానం, ఉల్లాసం, నెమ్మది, జ్ఞానం, శక్తి అనే వాటితోను దేవుని కుమారులు కుమార్తెలుగా మనకు అందుబాటులోనున్న మేలులన్నింటితో నింపబడితే ఇష్టమేనా? ఖచ్చితంగా ఇష్టమే కదా! అయితే మనం దేవుని నుండి, ఆయన వాక్యపు శక్తి ద్వారా మరియు ఆయన ఆత్మ ద్వారా మాత్రమే దేవుని నుండి వచ్చే ఆ గుణాలన్నిటితో మనల్ని నింపే మాటలనే మాట్లాడాలి. దేవుని వాక్యాన్ని ప్రకటించాలి. క్రీస్తులో

మీరు కలిగి ఉన్న దానిని ప్రకటించండి. మీరు ఆయన రాజ్యానికి చెందినవారు కాబట్టి మీకు నీతి, శాంతి మరియు పరిశుద్ధాత్మనందు సంతోషం ఉందని ప్రకటించండి. యేసు ప్రభువు ఇచ్చు సమాధానం మీకుందని, దానిని ఈ లోకం ఇవ్వలేదని, సమస్త జ్ఞానమునకు మించిన సమాధానం మీకుందని, ఆ సమాధానం మీ హృదయాన్ని మనసును కావలిగా ఉంటుందని ప్రకటించండి. మీకు శక్తి, ప్రేమ, స్వస్థ బుద్ధి ఉన్నాయని ప్రకటించండి. యెహోవాయే నీ నమ్మిక అని ప్రకటించండి. మీరు సింహంవలే ధైర్యంగా ఉన్నారని ప్రకటించండి. మీరు వెళ్లు ప్రతి స్థలంలో యెహోవా మీకు తోడుగా ఉన్నారు కాబట్టి మీరు బలవంతులుగా ధైర్యవంతులుగా ఉన్నారు. మీ అంతరంగంలో మంచి విషయాలను నిర్మించే మాటలను ప్రకటించండి.

మీ జీవిత అనుభవాలు వేటితో నిండి ఉండాలని ఇష్టపడుతున్నారు? మీ వర్తమానం భవిష్యత్తు వేటితో నిండి ఉండాలని ఆశపడుతున్నారు? మీ జీవితం మీద, మీ వర్తమానం మీద భవిష్యత్తు మీద దేవుని వాగ్దానాలను ప్రకటించండి. మీరు మాట్లాడే మాటల ఫలంతోనే మీ జీవితం నింపబడుతుంది.

# 25
# నీ మాటలకు జీవమరణముల శక్తి ఉంది

**సామెతలు 18:21**
**జీవమరణములు నాలుక వశము**
**దానియందు ప్రీతిపడువారు దాని ఫలము తిందురు**

దేవుడు జీవన్మరణాలను నాలుక వశం చేశారు, అంటే మనం మాట్లాడే మాటల్లో ఉంచారు. మన మాటలు జీవమును గాని మరణాన్ని గాని తీసుకువస్తాయి. మన మాటల పర్యవసానాలను ఎదుర్కోడానికి సిద్ధపడి ఉండాలి. మన మాటల ఫలంతో మనం జీవించవలసి ఉంది.

“మరణం” అంటే “శారీరకంగా మరణించడం” అని అర్ధము, అలాగే తెగులు, వ్యాధి ఇంకా నాశనానికి సాదృశ్యంగా కూడా ఉపయోగిస్తారు. సానుకూలతతో సజీవంగా ఉండడానికి సంబంధించిన ప్రతి దానిని జీవము సూచిస్తుంది. ఇంకా ఇది ఉత్తేజాన్ని బలాన్ని సూచిస్తుంది.

మనం మాట్లాడే మాటలు మనల్ని నాశనం చేస్తాయి లేదా దీవిస్తాయి. మనం మాట్లాడే మాటలు మనకు జీవాన్ని బలాన్ని ఇచ్చి ఉత్తేజపరుస్తాయి లేదా మన జీవితాలను కూల్చి మనల్ని బలహీనులుగా ఇంకా సమస్తం పోగొట్టుకున్న వారిగా చేస్తాయి. మన మాటలకు మన మీద అటువంటి ప్రభావం ఉండేలాగా దేవుడు వాటిని రూపొందించారు. మీరు మాట్లాడేది మిమ్మల్ని కడుతుంది లేదా నాశనం చేస్తుంది.

అందుకే మన మీద ఇంకా ఇతరుల మీద జీవాన్ని ఆశీర్వాదాన్ని విడుదల చేసే మాటలను మాత్రమే మనం ఎంచుకోవాలి. దేవుని వాక్యాన్ని ప్రకటించడం కన్నా శ్రేష్టమైనది ఏదీ లేదు. దేవుని

వాగ్దానాలను మీ జీవితం మీద ప్రకటించండి. క్రీస్తులో నూతన సృష్టిగా ఉన్న మీ గురించి దేవుడు పలికిన దానిని ప్రకటించండి. ఆయన వాక్యానుసారంగా మీ జీవితంలో ఆశీర్వాదాన్ని, అభివృద్ధిని, విజయాన్ని, సమృద్ధిని మేలులను ప్రకటించండి. మీరు అనేకమందికి ఆశీర్వాదకరంగా ఉంటారని ప్రకటించండి. ఆశీర్వాదంగా ఉండడానికే మీరు ఆశీర్వదించబడ్డారని ప్రకటించండి. మీ పట్ల దేవునికి ఉన్న ఉద్దేశాలు ఆయన మీకిచ్చిన పనులను నెరవేరుస్తారని ప్రకటించండి. మీ జీవితం ద్వారా దేవునికి మహిమ కలుగుతుందని ప్రకటించండి. మీ వర్తమానం అలాగే భవిష్యత్తు మీద జీవాన్ని ఆశీర్వాదాన్ని విడుదల చేసేలాగా మీ మాటలను ఉపయోగించండి.

# 26
# నీ నోట ఆయన వాక్కు, దేశములను ప్రభావితము చేస్తుంది

**యిర్మీయా 1:9,10**
**[9] అప్పుడు యెహోవా చేయి చాపి నా నోరుముట్టి యీలాగు సెలవిచ్చెను–ఇదిగో నేను నీ నోట నా మాటలు ఉంచియున్నాను.**
**[10] పెల్లగించుటకును విరుగగొట్టుటకును, నశింపజేయుటకును పడద్రోయుటకును, కట్టుటకును నాటుటకును నేను ఈ దినమున జనములమీదను రాజ్యములమీదను నిన్ను నియమించియున్నాను.**

మనం ఈ రెండు వచనాలలో ప్రవచన వాక్కుకున్న శక్తిని చూస్తాము. దేవుడు యిర్మీయా నోట ఉంచిన మాటలను దేశాలు అలాగే రాజ్యాలు మీద పలికినప్పుడు అవి పెల్లగించబడి, విరుగగొట్టబడి, నాశనం చేయబడి పడవేయబడతాయి. యిర్మీయా దేవుడిచ్చిన మాటలను పలికినప్పుడు దేవుడు అనుకున్న ప్రకారం దేశాలలో రాజ్యాలలో ఉన్నవి కూల్చివేయబడి పడగొట్టబడతాయి. అలాగే యిర్మీయా ప్రవచన వాక్కును పలికినప్పుడు దేశాలలో రాజ్యాలలో కట్టబడతాయి నాటబడతాయి, పైకి లేవనెత్తబడతాయి.

ప్రవచన వాక్కు అనేది పరిశుద్ధాత్మ దేవుని ప్రేరేపణతో ప్రజల ద్వారా వచ్చే వాక్యము. దేవుని ప్రజల జీవితాలలో పరిశుద్ధాత్మ దేవుడు ఇంకా కార్యం చేస్తూనే ఉన్నారు. ఆయన ఇప్పటికికూడా మనం ప్రవచించేలా ప్రేరేపించబడిన మాటలు చెప్పేలా లేదా దేశాలు ప్రజల మీద ప్రవచనాలు చెప్పేలాగా మనల్ని కదిలిస్తున్నారు. దేవుడు మన నోటిలో తన మాటలను ఉంచగా మనం వాటిని ప్రకటించినప్పుడు, మనం దేశాలు అలాగే రాజ్యాల మీద ఉండే పరిస్థితులను (ఆత్మీయ, సామాజిక, ఆర్థిక మొదలైనవి) ప్రభావితం చేస్తాము. మన నోటిద్వారా వచ్చిన ఆయన మాటలు దేశాలను ప్రభావితం చేస్తాయి. దేవుడు తన వాక్యాన్ని నెరవేర్చి స్థిరపరుస్తారు (యిర్మీయా 1:12).

# 27
# ఎండిన ఎముకలలో జీవాత్మవచ్చునట్లు వాటితో ప్రకటించు

**యెహెజ్కేలు 37:1-7**
**1 యెహోవా హస్తము నా మీదికి వచ్చెను. నేను ఆత్మవశుడనైయుండగా యెహోవా**
**నన్ను తోడుకొనిపోయి యెముకలతో నిండియున్న యొక లోయలో నన్ను దింపెను.**
**ఆయన వాటిమధ్య నన్ను ఇటు అటు నడిపించుచుండగా**
**2 యెముకలనేకములు ఆ లోయలో కనబడెను, అవి కేవలము ఎండిపోయినవి.**
**3 ఆయన–నర పుత్రుడా, యెండిపోయిన యీ యెముకలు బ్రదుకగలవా? అని**
**నన్నడుగగా–ప్రభువా యెహోవా అది నీకే తెలియునని నేనంటిని.**
**4 అందుకాయన–ప్రవచన మెత్తి యెండిపోయిన యీ యెముకలతో ఇట్లనుము–**
**ఎండిపోయిన యెముకలారా, యెహోవా మాట ఆలకించుడి.**
**5 ఈ యెముకలకు ప్రభువైన యెహోవా సెలవిచ్చున దేమనగా–మీరు బ్రదుకునట్లు**
**నేను మీలోనికి జీవాత్మను రప్పించుచున్నాను;**
**6 చర్మము కప్పి మీకు నరములనిచ్చి మీ మీద మాంసము పొదిగి చర్మము మీమీద**
**కప్పెదను; మీలో జీవాత్మనుంచగా మీరు బ్రదుకుదురు; అప్పుడు నేను యెహోవానై**
**యున్నానని మీరు తెలిసికొందురు.**
**7 ఆయన నాకిచ్చిన ఆజ్ఞప్రకారము నేను ప్రవచించుచుండగా గడగడమను ధ్వని**
**యొకటి పుట్టెను; అప్పుడు ఎముకలు ఒకదానితో ఒకటి కలిసికొనెను.**

యెహెజ్కేలు ప్రవచన అనుభవాన్ని ఈ వాక్యభాగం తెలియజేస్తుంది. తమ స్వదేశం నుండి చెదిరిపోయి నిరీక్షణలేని ఇశ్రాయేలీయులకు ఈ ఎండిన ఎముకలు సాదృశ్యంగా ఉన్నాయి (యెహెజ్కేలు 37:11,12). దేవుడు యెహెజ్కేలుతో దేవుడిచ్చిన ప్రవచన వాక్కులను ఈ ఎండిన ఎముకలకు ప్రవచించేలాగా చేశారు. యెముకలన్నీ ఒకదానితో ఒకటి అతుక్కున్నాయి, వాటి మీద మాంసం ఏర్పడింది. వాటిలోకి జీవం ప్రవేశించి గొప్ప సైన్యంగా నిలబడ్డాయి (యెహెజ్కేలు 37:10). ప్రవచన వాక్కుద్వారా ఒక దేశపు భాగ్యం ప్రభావితమైంది. దేవుని ఉద్దేశాలు నెరవేరడానికి దేవుని శక్తిని విడుదల చేసే వాహనంగా ప్రవచన వాక్కు పనిచేసింది.

ఈ రోజుకి కూడా పరిశుద్ధాత్మ దేవుడు మనల్ని ప్రేరేపించి ప్రవచన వాక్కును ఇస్తారు. ఇది మన జీవితాలమీద గాని, ఇతర ప్రజల మీదగాని, పట్టణాలు, ప్రాంతాలు లేదా దేశాల మీద గాని ఉండవచ్చు. ఆయన ప్రేరేపించిన మాటలను మనం ప్రకటించినప్పుడు ఎండిన ఎముకలలో జీవం వస్తుంది! చనిపోయింది తిరిగి జీవిస్తుంది! ప్రజలు, దేశాలు రెండింటిలో నిరీక్షణ జీవం వస్తాయి. పరిశుద్ధాత్మ దేవుడు మిమ్మల్ని ప్రేరేపిస్తున్నప్పుడు ఎండిన ఎముకలతో మాట్లాడండి అప్పుడు వాటిలో జీవం వస్తుందని జ్ఞాపకం ఉంచుకోండి!

# 28
# మీ మాటలు పరలోకంలో వినబడతాయి

**దానియేలు 10:12**

**అప్పుడతడు–దానియేలూ, భయపడకుము, నీవు తెలిసికొనవలెనని నీ మనస్సును అప్పగించి, దేవుని యెదుట నిన్ను తగ్గించుకొనిన ఆ మొదటి దినము మొదలుకొని నీవు చెప్పిన మాటలు వినబడినవి గనుక నీ మాటలనుబట్టి నేను వచ్చితిని.**

భూమి మీద మనం మాట్లాడే మాటలు పరలోకంలో వినబడతాయి. మనం మాట్లాడే మాటలకు స్పందనగా దేవుడు దేవదూతలను పంపుతారు.

ప్రార్థనలో మనం మాట్లాడతాము. మనం విశ్వాసాన్ని ఉపయోగిస్తూ మాట్లాడతాము. చీకటి శక్తులకు వ్యతిరేకంగా ఆత్మ ఖడ్గాన్ని ఉపయోగిస్తున్నప్పుడు మనం మాట్లాడతాము. మనం ప్రజలను ఆశీర్వదించడానికి మాట్లాడతాము. ప్రజలకు స్వస్థత, విడుదల కలగడానికి అద్భుతాలు జరగడానికి మనం మాట్లాడతాము. పర్వతాలను కదిలించడానికి తుఫానులను శాంతింపజేయడానికి మనం మాట్లాడతాము. మన అధికారాన్ని ఉపయోగిస్తూ భూమి మీద బంధించడానికి విడిపించడానికి మనం మాట్లాడతాము! మన మాటలకు స్పందనగా దేవదూతలను పంపుతారు.

మీ మాటలు పరలోకంలో వినబడతాయి కనుక మీరు ఎలాంటి మాటలను ప్రకటిస్తున్నారు? పరలోకంలో దేవుని మాట ఎల్లప్పుడూ నిలిచి ఉంటుంది. *"యెహోవా, నీ వాక్యము ఆకాశమందు నిత్యము నిలకడగానున్నది"*(కీర్తనలు 119:89). మనం ప్రార్థనలో, విశ్వాసంలో, యుద్ధరంగంలో, పరిచర్యలో, అధికారాన్ని ఉపయోగిస్తున్నప్పుడు, అలాగే అన్ని పరిస్థితులలో మనం ప్రకటించే మాటలు పరలోకంలో

ఇప్పటికే స్థిరపడిన దేవుని వాక్యానికి అనుగుణంగా ఉండాలి. మీ మాటలు పరలోకంలో వినబడతాయని గుర్తుంచుకోండి. ఎప్పుడు పరలోకానికి అనుగుణంగానే మాట్లాడండి, అప్పుడు పరలోకం మీ తరపున కదులుతుంది.

# 29
# మాటలు ఆత్మీయ రంగము నుండి భౌతిక రంగములోనికి ప్రసారమవుతాయి

**దానియేలు 10:17-19**
**[17] నా యేలిన వాని దాసుడనైన నేను నా యేలినవానియెదుట ఏలాగున మాటలాడుదును? నా బలము తొలగిపోయెను, ఊపిరి విడువలేక యున్నానని చెప్పగా**
**[18-19] అతడు మరల నన్నుముట్టి నన్ను బలపరచి–నీవు బహు ప్రియుడవు, భయపడకుము, నీకు శుభమవునుగాక, ధైర్యము తెచ్చుకొమ్ము. ధైర్యము తెచ్చుకొమ్మని నాతో చెప్పెను. అతడు నాతో ఇట్లనగా నేను ధైర్యము తెచ్చుకొని– నీవు నన్ను ధైర్యపరచితివి గనుక నా యేలినవాడవైన నీవు ఆజ్ఞ ఇమ్మని చెప్పితిని.**

దానియేలుకు ఈ దూత దర్శనం రాగానే అతడు చాలా ఆందోళనకు గురై, బలహీనునిగా శక్తివిహీనుడిగా అయ్యాడు, అంతే కాకుండా భయపడ్డాడు. దూత అతడిని తాకి, “భయపడకుము, నీకు శుభమవునుగాక, ధైర్యము తెచ్చుకొమ్ము” అని చెప్పాడు. ఆ తర్వాత దానియేలు బలపడ్డాడు. దూత ప్రకటించిన మాటలు దానియేలులో శాంతి బలం కలిగేలా చేశాయి. మాటలు ఆత్మీయ రంగము నుండి భౌతిక రంగములోనికి ప్రసారమవుతాయి.

దేవుడు ప్రజలమైన మనల్ని భౌతిక ఆత్మీయ రంగములు రెంటిలో క్రియ చేసేలాగా తయారు చేశారు. విశ్వాసులుగా మనం ఆత్మీయ రంగములో యేసు క్రీస్తుతో పాటు దేవుని కుడి చేతివైపున కూర్చొని ఉన్నాము. మనం క్రీస్తులో ఉన్నాము. మనం దేవుని వారసులము అలాగే యేసు ప్రభువుతో పాటు సహ వారసులము. ఆత్మీయ రంగములో మన స్థానం అది. మన మాటలే ఆత్మీయ రంగములో దేవుడు మనకిచ్చిన దానిని పొందేలా చేసి, భౌతిక రంగములో ఉన్న ఇతరులకు దానిని అందించేలా చేస్తాయి.

ఉదాహరణకు, మనం రోగులకు పరిచర్య చేస్తున్నప్పుడు స్వస్థత కలగాలని ఆజ్ఞాపించినప్పుడు, ఈ భౌతిక రంగములో అసాధారణమైన స్వస్థతను కలిగించేది ఏదైనా మన దగ్గర ఉందా? ఖచ్చితంగా ఏమి లేదు. మనం ఇక్కడ ఏమి చేస్తున్నామంటే, యేసు క్రీస్తు ముగించిన కార్యాన్ని బట్టి, ఆత్మీయ రంగములో మనకున్న అభిషేకాన్ని అధికారాన్ని బట్టి శారీరక స్వస్థత కొరకు ఎదురు చూస్తున్న వారికి స్వస్థతను అందిస్తున్నాము. మన మాటలు ఆత్మీయ రంగమును భౌతిక రంగమును అనుసంధానిస్తాయి. మనం దేవుని వాక్యానుసారంగా మాట్లాడినప్పుడు ఆత్మీయ రంగములో మనకు సంబంధించిన దానిని తీసుకుని భౌతిక రంగములోనికి విడుదల చేస్తాము. ఆయన రాజ్యం రావడాన్ని చూడడానికి మనమున్నాము, పరలోకంలో జరిగినట్లుగా ఈ భూమి మీద కూడా ఆయన చిత్తం జరుగుతుంది. మనం అలా చేయడానికి ఉన్న ఒక మార్గం ఏమిటంటే, ఆయన వాక్యానికి అనుగుణంగా మాట్లాడడమే అప్పుడు ఆయన మనకు ఆయన ఆత్మీయ రంగములో ఇచ్చిన దానిని భౌతిక రంగములోనికి విడుదల అవుతుంది.

# 30
# బలహీనుడు నేను బలవంతుడను అనుకోవాలి

**యోవేలు 3:9,10**
**[9] అన్యజనులకు ఈ సమాచారము ప్రకటనచేయుడి–యుద్ధము ప్రతిష్ఠించుడి, బలాఢ్యులను రేపుడి, యోధులందరు సిద్ధపడి రావలెను.**
**[10] మీ కర్రులు చెడగొట్టి ఖడ్గములు చేయుడి, మీ పోటకత్తులు చెడగొట్టి ఈటెలు చేయుడి; బలహీనుడు–నేను బలాఢ్యుడను అనుకొనవలెను.**

యెహోషాపాతు లోయలో హార్ మెగిద్దోను యుద్ధానికి ప్రభువు దినానికి సంబంధించిన ప్రవచనం యోవేలు 3వ అధ్యాయంలో ఉంది. దేశాలు యుద్దానికి సన్నద్ధమవుతున్నాయి. హానికరంకాని పనిముట్లు (నాగలి ఇంకా కత్తెర) కూడా యుద్ధోపకరణాలుగా (కత్తులు ఈటెలు) మారతాయని యోవేలు వివరిస్తున్నాడు. ఈ ప్రక్రియలో "బలహీనుడు నేను బలాఢ్యుడను అనుకొనవలెను" అనే ఆసక్తికర సందేశం ఉంది. బలహీనులు "నేను బలహీనుడను" అని చెప్పకూడదు. బలహీనులు "నేను బలాఢ్యుడను" అని చెప్పాలి. దీని గూడార్థమేమిటంటే, బలహీనుడు "నేను బలాఢ్యుడను" అని చెప్పడం ద్వారా అతడు బలవంతుడిగా మారి యుద్దంలో ముందుకు వెళ్తాడు.

దేవుడు తన వాక్యంలో మనకొరకు ప్రకటించినది ఆ సమయంలో మనకు నచ్చకపోయినప్పటికి అదే విధంగా ప్రకటించడం సరైనదేనా?

పాపంతో పోరాడుతున్నవారు పాపం మీద విజయం సాధించడానికి, "పాపానికి నాపైన అధికారం లేదని చెప్పడం సరైనదేనా? ఖచ్చితంగా సరైనదే!

పాపాన్ని ఇంకా శోధనను ఎదుర్కొంటున్న వారు (అంటే

మనమందరము), “నా పాత పాపస్వభావం క్రీస్తుతో పాటు సిలువ వేయబడింది, నా జీవితం మీద ఉన్న దాని కాడి విరిచివేయబడింది. పాపానికి నా మీద ఏ అధికారం లేదు” అని చెప్పాలి.

అనారోగ్యంతో ఉన్నవారు స్వస్థత పొందడం కోసం, “నేను యేసు పొందిన దెబ్బలు చేత స్వస్థత పొందాను” అని ప్రకటించడం సరైనదేనా? ఖచ్చితంగా సరైనదే!

అనారోగ్యంతో ఉన్నవారు, “యేసు ప్రభువు నా రోగాలను భరించి, నా బాధలను అనుభవించారు. ఆయన పొందిన దెబ్బల చేత నేను స్వస్థత పొందాను” అని చెప్పాలి.

అవసరంలో ఉన్నవారు తమ అవసరాలు తీరడం కోసం, “నా దేవుడు నా అవసరాలన్ని తీరుస్తారు” అని చెప్పడం సరైనదేనా? ఖచ్చితంగా సరైనదే!

అవసరంలో ఉన్నవారు, “యెహోవా నా కాపరి; నాకు లేమి కలుగదు. నా దేవుడు మహిమైశవర్యముచొప్పున యేసు క్రీస్తులోని నా ప్రతి అవసరతలను తీర్చును” అని చెప్పాలి.

శక్తిహీనంగా భావించేవారు, “పరిశుద్ధాత్మ దేవుడు నా మీదకి వచ్చారు కాబట్టి నిజంగా నేను శక్తితో నిండి ఉన్నాను అని చెప్పడం సరైనదేనా? ఖచ్చితంగా సరైనదే!

మనం, “పరిశుద్ధాత్మ నా మీదికి వచ్చిన తర్వాత నేను శక్తిని పొందుకున్నాను కనుక నేను బీదలకు సువార్త ప్రకటించడానికి, విరిగి నలిగిన వారిని స్వస్థపర్చడానికి, చెరలోనున్నవారికి విడుదల ప్రకటించడానికి నేను అభిషేకించబడ్డాను” అని ప్రకటిద్దాము.

దేవుని వాక్యం మీ గురించి ప్రకటించింది మీరు అనుకున్న దానికి పూర్తి వ్యతిరేకంగా ఉన్నప్పటికిని దానిని అంగీకరించండి. దేవుని

వాక్యం సత్యము. వాస్తవాలు మారతాయి. దేవుని సత్యం నిత్యం నిలిచి ఉంటుంది, అది ఎన్నటికీ మారదు. మీరు ఎదుర్కొంటున్న వాస్తవాలు దేవుని వాక్యపు సత్యానికి అనుగుణంగా మారతాయి. బలహీనుడు, నేను బలాఢ్యుడను అనుకొనవలెను, కాబట్టి బలవంతుడిగా అవ్వనివ్వండి.

# 31
# మీ మాటలతో దేవున్ని దుఃఖపర్చవద్దు

**మలాకి 3:13-16**
**13 యెహోవా సెలవిచ్చునదేమనగా–నన్నుగూర్చి మీరు బహు గర్వపుమాటలు పలికి–నిన్నుగూర్చి యేమి చెప్పితిమని మీరడుగుదురు.**
**14 దేవుని సేవచేయుట నిష్ఫలమనియు, ఆయన ఆజ్ఞలను గైకొని సైన్యములకు అధిపతియగు యెహోవా సన్నిధిని మనం దుఃఖాక్రాంతులుగా తిరుగుటవలన ప్రయోజనమేమనియు,**
**15 గర్విష్ఠులు ధన్యులగుదురనియు యెహోవాను శోధించు దుర్మార్గులు వర్ధిల్లుదురనియు, వారు సంరక్షణ పొందుదురనియు మీరు చెప్పుకొనుచున్నారు.**
**16 అప్పుడు, యెహోవాయందు భయభక్తులుగలవారు ఒకరితో ఒకరు మాటలాడుకొనుచుండగా యెహోవా చెవియొగ్గి ఆలకించెను. మరియు యెహోవాయందు భయభక్తులుకలిగి ఆయన నామమును స్మరించుచు ఉండువారికి జ్ఞాపకార్థముగా ఒక గ్రంథము ఆయన సముఖమునందు వ్రాయబడెను.**

దేవుడు తన ప్రజలు మాట్లాడే మాటలు విని గాయపడి బాధపడుతున్నారని ఊహించుకోండి. దేవుడు మన మాటలను వింటారు. యెహోవాయందు భయభక్తులుకలిగి ఆయన నామమును స్మరించుచు ఉండువారికి జ్ఞాపకార్థముగా ఒక గ్రంథము ఆయన సముఖమునందు వ్రాయబడెను అని 16వ వచనం మనకు తెలియజేస్తుంది.

మనం మాట్లాడే మాటలను దేవుడు వింటారు. మీ మాటలు విన్న తర్వాత దేవుడు ఎలా అనుభూతిని చెందాలని మీరు ఆశపడుతున్నారు? ఖచ్చితంగా, మన మాటలతో దేవున్ని భాధించాలని గాని నొప్పించాలని గాని మనం కోరుకోము.

మనం మాట్లాడే మాటలు దేవున్ని మహిమపర్చి ఘనపరుస్తాయని, ఆయన హృదయాన్ని సంతోషపరుస్తాయని ఖచ్చితంగా ఎలా చెప్పగలం? మనం ఆయన వాక్యానికి

అనుగుణంగాను అలాగే ఆయన దృష్టికి సరియైనదిగాను ఉన్న మాటలను మాట్లాడినప్పుడు మాత్రమే అలా చెప్పగలము.

మీ మాటలతో దేవున్ని దుఃఖపెట్టకండి. దేవుడు చెప్పిందే చెప్పండి. అన్ని పరిస్థితులలో ఆయన వాక్యాన్ని ప్రకటించండి. ప్రతి స్థితిలో మీరు ఆయనను అలాగే ఆయన వాక్యాన్ని ఘనపరుస్తున్నారని ఆయనకు తెలపండి.

# 32
# "ఇలా రాయబడింది" అని యేసు ప్రభువు చెప్పి నట్ లుగా చెప్పడం నేర్చు కోండి

**మత్తయి 4:1-4**
**[1] అప్పుడు యేసు అపవాదిచేత శోధింపబడుటకు ఆత్మ వలన అరణ్యమునకు కొనిపోబడెను.**
**[2] నలువది దినములు నలువదిరాత్రులు ఉపవాసముండిన పిమ్మట ఆయన ఆకలిగొనగా**
**[3] ఆ శోధకుడు ఆయనయొద్దకు వచ్చి నీవు దేవుని కుమారుడవైతే ఈ రాళ్లు రొట్టెలగునట్లు ఆజ్ఞాపించుమనెను**
**[4] అందుకాయన –మనుష్యుడు రొట్టెవలన మాత్రము కాదుగాని దేవుని నోటనుండి వచ్చు ప్రతిమాటవలనను జీవించును అని వ్రాయబడియున్నదనెను.**

మనకు పరిపూర్ణ మాదిరిగా ఉన్న యేసు ప్రభువును మనం అన్ని విషయాల్లో అనుకరించాలి. అరణ్యంలో ఆయన ఎదుర్కొన్న మూడు శోధనలు మన కొరకు రాసి ఉన్నాయి. ఆయన ఈ శోధనలను మాత్రమే కాదు మనలాగానే అన్ని విషయాలలో (అన్ని రకాలుగా) శోధనలను ఎదుర్కొన్నారు. అయినా సరే ఆయన ఏ పాపం లేకుండా ఉన్నారు (హెబ్రీయులకు 4:15). ఈ శోధనలన్నింటి గురించి మనకు రాయలేదు. అయితే మత్తయి 4వ అధ్యాయంలో తెలియజేసిన ప్రకారం మూడు శోధనలను ఎదుర్కొన్న ప్రతిసారి వాక్యాన్ని ప్రకటించడం ద్వారా యేసు ప్రభువు ఆ శోధనలకు స్పందించారు. ఆయన ప్రతిసారి "ఇలా రాయబడింది" అని చెప్పారు. అందుకనే ఆయన ప్రతి శోధనను వాక్యాన్ని ప్రకటిస్తు ఎదుర్కొన్నారని మనం రూఢిగా నమ్మవచ్చు.

ప్రతి శోధనలో ప్రతి పరిస్థితిలో "ఇలా రాయబడింది" అని చెప్పడం నేర్చుకోండి. దేవుడు ఏమి చెప్పారో అదే చెప్పండి. శోధనలను, సవాలుకరమైన పరిస్థితులను జయించడానికి వాక్యాన్ని

ప్రకటించండి. ఒక శోధన ఎదుర్కొంటున్నప్పుడు, “నా దేహం నాలో నివసించే పరిశుద్ధాత్మకు ఆలయమైయుంది అని రాయబడిందని, పాపమునకు నా మీద అధికారము లేదు; నీతికి సాధనంగా నా శరీరాన్ని సమర్పిస్తాను అని రాయబడిందని, ఒక పరిస్థితిని మరియు అధిగమించలేని సవాళ్లు ఎదుర్కొంటున్నప్పుడు, “నేను దేవుని వలన పుట్టాను. ఈ లోకాన్ని జయించాను. లోకమును జయించు విజయమే నా విశ్వాసము. దేవుడు ఎప్పుడూ నాకు విజయాన్నిస్తారు. ఈ పరిస్థితిలో కూడా నేను జయిస్తాను అని రాయబడింది ఉందని చెప్పాలి. “ఇలా రాయబడింది” అని చెప్పడం నేర్చుకోండి. యేసు ప్రభువు అదే చేశారు. ప్రతి పరిస్థితిలో దేవుని వాక్యాన్ని ప్రకటించండి.

# 33
# వాక్యంతో దురాత్మలను పారద్రోలండి

**మత్తయి 8:16**
**సాయంకాలమైనప్పుడు జనులు దయ్యములు పట్టిన అనేకులను ఆయనయొద్దకు తీసికొని వచ్చిరి.**

సువార్తలలో యేసు ప్రభువు పరిచర్యను చూసినప్పుడు ఆయన దురాత్మలను ఎలా వెళ్లగొట్టారో మనం నేర్చుకుంటాము. ఆయన ఒక్క ఆజ్ఞ ఇచ్చి దురాత్మల మీద తనకున్న అధికారాన్ని ఆధిపత్యాన్ని చూపించారు. ఆయన దురాత్మలను ఒక్క మాటతో వెళ్లగొట్టారని మత్తయి రాసాడు. ఆయన అధికారంతో ఒకే ఒక మాట మాట్లాడారు.

యేసు ప్రభువు మాదిరిని అనుకరిద్దాము. క్రీస్తులో మనకున్న అధికారాన్ని ఆధిపత్యాన్ని మన మాటలు వ్యక్తపరుస్తాయి. ఆయన నామాన్ని ఉపయోగించుకొనే హక్కు ద్వారా మనకివ్వబడిన అధికారాన్ని మనం కలిగి ఉన్నాము. మనం ఆయన అధికారంలో నడుస్తాము. అధికారంతో ఒకే ఒక మాట మాట్లాడి మనం దురాత్మలను వెళ్లగొడతాము.

అధికారంతో మాట్లాడడం నేర్చుకోండి. మీకోసం అలాగే ఇతరులకు పరిచర్య చేస్తున్నపుడు మీరిది చేయండి. భయం కలిగించే ఆలోచనలు వస్తే, “యేసు ప్రభువు నామములో పిరికితనంగల ఆత్మను విడిచిపొమ్మని ఆజ్ఞాపిస్తున్నాను. భయం కలిగించే ఆలోచనలను యేసు ప్రభువు నామములో త్రోసివేస్తున్నాను” అని ప్రకటించండి. సాధారణంగా అక్కడున్న పరిస్థితిని బట్టి ఆ ఆత్మ గద్దిస్తారు. ఏదో తెలియని అర్థంకాని విషయం మీకు కలవరాన్ని కలిగిస్తుంటే ఆ కలవరం పైన అధికారాన్ని తీసుకోండి. “యేసు ప్రభువు నామములో,ఇక్కడ పనిచేస్తున్న కలవరపర్చే ఆత్మల మీద

అధికారాన్ని తీసుకుంటున్నాను. నేను వాటి పనిని బంధిస్తున్నాను. యేసు ప్రభువు నామములో విడిచిపొమ్మని ఆజ్ఞాపిస్తున్నాను" అని ప్రకటించండి. రోగంతో ఉన్నవారికి సేవ చేస్తున్నప్పుడు ఆ స్థితికి దురాత్మలే కారణమని మీకు అనిపిస్తే, "యేసు ప్రభువు నామములో అనారోగ్యం కలిగించే దురాత్మ మీద అధికారం తీసుకుని, ఇప్పుడే విడిచిపొమ్మని నేను దానిని ఆజ్ఞాపిస్తున్నాను" అని చెప్పండి.

అధికారంతో మాట్లాడి దురాత్మలను వెళ్లగొట్టండి. యేసు అదే చేసారు మనం కూడా అదే చేయాలి.

# 34
# మీరు భూమి మీద ఆయనను ఒప్పుకుంటే, పరలోకంలో ఆయన మిమ్మల్ని ఒప్పుకుంటారు

**మత్తయి 10:32,33**
**[32] మనుష్యులయెదుట నన్ను ఒప్పుకొనువాడెవడో పరలోకమందున్న నా తండ్రి యెదుట నేనును వానిని ఒప్పుకొందును.**
**[33] మనుష్యుల యెదుట ఎవడు నన్ను ఎరుగనననునో వానిని పరలోకమందున్న నా తండ్రియెదుట నేనును ఎరుగనందును.**

యేసు ప్రభువు మాటలు స్పష్టంగా ఉన్నాయి. మనం మనుషుల ముందు ఆయనను ఒప్పుకుంటే ఆయన పరలోకపు తండ్రి ముందు మనల్ని ఒప్పుకుంటారు.

"ఒప్పుకొనుట" అనే పదానికి గ్రీకు పదం *'హోమోలోజియా'*. ఈ పదం *'హోమో'* అంటే "ఒకే రీతిగా" అని, *'లోగో'* అంటే "చెప్పబడింది" అని అర్థమిచ్చే రెండు గ్రీకుపదాలు కలిసి ఏర్పడిన పదము. కాబట్టి, "ఒప్పుకొనుట" అంటే "కలిసి ఒకటే విషయాన్నీ చెప్పడం, అంగీకరించడం, సమ్మతించడం, గుర్తించడం, ఒప్పుకోవడం" అని అర్థము.

"ఒప్పుకొనుట" అంటే" "మరొకరు చెప్పినట్లుగానే అదే విషయాన్ని చెప్పడము." వాక్యానుసారంగా ఒప్పుకోవడమంటే దేవుడు చెప్పిన దానితో అనగా ఆయన వాక్యంతో ఏకీభవించడము. దేవుడు చెప్పినదే చెప్పడము. ఆయన అన్న మాటనే మనం చెప్పడము. దేవుని వాక్యానికి విరుద్ధమైన మీ సొంత ఆలోచన చెప్పి అదే ఒప్పుకోవడమని మీరు అనకూడదు.

యేసు ప్రభువు తానెవరని చెప్పారో అదే మనం ఒప్పుకోవాలి. యేసు ప్రభువు గురించి మన ఒప్పుకోలు, ఆయన తన గురించి చెప్పిన దానిని అంగీకరించాలి. యేసే క్రీస్తు (మెస్సియా), ఆయన జీవం కలిగిన దేవుని కుమారుడు. ఆయనే మార్గము, సత్యము, జీవమునైయున్నారు; ఆయన ద్వారా తప్ప ఎవరు తండ్రియొద్దకు రాలేరు. మనం ప్రజల ముందు ఆయనను ఒప్పుకున్నప్పుడు అంటే ఆయన తన గురించి చెప్పిన దానినే మనం చెప్పినప్పుడు ఆయన పరలోకంలోని తండ్రి ఎదుట మనల్ని ఒప్పుకుంటారు (ఆయనతో మనకున్న సంబంధం గురించి మనం చెప్పిన వాటిని ఆయన అంగీకరిస్తారు). “నేను యేసు క్రీస్తు రక్తంలో కడుగబడి, పాప విమోచన పొంది, దేవుని రాజ్యములోనికి చేర్చబడ్డ దేవుని బిడ్డను” అని మీరు చెప్తే, దానినే యేసు ప్రభువు పరలోకంలో ఉన్న తండ్రి ముందు ఒప్పుకుంటారు!

యేసు ప్రభువు తన గురించి చెప్పిన దానిని అలాగే ఆయన గురించి దేవుని వాక్యం బయలుపరిచిన దానిని ఒప్పుకోండి. ఆయనే రక్షకుడు, స్వస్థపరిచేవాడు, విమోచకుడు. సమాధానాధిపతి. మనుషుల ముందు ఆయనను ఒప్పుకోండి. అప్పుడు ఆయన తండ్రి ముందు మిమ్మల్ని ఒప్పుకుంటారు.

# 35
# మాటలు మీ హృదయంలో ఉన్న దానినే మీ జీవితంలోనికి విడుదల చేస్తాయి

**మత్తయి 12:33-35**
**33 చెట్టు మంచిదని యెంచి దాని పండును మంచిదే అని యెంచుడి; లేదా, చెట్టు చెడ్డదని యెంచి దాని పండును చెడ్డదే అని యెంచుడి. చెట్టు దాని పండువలన తెలియబడును.**
**34 సర్పసంతానమా, మీరు చెడ్డవారైయుండి ఏలాగు మంచిమాటలు పలుకగలరు? హృదయమందు నిండియుండు దానిని బట్టి నోరు మాటలాడును గదా.**
**35 సజ్జనుడు తన మంచి ధననిధిలోనుండి సద్విషయములనుతెచ్చును; దుర్జనుడు తన చెడ్డ ధననిధిలోనుండి దుర్విషయములను తెచ్చును.**

ఒక చెట్టు గురించి దాని ఫలాలను బట్టి తెలుస్తుంది. ఒక చెట్టుకు కాసే ఫలం ఆ చెట్టులో ఉన్న దానిని బట్టి ఆ చెట్టు రకాన్ని బట్టి ఉంటుంది. యేసు ప్రభువు ఈ సత్యాన్ని మనుషులకు వర్తింపజేస్తున్నారు. ఒకరి హృదయం చెడ్డదైతే వారి నోరు చెడ్డ మాటలే మాట్లాడుతుంది ఎందుకంటే, హృదయంలో ఉన్నదే నోటి మాటల ద్వారా బయటకు వస్తుంది.

మనలో ఉన్నదానిని బట్టే మనం తీసుకువచ్చే ఫలం ఆధారపడి ఉందని 35వ వచనంలో మనం గ్రహిస్తాము. మీ లోపల మంచి నిల్వ ఉంటే (మంచి ధననిది) మీరు మంచి ఫలాన్ని అంటే మీ జీవితంలోనికి మంచి విషయాలను తీసుకువస్తారు.

లోపల ఉన్న దానిని (మంచి నిధిని) మన జీవితంలో (ఫలాన్ని తీసుకురావడంలో మాటలు ఒక ముఖ్య పాత్రను పోషిస్తాయి, ఎందుకంటే హృదయం నిండి ఉన్న దానిని బట్టే (మంచి నిధి) నోరు మాట్లాడుతుంది.

మాటలు మనలో ఉన్న దానిని మన జీవితంలోకి విడుదల చేస్తాయి. మనం మాట్లాడే మాటలను బట్టి మన హృదయంలో ఉన్నవే మన జీవితంలోనికి విడుదలవుతాయి.

మంచిని పోగు చేయండి. క్రీస్తు వాక్యం మీలో సమృద్ధిగా నివసింపనియ్యుడి అనే ఆజ్ఞ మనకుంది (కొలొస్సయులకు 3:16). మీ లోపల దేవుని వాక్యమనే గొప్ప నిధిని కలిగి ఉండండి. మీరు మాట్లాడే మాటలు మీలోనున్న దేవుని వాక్యానికి అనుగుణంగా ఉంటాయి. మీలో ఉన్న దానిని బట్టి మీరు దేవుని వాక్యానుసారంగా మాట్లాడకుండా ఉండలేరు. మీ జీవితాన్ని రూపుదిద్దే శక్తులు మీ హృదయంలో నుండే వస్తాయి కాబట్టి మీరు కూడా మంచి విషయాలనే తీసుకువస్తారు (సామెతలు 4:22). మాటలు మీ హృదయంలో ఉన్న దానిని మీ జీవితంలోనికి విడుదల చేస్తాయి. వాక్యంతో నింపబడండి. వాక్యాన్ని ప్రకటించండి.

# 36
# మీ మాటలను బట్టే మీరు నీతిమంతులుగా తీర్పుతీర్చబడతారు లేదా ఖండించబడతారు

**మత్తయి 12:36,37**
**36 నేను మీతో చెప్పునదేమనగా –మనుష్యులు పలుకు వ్యర్థమైన ప్రతి మాటనుగూర్చియు విమర్శదినమున లెక్క చెప్పవలసియుండును.**
**37 నీ మాటలనుబట్టి నీతిమంతుడవని తీర్పునొందుదువు, నీ మాటలనుబట్టియే అపరాధివని తీర్పునొందుదువు.**

మీ మాటలు ఎంత ముఖ్యమైనవి? మనం మాట్లాడిన వ్యర్థమైన మాటలకు కూడా మనం లెక్క చెప్పాలని యేసు ప్రభువు చెప్పారు. మన మాటలలోనే జీవన్మరణముల శక్తి ఉందని సామెతలు 18:21లో చూశాము. మన మాటల వల్ల కలిగే శాశ్వతమైన పర్యవసనాల గురించి యేసు ప్రభువు మత్తయి 12:36,37లో తెలియజేసారు. మన మాటలను బట్టే మనం నీతిమంతులుగా తీర్చబడతాము లేదా ఖండించబడతాము. ఒకపేళ మన మాటలు ఇక్కడ ఇంకా తర్వాతి లోకంలో కూడా ముఖ్యమైనవే కాబట్టి మన మాటలు గురించి శ్రద్ధవహించాలి.

"వ్యర్థమైన" అనే పదానికి గ్రీకు పదం 'అర్గోస్', దీనికి "నిష్క్రియమైన, పనిలేని, లాభంలేని, వ్యర్థమైన, నెమ్మది, బంజరు" అని అర్థము. మనం మాట్లాడే ప్రతి వ్యర్థమైన మాటకు, అనుకోకుండా మాట్లాడిన మాటలకు అంటే మనం అరుదుగా ఉపయోగించే మాటలకు కూడా లెక్క చెప్తామని యేసు ప్రభువు చెప్పారు. ఇది ఎలా జరుగుతుందో నాకు తెలీదు కానీ ఆయన ఇచ్చిన హెచ్చరికపై శ్రద్ధ వహించాలి.

వ్యర్థమైన మాటలను మాట్లాడే బదులు, మీకు ఇంకా మీ చుట్టూ

ఉన్న వారికి పనికివచ్చే, ఫలవంతమైన, లాభసాధకమైన మాటలను మాట్లాడండి. మీ జీవితంలోను ఇంకా ఇతరుల జీవితంలోను జీవాన్ని, ఆశీర్వాదాన్ని, బలాన్ని ఇంకా శక్తిని విడుదల చేసే మాటలను మాట్లాడండి. మిమ్మల్ని ఇంకా మీ చుట్టూ ఉన్న వారిని నీతిమంతులుగా చేసే, ఉన్నత స్థితికి చేర్చే ఇంకా సంపన్నం చేసే మాటలను మాట్లాడండి. వాక్యాన్ని ప్రకటించండి.

# 37
# మాటలు బంధించడానికి విప్పడానికి రాజ్యపు అధికారాన్ని విడుదల చేస్తాయి

**మత్తయి 16:18,19**
**[18] మరియు నీవు పేతురువు; ఈ బండమీద నా సంఘమును కట్టుదును, పాతాళలోక ద్వారములు దాని యెదుట నిలువనేరవని నేను నీతో చెప్పుచున్నాను.**
**[19] పరలోకరాజ్యముయొక్క తాళపుచెవులు నీకిచ్చెదను, నీవు భూలోకమందు దేని బంధించుదువో అది పరలోకమందును బంధింపబడును, భూలోకమందు దేని విప్పుదువో అది పరలోకమందును విప్పబడునని అతనితో చెప్పెను.**

జీవంగల దేవుని కుమారుడైన యేసు క్రీస్తు (మెస్సియ) అనే బండమీద సంఘం కట్టబడింది. అది తండ్రి బయలుపర్చడం ద్వారా పేతురు చేసిన గొప్ప ఒప్పుకోలు. పాతాళలోకపు శక్తులు ఎదిరించలేని, అడ్డుకోలేని మరియు జయించలేని శక్తివంతమైన సంఘాన్ని యేసు ప్రభువు కడుతున్నారు. యేసు ప్రభువు ఈ సంఘానికి దేవుని సొంత రాజ్యమైన పరలోక రాజ్యపు తాళపు చెవులు ఇచ్చారు. ఈ లోకంలోనికి దేవుని రాజ్యాన్ని విడుదల చేయడానికే భూమి మీద ఈ సంఘం ఉంది. దానికి పరలోక రాజ్యపు అధికారం ఇవ్వబడింది.

ఈ భూలోకంలో పరలోక రాజ్యపు అధికారాన్ని ఎలా ఉపయోగిస్తారు? యేసు ప్రభువు, "భూమ్మీద బంధిస్తాము" అలాగే "భూమ్మీద విప్పుతాము" అని చెప్పారు. "బంధించడం" అనే మాటకు "నిషేదించడం, అనుమతించక పోవడం ఇంకా చట్టవిరుద్ధం" అని అర్థము. "విప్పడమనే" మాటకు ""నాశనం చేయడం, నిలిపివేయడం, బంధించడం, విప్పడం, విడుదల చేయడం, వేరు చేయడం, రద్దు చేయడం, విసిరేయడం, పడగొట్టడం మరియు తొలగించడం" అని అర్థము. మనం ఎలా బంధించి విడుదల చేస్తాము? యేసు ప్రభువు తన పరిచర్యలో ఇది చేయడం చూస్తాము. ఆయన మాటల ద్వారా

తన అధికారాన్ని ఉపయోగించి దానిని చేశారు. మూగ చెవిటి వారితో ఆయన "తెరవబడు" అని చెప్పగానే వారి చెవులు నాలుక విప్పబడ్డాయి (మార్కు 7:33-35). ఆయన స్త్రీతో, "నీ బలహీనత నుండి విడుదల పొంది యున్నావని" చెప్పారు (లూకా 13:12). ప్రజలను విడుదలచేసి దయ్యపు క్రియలను ఆపగలిగే అధికారం కలిగిన మాటలను యేసు ప్రభువు మాట్లడారు.

మనం ఆయన మాదిరిని అనుకరిద్దాము. యేసు ప్రభువు అధికారం కలిగిన మాటలను మాట్లాడాలి. మనకివ్వబడిన అధికారంతో మాట్లాడడం ద్వారా మనం బంధిస్తాము విప్పుతాము. ఒక విశ్వాసిగా మీకివ్వబడిన దేవుని రాజ్యపు అధికారాన్ని మీ మాటలలో ఉపయోగించండి. మీ మాటలు బంధించడానికి విప్పడానికి రాజ్యపు అధికారాన్ని విడుదల చేస్తాయి! అధికారంతో కూడిన మాటలను మాట్లాడండి.

# 38
# పర్వతంతో మాట్లాడండి

**మత్తయి 17:20**
**అందుకాయన – మీ అల్పవిశ్వాసము చేతనే; మీకు ఆవగింజంత విశ్వాసముండినయెడల ఈ కొండను చూచి–ఇక్కడనుండి అక్కడికి పొమ్మనగానే అది పోవును; మీకు అసాధ్యమైనది ఏదియు నుండదని నిశ్చయముగా మీతో చెప్పుచున్నానని వారితో అనెను.**

సువార్తలలో విశ్వాసం గురించి యేసు ప్రభువు చేసిన బోధలను మనం అధ్యయనం చేసినట్లైతే, మన విశ్వాసం గురించి మాట్లాడడానికి ఆయన ఎక్కువ ప్రాధాన్యతనిచ్చారని తెలుసుకుంటాము. మత్తయి 17లో దయ్యాన్ని వెళ్లగొట్టడంలో విఫలమైన శిష్యులు తామెందుకు చేయలేకపోయామని యేసయ్యను అడిగినప్పుడు దానికి వారి అపనమ్మకం వారి అవిశ్వాసమే కారణమని ఆయన చెప్పారు. అటుతర్వాత, ఆయన విశ్వాసం ద్వారా సాధ్యమయ్యే వాటి గురించి బోధిస్తూ విశ్వాసంతో ఏమి చేయవచ్చో, ఇంకా ఎలా మన విశ్వాసాన్ని ఉపయోగించుకోవచ్చో చెప్పారు.

క్లుప్తంగా చెప్పాలంటే, విశ్వాసం అనేది దయ్యాలను, వాటి క్రియలనే పడగొట్టడమే కాకుండా ప్రకృతిసహజమైన లోకంలో కూడా మార్పు చేయగలదు (ఉదాహరణకు, ఈ పర్వతాన్ని ఇక్కడనుండి అక్కడకు కదల్చడం). విశ్వాసం ఉంటే “మీకు అసాధ్యమైంది ఏది లేదు” అని యేసు ప్రభువు చెప్పారు. మన హృదయాలలో ఉన్న విశ్వాసంతో మన పనిని జరిగించవచ్చు. మన హృదయాలలో ఉన్న విశ్వాసం ఎంత ప్రభావంతమైనదని, ఒక ఆవ గింజంత విశ్వాసముంటే చాలు పర్వతమే కదులుతుందని యేసు ప్రభువు చెప్పారు. విశ్వాసాన్ని వ్యక్తపరిచే విధానమేమిటంటే - ప్రకటించడమే! మీ విశ్వాసాన్ని ప్రకటించండి. మీ హృదయంలో విశ్వాసం కలిగి మీకు

విశ్వాసముంచిన వాటి గురించి వివరించే మాటలను మాట్లాడండి.

మనం పర్వతంతో మాట్లాడాలని ఆయన ఖచ్చితంగా చెప్పారు. పర్వతం కదలాలంటే, మనం పర్వతంతో మాట్లాడాల్సిందే. తరచు మనం పర్వతం గురించి ఇతరులతో మాట్లాడడం అనే తప్పు చేస్తాము. కొన్ని సార్లు, మనం పర్వతం గురించి దేవునికి చెప్పి ఫిర్యాదులు చేస్తూ, అది అక్కడ ఉందని ఆయనకు తెలియదన్నట్లు ప్రవర్తిస్తాము. మన హృదయాలలో ఉన్న విశ్వాసంతో పర్వతంతో మాట్లాడాలని యేసు ప్రభువు స్పష్టంగా సూచించారు. దయ్యాలతో మాట్లాడండి. వ్యాధులతో మాట్లాడండి. తుఫానులతో మాట్లాడండి. పరిస్థుతలతో మాట్లాడండి. లేమితో మాట్లాడండి. మూయబడిన తలుపులతో మాట్లాడండి. భౌతిక రంగములో ఉన్న వాటితో మాట్లాడండి. నీ విశ్వాసాన్ని ఆధారంగా ఆజ్ఞాపించండి. ఆయన, “మీకు అసాధ్యమైనది ఏదియు నుండదు” అని చెప్పారు. విశ్వాసం కోసం యేసు ప్రభువు ఇచ్చిన సూచనను పాటిద్దాము. మీ విశ్వాసాన్ని ప్రకటించండి.

# 39
# మీరు ఆశించిన ఫలితాన్ని ప్రకటించండి

**మార్కు 5:25-34**
**25 పండ్రెండేండ్లనుండి రక్తస్రావ రోగము కలిగిన యొక స్త్రీ యుండెను. ఆమె అనేక వైద్యులచేత ఎన్నో తిప్పలుపడి**
**26 తనకు కలిగినదంతయు వ్యయము చేసికొని, యెంతమాత్రమును ప్రయోజనములేక మరింత సంకట పడెను.**
**27-28 ఆమె యేసునుగూర్చి విని–నేను ఆయన వస్త్రములు మాత్రము ముట్టిన బాగుపడుదుననుకొని, జనసమూహములో ఆయన వెనుకకు వచ్చి ఆయన వస్త్రము ముట్టెను.**
**29 వెంటనే ఆమె రక్తధార కట్టెను గనుక తన శరీరములోని ఆ బాధ నివారణయైనదని గ్రహించుకొనెను.**
**30 వెంటనే యేసు తనలోనుండి ప్రభావము బయలువెళ్లెనని తనలోతాను గ్రహించి, జనసమూహముపైపు తిరిగి–నా వస్త్రములు ముట్టినదెవరని అడుగగా**
**31 ఆయన శిష్యులు –జనసమూహము నీ మీద పడుచుండుట చూచుచున్నావే; నన్ను ముట్టినదెవడని అడుగుచున్నావా? అనిరి.**
**32 ఆ కార్యము చేసిన ఆమెను కనుగొనవలెనని ఆయన చుట్టు చూచెను.**
**33 అప్పుడా స్త్రీ తనకు జరిగినది యెరిగి, భయపడి, వణకుచువచ్చి, ఆయన ఎదుట సాగిలపడి, తన సంగతి యంతయు ఆయనతో చెప్పెను.**
**34 అందుకాయన – కుమారీ, నీ విశ్వాసము నిన్ను స్వస్థపరచెను, సమాధానము గలదానవై పొమ్ము; నీ బాధ నివారణయై నీకు స్వస్థత కలుగుగాక అని ఆమెతో చెప్పెను.**

ఈ స్త్రీ మొదట తనలో తాను "నేను ఆయన వస్త్రములు మాత్రము ముట్టిన బాగుపడుదును" అని అనుకొని ఉండవచ్చు. తర్వాత ఆమె "నేను ఆయన వస్త్రములు మాత్రము ముట్టిన బాగుపడుదును" అని బయటకే చెప్పింది. ఇలా ఆమె చెప్పడం వల్ల ఇతరులకు తెలిసింది అది మన కోసం రాయబడింది. ఆమె విశ్వాసమే ఆమెను స్వస్థపరచిందని యేసు ప్రభువు ఆ స్త్రీతో అన్నారు. ఆమె మాటలు చేతలలో విశ్వాసం ఉంది. ఆమె నమ్మింది. ఆమె ప్రకటించింది. ఆమె క్రియల్లో చూపింది.

తాను కోరుకున్న ఫలితాన్ని విశ్వాసంతో ఆమె వ్యక్తపరచింది. యేసు ప్రభువు వస్త్రాన్ని ముట్టుకుంటే చాలా తాను బాగుపడతానని ఆమె చెప్పింది. అద్భుతమైన స్వస్థతను తెచ్చిన ఆమె విశ్వాసాన్ని యేసు ప్రభువు గుర్తించారు.

కాలం మారింది. అయితే, దేవునిలోని విశ్వాసాని సంబంధించిన ఈ బైబిలు నియమం మాత్రం ఇంకా పనిచేస్తూనే ఉంది. మన హృదయాలలో ఉన్న విశ్వాసానికి దేవుడు స్పందిస్తూనే ఉన్నారు. మన మాటలలో చేతలలో మన విశ్వాసం వ్యక్తమవుతుంది. మీ విశ్వాసాన్ని ప్రకటించండి. దేవుడు చేస్తారని మీరు నమ్ముతున్న ఆశించిన ఫలితాన్ని ప్రకటించండి.

# 40
# మీరు చెప్పింది జరుగుతుందని నమ్మండి

**మార్కు 11:22,23**
**[22] అందుకు యేసు వారితో ఇట్లనెను–మీరు దేవునియందు విశ్వాసముంచుడి.**
**[23] ఎవడైనను ఈ కొండను చూచి–నీవు ఎత్తబడి సముద్రములో పడవేయబడుమని చెప్పి, తన మనస్సులో సందేహింపక తాను చెప్పినది జరుగునని నమ్మినయెడల వాడు చెప్పినది జరుగునని మీతో నిశ్చయముగా చెప్పుచున్నాను.**

దేవునిలో విశ్వాసం గురించి యేసు ప్రభువు మనకు చాలా స్పష్టమైన బోధనను అందించిన వాక్యభాగాలలో ఒకటి మార్కు 11:22,23. అప్పుడే యేసు ప్రభువు అంజూరపు చెట్టుతో మాట్లాడడం ద్వారా విశ్వాసాన్ని ఎలా వ్యక్తపరచాలో చూపించారు. ఆయన అంజూరపు చెట్టుతో మాట్లాడినప్పుడు వచ్చిన ఫలితాన్ని శిష్యులు చూశారు. అటు తర్వాత యేసు ప్రభువు దేవునిలో తమకున్న విశ్వాసాన్ని ఎలా వ్యక్తపరచాలో శిష్యులకు వివరించారు.

దేవునిలో ఉన్న విశ్వాసంతో కదిలిపొమ్మని కొండను ఆజ్ఞాపించాలని యేసు ప్రభువు మనకు చెప్పారు. మీరు చెప్పే దాని గురించి మీ హృదయంలో ఎలాంటి అనుమానం పెట్టకోకూడదు. మీరు చెప్పింది జరుగుతుందని అలాగే అది మీకు లభిస్తుందని నమ్మండి. మన విశ్వాసం దేవునిలో ఉంది. కానీ అదే సమయంలో, సహజమైన రంగములో మనం ఏదో ఒకటి చేస్తాము. మనం విశ్వాసపు మాటలు ప్రకటిస్తాము. మనకు విశ్వాసమున్న దేవునిబట్టి మనం ప్రకటించింది జరుగుతుందని నమ్ముతాము. మనం దేవుని సహా పనివారమని నమ్ముతాము. మనం విశ్వాసపు మాటలు ప్రకటించినప్పుడు, మనం నమ్ముతున్న దేవుడు ఆ మాటలు నెరవేరేలాగా మన తరపున కార్యం చేస్తారు. దేవునిలోని విశ్వాసాన్ని బట్టి, దేవుడు నెరవేర్చగల సమర్ధుడు గనుక మనం ప్రకటించింది జరుగుతుందని నమ్ముతాము.

దేవునిలో విశ్వాసముంచండి. మీ విశ్వాసాన్ని ప్రకటించండి. మీరు ప్రకటించింది దేవుడు నెరవేర్చేలా చేస్తారు కాబట్టి మీరు చెప్పింది జరుగుతుందని నమ్మండి.

# 41
# విశ్వాసపు మాటలతో ప్రార్థించండి

**మార్కు 11:22-24**
**22 అందుకు యేసు వారితో ఇట్లనెను–మీరు దేవునియందు విశ్వాసముంచుడి.**
**23 ఎవడైనను ఈ కొండను చూచి–నీవు ఎత్తబడి సముద్రములో పడవేయబడుమని చెప్పి, తన మనస్సులో సందేహింపక తాను చెప్పినది జరుగునని నమ్మినయెడల వాడు చెప్పినది జరుగునని మీతో నిశ్చయముగా చెప్పుచున్నాను.**
**24 అందుచేత ప్రార్థన చేయునప్పుడు మీరు అడుగుచున్న వాటినెల్లను పొందియున్నామని నమ్ముడి; అప్పుడు అవి మీకు కలుగునని మీతో చెప్పుచున్నాను.**

దేవునిలో ఉన్న విశ్వాసాన్ని ఎలా వ్యక్తపరచాలో యేసు ప్రభువు మనకు బోధించిన ఇదే వాక్యభాగంలో ప్రార్థన గురించి కూడా ఆయన బోధించారు. “అందుచేత ప్రార్థన చేయునప్పుడు మీరు అడుగుచున్న వాటినెల్లను పొందియున్నామని నమ్ముడి...”. ఇక్కడ “అందుచేత... మీతో చెప్తున్నాను...” అనే మాటకు “ఈ కారణంతో మీతో చెప్తున్నాను...” లేదా “ఇందుకోసమే మీతో చెప్తున్నాను...” అనే అర్థముంది. ప్రార్థన గురించి యేసు ప్రభువు మనకు ఇచ్చిన వాగ్దానం, అలాగే మార్కు 11:24లోని ప్రార్థించే విధానం మార్కు 11:22,2లో ఆయన బోధించిన దానితో సంబంధం కలిగి ఉంది.

మీరు ప్రార్థించినప్పుడు మీరు అడిగేవన్నీ మీరు పొందుకున్నారని నమ్మండి అప్పుడు మీరు వాటిని కలిగి ఉంటారని యేసు ప్రభువు చెప్పారు. మనం ఆయన చిత్త ప్రకారం అడిగినప్పుడు, మనం అడిగింది మనం తండ్రి నుండి పొందుకున్నామని మనకు తెలుసు (1 యోహాను 5:14,15). కాబట్టి, మనం ప్రార్థించినప్పుడు మనం పొందుకున్నామని నమ్ముతాము. అది అంతటితో పూర్తి అయిపోతుంది. అది ఆత్మలో జరిగింది. ఆయన మార్కు 11:23లో మనకు బోధించిన విషయాన్నే

మనమిప్పుడు ఆచరిస్తున్నాము. మనం అవసరతతో, పరిస్థితులతో, సమస్యతో, పర్వతంతో మాట్లాడి ప్రార్థనలో మనం పొందిన దానిని ప్రకటిస్తాము. పర్వతం తొలగిపోయిందని ప్రకటిస్తాము. మనం ప్రార్థించినప్పుడు పొందుకున్నామని నమ్మడం ద్వారా అలాగే పరిస్థితితో మాట్లాడి మనం నమ్మింది జరిగిందని ప్రకటించడం ద్వారా మనకు దేవునిలో ఉన్న విశ్వాసం వ్యక్తమవుతుంది. విశ్వాసపు మాటలతో ప్రార్థించండి. ప్రార్థనలో దేవునికి విశ్వాసపు మాటలు తరువాత మీరు ప్రార్థిస్తున్న పరిస్థితికి విశ్వాసపు మాటలు ఉంటాయి

# 42
# ఆయన మాటను అంగీకరించండి

**లూకా 1:37,38,45**
**37 దేవుడు చెప్పిన యేమాటయైనను నిరర్థకము కానేరదని ఆమెతో చెప్పెను.**
**38 అందుకు మరియ–ఇదిగో ప్రభువు దాసురాలను; నీ మాటచొప్పున నాకు జరుగును గాక అనెను. అంతట దూత ఆమెయొద్ద నుండి వెళ్లెను.**
**45 ప్రభువు ఆమెకు తెలియజేయించిన మాటలు సిద్ధించును గనుక నమ్మిన ఆమె ధన్యురాలనెను.**

**లూకా 1:37**
**దేవుని నుండి వచ్చు ఏ మాట వ్యర్థం కాదు (రివైజ్డ్ వెర్షన్)**

మరియ పరిశుద్ధాత్మ శక్తి ద్వారా గర్భం ధరిస్తుందనే శుభవార్తను తీసుకువచ్చిన దూత, “దేవుడు చెప్పిన ఏ మాట నిరర్థకం కానేరదు” అని ఆమెతో చెప్పి తన వర్తమానాన్ని ముగించింది. “ఏదియు” అనే పదం ‘పాస్’ (అన్ని, ప్రతి), ‘రేమా’ (మాట, పలుకు) ఇంకా ‘ఊ’ (లేదు) అనే మూడు గ్రీకు పదాలు కలయిక. అందుకే, రివైజ్డ్ వెర్షన్లో ఇంకా మెరుగైన అర్థాన్ని ఇచ్చారు - “దేవుని నుండి వచ్చు ఏ మాట వ్యర్థం కాదు” నెరవేరుతుంది. దేవుని నుండి వచ్చు ప్రతి మాట శక్తిగలది, అది నెరవేరుతుంది.

దేవుడు మాట్లాడారు. దూత దీనిని ధృవీకరించింది. మరియ దేవుని నుండి వచ్చిన మాటకు లోబడింది. ఆమె, “నీ మాటచొప్పున నాకు జరుగునుగాక” అని చెప్పింది. ఆమె ఆ మాటను అంగీకరించడమంటే, ఆ సమయం నుండి ఆమె తన గురించి తెలియజేసిన ప్రకారం ప్రతీదీ చేయడం మొదలు పెట్టిందని అర్థము. తరువాత మరియకు తెలియజేసిన మాటను ఆమె నమ్మింది కాబట్టి అది నేరవేరడం ఆమె చూస్తుందని ధృవీకరిస్తూ పరిశుద్ధాత్మ దేవుడు

ఎలిజబెతు ద్వారా మరియను బలపరిచారు.

మనం చదువుతున్న రాయబడిన లేఖనాలలోని దేవుని నుండి వచ్చిన ఏ మాట కూడా నెరవేరకుండా వ్యర్థం కాలేదు. లేఖనాలలో మనకిచ్చిన ప్రతి మాట శక్తిగలది, అది నెరవేరుతుంది. ఆయన వాక్కును నమ్మడమంటే, ఆయన వాక్కుతో అంగీకరించడమే. మనం అంగీకరించి మరియ చెప్పినట్లే, *"నీ మాటచొప్పున నాకు జరుగునుగాక"* (లూకా 1:38) అని చెప్పాలి. ఆయన వాక్యాన్ని అంగీకరించడమంటే, మన ఆలోచన విధానం, మాట్లాడే విధానం ప్రవర్తన దానికి అనుగుణంగా ఉండాలి. మనం వాక్యానికి వ్యతిరేకంగా మాట్లాడుతూ, ఆయన వాక్కుతో అంగీకరిస్తున్నామని చెప్పకూడదు. మనం దేవుడు, అలాగే ఆయన వాక్యాన్ని అంగీకరిస్తే, మన మాటలు కూడా ఆయన వాక్యంతో ఏకీభవించాలి. మనం విశ్వాసాన్ని ప్రకటించినప్పుడు, ఆయన వాక్యంతో ఏకీభవించినప్పుడు ప్రభువు మనతో మాట్లాడిన మాటలు నెరవేరతాయి.

# 43
# వ్యాధులను విడిచిపొమ్మని ఆజ్ఞాపించండి

**లూకా 4:38,39**
**38 ఆయన సమాజమందిరములోనుండి లేచి, సీమోను ఇంటిలోనికి వెళ్లెను. సీమోను అత్త తీవ్రమైన జ్వరముతో పడియుండెను గనుక ఆమె విషయమై ఆయనయొద్ద మనవి చేసికొనిరి.**
**39 ఆయన ఆమె చెంతను నిలువబడి, జ్వరమును గద్దింపగానే అది ఆమెను విడిచెను; వెంటనే ఆమె లేచి వారికి ఉపచారము చేయసాగెను.**

జీవితంలోను అలాగే పరిచర్యలోను మనం యేసు ప్రభువును వెంబడిస్తాము. వారి వ్యాధి అనారోగ్యాలనుండి స్వస్థపరచడానికి యేసు ప్రభువు ప్రజలకు ఎలా పరిచర్య చేశారు? యేసు ప్రభువు వ్యాధి అనారోగ్యాలను తొలగించమని చెప్పుతూ తండ్రికి ప్రార్థన చేయడం మనం చూడము. అవును, యేసు ప్రభువు తండ్రితో సంభాషిస్తూ చాలా సమయం గడిపారు. కానీ వ్యాధి అనారోగ్యాలతో స్వస్థపరచేటప్పుడు యేసు ప్రభువు అధికారంతో వాటిని వదిలిపొమ్మని చెప్పారు. దానికి లూకా 4:38,39 ఒక ఉదాహరణ. యేసు ప్రభువు జ్వరాన్ని గద్దించారు. జ్వరంతో మాట్లాడి విడిచిపొమ్మని ఆజ్ఞాపించారు. తరువాత వెంటనే జ్వరం వదిలిపోయింది.

యేసు ప్రభువు ఎప్పుడు సరియైనదే చేశారు. ఆయనే నిత్యమైన వాక్యము. మన నమ్మకం యేసు ప్రభువులాగా వ్యాధి అనారోగ్యాలతో మాట్లాడడం లేకపోతే, యేసు ప్రభువు చెప్పిదానితో చేసినదానితో అనుగుణంగా మన నమ్మకాన్ని మార్చుకోవలసి ఉంది.

మీరు నేను యేసు ప్రభువు చేసిన కార్యాలను, వాటికన్నా గొప్ప కార్యాలను చేయాలి (యోహాను 14:12). అవును ఖచ్చితంగా, ఆయన చేసిన విధంగానే మనం కూడా చేయాలి. యేసు ప్రభువు

వ్యాధి అనారోగ్యాలతో మాట్లాడి వదిలి పొమ్మని ఆజ్ఞాపించారు. కాబట్టి మీరు నేను అదే రీతిలో మాట్లాడాలి. వ్యాధులను విడిచిపొమ్మని ఆజ్ఞాపించాలి. ఇలా మన శరీరాలకు మనం సేవ చేస్తున్న ఇతరులకు మనం చేయవచ్చు. యేసు వెంబడించండి. ఆయన చేసింది చేయండి. ఆయన మీకిచ్చిన అధికారాన్ని మీ మాటలు వ్యక్తపరుస్తాయి. వ్యాధులను విడిచిపొమ్మని ఆజ్ఞాపించండి. మీ విశ్వాసాన్ని ప్రకటించండి.

# 44
# తుఫానుతో మాట్లాడండి

**లూకా 8:22-25**
**[22] మరియొకనాడు ఆయన తన శిష్యులతోకూడ ఒక దోనెయెక్కి సరస్సు అద్దరికి పోదమని వారితో చెప్పగా, వారు ఆ దోనెను త్రోసి బయలుదేరిరి.**
**[23] వారు వెళ్లుచుండగా ఆయన నిద్రించెను. అంతలో గాలివాన సరస్సుమీదికి వచ్చి దోనె నీళ్లతో నిండినందునవారు అపాయకరమైన స్థితిలో ఉండిరి**
**[24] గనుక ఆయనయొద్దకు వచ్చి–ప్రభువా ప్రభువా, నశించిపోవుచున్నామని చెప్పి ఆయనను లేపిరి. ఆయన లేచి, గాలిని నీటిపొంగును గద్దింపగానే అవి అణగి నిమ్మళమాయెను.**
**[25] అప్పుడాయన –మీ విశ్వాసమెక్కడ అని వారితో అనెను. అయితే వారు భయపడి–ఈయన గాలికిని నీళ్లకును ఆజ్ఞాపింపగా అవి లోబడుచున్నవే; ఈయన యెవరో అని యొకనితో నొకడు చెప్పుకొని ఆశ్చర్యపడిరి.**

యేసు ప్రభువు గాలి తుఫానులతో నిమ్మళంగా ఉండమని ఆజ్ఞాపించినప్పుడు అవి ఆయనకు లోబడ్డాయి. యేసు ప్రభువు తన శిష్యుల వైపు తిరిగి, “మీ విశ్వాసమెక్కడ?” అని ప్రశ్నించారు. అంటే ఆయన ఉద్దేశ్యం ఏమిటంటే వారు తమకున్న విశ్వాసంతోనే వారే ఈ పరిస్థితిని ఎదుర్కోగలరు. ఆయన చేసినట్లుగానే, వారు కూడా తమకున్న విశ్వాసంతో చేయగలరు.

యేసు ప్రభువు మనం తండ్రితో నడిచి జీవించడానికి మనకు మాదిరిగా ఉన్నారు. పరిశుద్ధాత్మ అభిషేకంతో కొనసాగడానికి పరిచర్య చేయడానికి మనకు మాదిరిని చూపించారు. విశ్వాసంతో ఏమి చేయగలమనే దానికి ఆయన మనకు మాదిరిగా ఉన్నారు. ఆయన నిర్జీవమైన వాటితో అంటే అంజూరపు చెట్టు, వ్యాధి, అనారోగ్యం, గాలి అలలతో మాట్లాడి వాటిని ఆజ్ఞాపించారు. విధేయత చూపించమని ఆయన వాటిని ఆజ్ఞాపించగానే అవి లోబడ్డాయి. యేసు ప్రభువు చేసినట్లే మనం కూడా ఆయనను అనుసరిద్దామా? ఖచ్చితంగా

చేయాలి!

మీకు మరలా తుఫాను ఎదురైనప్పుడు – అంటే ఎగసిపడుతున్న అలలు గాలి తుఫానైతేనా లేదా మీ జీవితంలో ఉన్న మరే తుఫానైనా సరే యేసు ప్రభువు చేసినట్లుగానే మీరు కూడా చేయండి. తుఫానుతో మాట్లాడండి. నెమ్మదించమని ఆజ్ఞాపించండి. ఆటంకాలను వెనక్కుపొమ్మని, ఆగిపోమ్మని, నెమ్మదించమని ఆజ్ఞాపించండి. గందరగోళం, చెడు ఉద్దేశ్యాలు, పుకారులు, విభేదాలు, గొడవలు ఇలా సరికాని వాటన్నింటిని ఆగిపోమని ఆజ్ఞాపించండి.

# 45
# ప్రజలు తమ బంధకాల నుండి విడుదల పొందారని ప్రకటించండి

**లూకా 13:10-16**
**10 విశ్రాంతిదినమున ఆయన యొక సమాజమందిరములో బోధించుచున్నప్పుడు**
**11 పదునెనిమిది ఏండ్లనుండి బలహీన పరచు దయ్యము పట్టిన యొక స్త్రీ**
**అచ్చట నుండెను. ఆమె నడుము వంగిపోయి యెంత మాత్రమును చక్కగా**
**నిలువబడలేకుండెను.**
**12 యేసు ఆమెను చూచి, రమ్మని పిలిచి–అమ్మా, నీ బలహీనతనుండి విడుదల**
**పొందియున్నావని ఆమెతో చెప్పి**
**13 ఆమెమీద చేతులుంచ గానే ఆమె చక్కగా నిలువబడి దేవుని మహిమపరచెను.**
**14 యేసు విశ్రాంతిదినమున స్వస్థపరచినందున ఆ సమాజమందిరపు అధికారి**
**కోపముతో మండిపడి, జనసమూహమును చూచి–పనిచేయదగిన ఆరు దినములు**
**కలవు గనుక ఆ దినములలోనే వచ్చి స్వస్థతపొందుడి; విశ్రాంతిదినమందు రావద్దని**
**చెప్పెను.**
**15 అందుకు ప్రభువు–వేషధారులారా, మీలో ప్రతివాడును విశ్రాంతిదినమున తన**
**యెద్దునైనను గాడిదనైనను గాడియొద్దనుండి విప్పి, తోలుకొనిపోయి, నీళ్లు పెట్టును**
**గదా.**
**16 ఇదిగో పదునెనిమిది ఏండ్లనుండి సాతాను బంధించిన అబ్రాహాము కుమార్తెయైన**
**ఈమెను విశ్రాంతిదినమందు ఈ కట్లనుండి విడిపింపదగదా? అని అతనితో చెప్పెను.**

18 సం.లుగా నడుములో సమస్య ఉన్న ఒక స్త్రీ గురించి ఈ వాక్య భాగంలో ఉంది. ఆమె వంగిపోయి నిలబడలేకుండా ఉంది. సాతాను ఆమెను బంధించి తన ఖైదీగా చేసుకున్నాడు. ఇక్కడ అనారోగ్యం కలిగించే ఆత్మ ఆమెను బాధిస్తుంది. యేసు ప్రభువు ఆమెకు ఎలా పరిచర్య చేశారు? ఆయన ఆమెతో మాట్లాడి, ఆమెను తాకారు. ఆయన *"అమ్మా, నీ బలహీనతనుండి విడుదల పొందియున్నావు"* (లూకా 13:12) అని చెప్పారు. అనారోగ్యపు దురాత్మ ద్వారా 18 సం.లుగా సాతాను చేస్తున్న పనిని అధికారం కలిగిన ఒకే ఒక్క మాటతో ఆయన తిప్పివేశారు.

క్రీస్తులో విశ్వాసులమైన మనకు పాములను తేళ్లను త్రొక్కుటకును శత్రువు బలమంతటిమీదను అధికారం ఇవ్వబడింది (లూకా 10:19). మీ వంటి నావంటి విశ్వాసులతో రూపొందిన సంఘమనే ఆయన శరీరం ద్వారా యేసు అధికారం వ్యక్తమవుతుంది. మనం మాట్లాడే మాటలతో ఈ అధికారాన్ని ఉపయోగిస్తాము. ప్రజలు తమ బంధకాలనుండి విడుదల పొందారని అధికారం కలిగి మనం ప్రకటిస్తాము. వ్యసనాల బారిన పడినవారికి యేసు నామంలో మీ వ్యసనాల నుండి విడుదల పొందండని ప్రకటిస్తాము. భయంతో బంధించబడిన వారికి యేసు నామంలో పేధించే ఈ భయం నుండి విడుదల పొందండని ప్రకటిస్తాము. అదే విధంగా, ఇతర బంధకాలలో ఉన్న ప్రజలను విడుదల చేస్తాము. అధికారం కలిగిన మాటలు మాట్లాడండి. ప్రజలు తమ బంధకాల నుండి విడుదల పొందారని ప్రకటించండి.

# 46
# అభిషేకించబడిన మాటలు ఆత్మయొక్క జీవాన్ని కలిగి ఉంటాయి

**యోహాను 6:63**
**ఆత్మయే జీవింపచేయుచున్నది; శరీరము కేవలము నిష్ప్రయోజనము. నేను మీతో చెప్పియున్న మాటలు ఆత్మయు జీవమునైయున్నవి గాని ...**

**యోహాను 6:63 (ఇండియన్ రివైజ్డ్ వెర్షన్)**
**జీవాన్ని ఇచ్చేది ఆత్మ; శరీరం వల్ల ప్రయోజనం లేదు. నేను మీతో చెప్పిన మాటలే ఆత్మ. అవే జీవము.**

అప్పుడే యేసు ప్రభువు తన శిష్యులతో ఆయనలో నిలిచి ఉండడం గురించి, తన శరీరాన్ని తిని తన రక్తాన్ని త్రాగడం గురించి చెప్పడం ముగించారు. అటుతర్వాత, ఆయన భౌతికమైన వాటి గురించి మాట్లాడడం లేదని చెప్తూ ఆత్మనే జీవాన్ని ఇస్తుందని (దేవుని జీవమని) స్పష్టం చేశారు. శరీరం (భౌతిక రంగము) దానిని చేయలేదు. తర్వాత, ఆయన తన మాటలను సూచించారు. ఆయన మాట్లాడే మాటలు ఆత్మకు, ఆధ్యాత్మికతకు సంబంధించిన మాటలు, ఆయన మాటలు దేవుని ఆత్మ యొక్క జీవాన్ని వారికి అందిస్తాయి. ఆత్మ ద్వారా యేసు ప్రభువు అభిషేకించబడ్డారు. ఆయన మాట్లాడగా, ఆయన మాటలు ఆత్మ యొక్క జీవాన్ని వినేవారికి ఇస్తాయి.

మనం పరిశుద్ధాత్మ ద్వారా అభిషేకించబడ్డాము (2 కొరింథీయులకు 1:21). మన ద్వారా ఆయన అభిషేకం మన ద్వారా కార్యం చేస్తూ, దేవుని ఆత్మ యొక్క జీవాన్ని అందించేలా ఆయన మన మాట్లాడే మాటలను ఉపయోగిస్తారు. కాబట్టి మనం అభిషేకం కలిగి లేదా ఆత్మ ద్వారా ప్రేరేపించబడి మాట్లాడినప్పుడు ఆ మాటలు అసాధారణమైన కార్యాలను జరిగిస్తాయి. అవి

దేవుని జీవాన్ని ప్రజలకు విడుదల చేస్తాయి. అవి దేవుని శక్తిని పరిస్థితులలోకి విడుదల చేస్తాయి. ఆ మాటలు దేవుడు మన ప్రపంచాలలోకి విడుదల చేయాలనుకున్న వాటిని మోసుకొని వచ్చే సాధనాలుగా ఉన్నాయి. అభిషేకించబడిన మాటలు ఆత్మ యొక్క జీవాన్ని అందిస్తాయని తెలుసుకుంటూ, ఆత్మ మిమ్మల్ని ప్రేరేపించే కొలది ధైర్యంగా మాట్లాడండి.

# 47
# విశ్వాసంతో ఆజ్ఞాపించండి

**యోహాను 11:40-43**
**[40] అందుకు యేసు–నీవు నమ్మినయెడల దేవుని మహిమ చూతువని నేను నీతో**
**చెప్పలేదా అని ఆమెతో అనెను;**
**[41] అంతట వారు ఆ రాయి తీసివేసిరి. యేసు కన్నులు పైకెత్తి–తండ్రీ, నీవు నా మనవి**
**వినినందున నీకు కృతజ్ఞతాస్తుతులు చెల్లించుచున్నాను.**
**[42] నీవు ఎల్లప్పుడును నా మనవి వినుచున్నావని నేనెరుగుదును గాని నీవు**
**నన్ను పంపితివని చుట్టు నిలిచియున్న యీ జనసమూహము నమ్మునట్లు వారి**
**నిమిత్తమై యీ మాట చెప్పితిననెను.**
**[43] ఆయన ఆలాగు చెప్పి–లాజరూ, బయటికి రమ్మని బిగ్గరగా చెప్పగా...**

నాలుగు రోజుల క్రితమే చనిపోయిన లాజరు సమాధి ముందు నిలబడిన యేసు ప్రభువు నీవు నమ్మితే దేవుని మహిమను చూస్తావనే నిశ్చయత మార్తకు ఇచ్చారు. అలాగే ప్రార్థన వినినందుకు నీకు కృతజ్ఞతలు అని ఆయన తండ్రితో చెప్పారు. అటుతర్వాత, యేసు ప్రభువు, “లాజరు బయటకు రా” అని బిగ్గరగా ఆజ్ఞాపించారు.

యేసు ప్రభువు తండ్రికి ప్రార్థించారు. తన మనవి అనుగ్రహించబడిందని ఆయనకు తెలుసు. అయినా కానీ ఈ భౌతిక రంగములో తనకు కావాల్సిన ఫలితం జరిగేలా ఆయన ఆజ్ఞాపిస్తూ మాట్లాడారు. మనం దేవుని మహిమను అంటే దేవుడు మన ముందు కనపరిచే ఆయన గొప్ప కార్యాలను చూస్తామని నమ్ముతాము. యేసు ప్రభువులాగా విశ్వాసంతో ప్రార్థిస్తాము. తరువాత మనం కూడా యేసు ప్రభువులాగా విశ్వాసంతో ఆజ్ఞాపిస్తున్న మాటలను మాట్లాడాలి.

మీరు దేవున్ని ఏ విషయాలలో నమ్ముతున్నారు? దేవుడు చేస్తారని మనం అనుకున్న విషయాలు కొన్నిసార్లు లాజరువలే చనిపోయి ఒక సమాధిలో ఉన్నట్లు ఉండిపోవచ్చు. కాలం

గడిచిపోయింది. కాస్త ఆలస్యమవ్వచ్చు. కానీ దేవుని వాగ్దానం స్పష్టంగా ఉంది. మనం నమ్మితే మనం దేవుని మహిమను చూస్తాము. దేవుని గొప్ప కార్యాలను చూస్తాము. మనం విశ్వసిస్తూ ప్రార్థనలను చేయాలి. మనం విశ్వాసంతో ఆజ్ఞాపించాలి. మీ విశ్వాసాన్ని ధైర్యంగా ప్రకటించండి. మీ “లాజరును” బయటకు రమ్మని ఆజ్ఞాపించండి!

# 48
# వాక్యం మిమ్మల్ని మీ స్వాస్థ్యములోనికి తీసుకువస్తుంది

**అపొస్తలుల కార్యములు 20:32**
**ఇప్పుడుదేవునికిని ఆయన కృపావాక్యమునకును మిమ్మును అప్పగించుచున్నాను. ఆయన మీకు క్షేమాభివృద్ధి కలుగజేయుటకును, పరిశుద్ధపరచబడిన వారందరిలో స్వాస్థ్య మనుగ్రహించుటకును శక్తిమంతుడు.**

దేవుని వాక్యం మనల్ని యేసు క్రీస్తులో పరిశుద్ధపరచబడిన వారందరికి ఇవ్వబడే స్వాస్థ్యమును పొందేలా చేస్తుందని అపొస్తలుడైన పౌలు స్పష్టం చేశాడు. మన స్వాస్థ్యమును పొందాలనే ఆశ మనందరికి ఖచ్చితంగా ఉంటుంది. మనకి అంటే ఆయన కుమారులు కుమార్తెలుగా మన జీవితంలోని ప్రతి అంశంలో దేవుడు ఇచ్చినదంతా ఆస్వాదించాలని మనం కోరుకుంటాము. కానీ దేవుని వాక్యాన్ని ఉపయోగించుకొని మనం అంతరంగంలో బలపడాలి. అప్పుడే మనం దేవుడు మనకు అవకాశమిచ్చిన సదుపాయాలను, ఆధిక్యతలను పొందగలము.

మనం వాక్యంతో నిమగ్నమవ్వడానికి అనేక మార్గాలు ఉన్నాయి. మనం ఆయన వాక్యాన్ని చదవాలి, ఆయన వాక్యంలోని ప్రత్యక్షతను పొందుకోవాలి, ఆయన వాక్యాన్ని ధ్యానించాలి, ఆయన వాక్యాన్ని మనలో నివసించనివ్వాలి తరువాత ఆయన వాక్యానికి లోబడాలి. రోమా 10:17లో చెప్పినట్లు ఆయన వాక్యం మన హృదయాలలో విశ్వాసాన్ని కలిగిస్తుంది. ఈ పుస్తకం అంతటా మనం చూస్తున్నట్లుగా, దేవుని వాక్యంపై మనకున్న విశ్వాసాన్ని మనం ప్రకటించాలి. మనం ఇలా చేస్తున్నపుడు దేవుని వాక్యంతో పనిచేస్తున్న వారమవుతాము. మనం మన స్వాస్థ్యమును పొందడానికి ఒక నియమం దేవుని

వాక్యాన్ని మన జీవితాల మీద ప్రకటించడమే. ఇది మనం నామకార్థంగా కాని వ్యర్థమైన ఆచారంగా కాని చేయకూడదు. మనకు దేవునిలోను, ఆయన వాక్యంలోను ఉన్న విశ్వాసంతో మనం వాక్యాన్ని ప్రకటించాలి. మనం ఇలా చేసినప్పుడు, మనం ఆయన వాక్యంతో కట్టబడి మన స్వాస్థ్యమును పొందుకుంటాము. దేవునిలోను, ఆయన వాక్యంలోను మీకున్న విశ్వాసాన్ని ప్రకటించండి.

# 49

# నాకు చెప్పిన ప్రకారమే జరుగుతుందని నేను నమ్ముతున్నాను

**అపొస్తలుల కార్యములు 27:23-25**
**23 నేను ఎవనివాడనో, యెవనిని సేవించుచున్నానో, ఆ దేవుని దూత గడచిన రాత్రి నాయొద్ద నిలిచి–పౌలా, భయపడకుము;**
**24 నీవు కైసరు ఎదుట నిలువవలసియున్నది; ఇదిగో నీతోకూడ ఓడలో ప్రయాణమై పోవుచున్న వారందరిని దేవుడు నీకు అనుగ్రహించియున్నాడని నాతో చెప్పెను.**
**25 కాబట్టి అయ్యలారా, ధైర్యము తెచ్చుకొనుడి; నాతో దూత చెప్పిన ప్రకారము జరుగునని నేను దేవుని నమ్ముచున్నాను.**

ఒక దూత దేవుని దగ్గర నుండి పౌలుకు వర్తమానం తెచ్చింది. దాని తరువాత పౌలు దూత తనతో చెప్పినట్లే జరుగుతుందని చెప్తూ దేవునిలో తనకున్న విశ్వాసాన్ని ధైర్యంగా తెలియజేసాడు.

దూతల మాట కంటే ఎంతో ఖచ్చితమైన దేవుని వాక్యం అనగా పరిశుద్ధ లేఖనం మనకు లిఖితపూర్వకంగా ఉంది. రాయబడి ఉన్న తన వాక్యం నుండి దేవుడు మనతో మాట్లాడినవి, క్రీస్తులో మన కొరకు ఆయన అప్పటికే ముగించినవి, ఈ జీవితంలో మనకు చేస్తానని చేసిన వాగ్దానాలను బట్టి ఆయన మాట్లాడిన వాటిపై మనకున్న విశ్వాసాన్ని ప్రకటించాలి. మీరు దేవుడు తన పరిశుద్ధ వాక్యంలో ప్రకటించిన ప్రకారమే ఖచ్చితంగా జరుగుతుందని ధైర్యంగా ప్రకటించండి. మీ వర్తమానంలో మీ భవిష్యత్తులో ఉన్న ప్రతిదీ దేవుడు ప్రకటించిన దానితో అనుగుణంగా ఉంటుంది.

కొన్నిసార్లు ఆత్మయొక్క అంతరంగ సాక్ష్యంతో గాని, ప్రవచనంతో, కలలు దర్శనాలతో లేదా మరొక విధంగా గాని తన పరిశుద్ధాత్మ ద్వారా దేవుడు మనతో మాట్లాడతారు. మనం పరీక్షించి, నిజంగానే

పరిశుద్ధాత్మ దేవుడు స్పష్టమైన మాటను మనకు తెలియజేసారని నిశ్చయించుకున్న తర్వాత, మనకు చెప్పిన ప్రకారమే జరుగుతుందని ధైర్యంగా ప్రకటించాలి.

"నేను దేవునిని నమ్ముతాను" అని ధైర్యంగా ప్రకటించండి.

దేవుడు నా గురించి తన వాక్యంలో చెప్పిన ప్రకారమే జరుగుతుందని నేను నమ్ముతున్నాను.

# 50
# లేనివి ఉన్నట్లుగానే ప్రకటించండి

**రోమా 4:17**
**తాను విశ్వసించిన దేవుని యెదుట, అనగా మృతులను సజీవులనుగా చేయువాడును, లేనివాటిని ఉన్నట్టుగానే పిలుచువాడునైన దేవుని యెదుట, అతడు మనకందరికి తండ్రియైయున్నాడు– ఇందునుగూర్చి**

అపొస్తలుడైన పౌలు పరిశుద్ధాత్మ సహాయంతో అబ్రాహాము యొక్క విశ్వాస ప్రయాణానికి సంబంధించిన నిగూఢ సత్యాలను తెలియజేసాడు. అబ్రాహాము దేవుడిని నమ్మాడు. దేవుని ప్రణాళికను భూమ్మీద అమలు చేయడానికి అబ్రాహాము తన విశ్వాసం వలన దేవునితో భాగస్వామి అయ్యాడు. ఏ దేవుడినైతే అబ్రాహాము నమ్మి, ఆయనతోపాటు భాగస్వామి అయ్యాడో ఆ దేవుడు చనిపోయినవారికి జీవమిచ్చి, లేనివి ఉన్నట్లుగా పిలిచే దేవుడు. ఏదైతే చనిపోయినట్లుగా ఉందో అంటే వయసు మళ్ళిన వారి శరీరాలు, శారా కనని గర్భం, అవి జీవించేలా చేయబడతాయని అబ్రాహాము నమ్మాలి. తరువాత, లేనివాటిని ఉన్నట్లుగా పిలవడం అబ్రాహాము నేర్చుకోవాలి. అలా దేవుడు మొదట చేశారు. అబ్రాహాముకు ఇంకా పిల్లలు లేనప్పుడే దేవుడు అబ్రాహాము గొప్ప జనానికి తండ్రి అవుతాడని అబ్రాహాము గురించి ప్రకటించారు. అటు తర్వాత వారు లేనివాటిని ఉన్నవని పిలిచేటట్లుగా చేయడానికి దేవుడు అబ్రాము సారాయి పేర్లను అబ్రాహాము శారా అని మార్చారు.

విశ్వాసమనేది మనం నిరీక్షిస్తున్న లేదా ఆశిస్తున్న వాటిపై ఉన్న యాజమాన్య హక్కుకు రుజువు. విశ్వాసమంటే ఒక నిశ్చయత, ఇంకా చూడని వాటిపై అనగా ఇంకా భౌతికంగా బయలుపడని వాటి గురించి దృఢమైన నమ్మకము. ఇలాంటి విశ్వాసం మాట్లాడినప్పుడు, భౌతికంగా లేనివాటిని ఆత్మపరంగా ఉన్నట్లుగానే ప్రకటిస్తుంది.

ఇలాంటి విశ్వాసం, లేని వాటిని ఉన్నట్లుగా ప్రకటిస్తుంది. విశ్వాసం దేవుడు ఒకసారి చెప్తే, అప్పటికే జరిగిపోయిందనే నిశ్చయతను ఇస్తుంది. మీ విశ్వాసాన్ని ప్రకటించండి. దేవుడు చెప్పారు కాబట్టి భౌతికంగా లేనివాటిని కూడా ఉన్నట్లుగానే ప్రకటించండి.

# 51
# ఆయన వాగ్దానం ప్రకారం ప్రకటించండి

**రోమా 4:18-21**
**[18] నిన్ను అనేక జనములకు తండ్రినిగా నియమించితిని అని వ్రాయబడియున్నది.**
**–నీ సంతానము ఈలాగు ఉండునని చెప్పినదానినిబట్టి తాననేక జనములకు తండ్రి**
**యగునట్లు, నిరీక్షణకు ఆధారము లేనప్పుడు అతడు నిరీక్షణ కలిగి నమ్మెను.**
**[19] మరియు అతడు విశ్వాసమునందు బలహీనుడు కాక, రమారమి నూరేండ్ల**
**వయస్సుగలవాడైయుండి, అప్పటికి తన శరీరము మృతతుల్యమైనట్టును, శారా**
**గర్భమును మృతతుల్యమైనట్టును ఆలోచించెను గాని,**
**[20] అవిశ్వాసమువలన దేవుని వాగ్దానమునుగూర్చి సందేహింపక**
**[21] దేవుని మహిమపరచి, ఆయన వాగ్దానము చేసినదానిని నెరవేర్చుటకు**
**సమర్థుడని రూఢిగా విశ్వసించి విశ్వాసమువలన బలమునొందెను.**

దేవుడు ఇచ్చిన వాగ్దానాన్ని పొందడం కోసం అబ్రహాము దేవుని యందు విశ్వాసంతో ఎలా నడిచాడో పరిశుద్ధాత్మ దేవుడు అపొస్తలుడైన పౌలు ద్వారా మనకు బయలుపరిచారు. నిరీక్షణకు ఆధారం లేన్నప్పుడు కూడా అబ్రాహాము నిరీక్షణ కలిగి, ఆ నిరీక్షణతో ప్రేరణ పొంది నమ్మాడు. అతడు ఏమి నమ్మాడు? దేవుడు తన గురించి చెప్పిన ప్రకారం తన జీవితంలో జరుగుతుందని అతడు నమ్మాడు. కొన్ని వాస్తవాలు తన ముందు ఉన్నప్పటికీ అంటే తన శరీరం గురించి, తరువాత శారా శరీరపరిస్థితుల గురించి తెలిసినప్పటికీని వాటి ప్రభావం తన విశ్వాసంపై పడనివ్వలేదు. దేవుని నుండి అతనికి వాగ్దానముంది. దేవుడు అతని పరిస్థితి గురించి మాట్లాడారు, దేవుని నుండి వచ్చిన వాక్యానికి తన జీవితంపై పూర్తి అధికారముంది. అబ్రాహాముకున్న విశ్వాసం దేవుడు చేసిన వాగ్దానం మీద, దేవుడు ఆ వాగ్దానాన్ని నెరవేర్చగల సమర్థుడనే దానిపై స్థిరంగా ఉంది. అతడు జీవితంలో నమ్మిన ప్రతీదీ, అతడు మాట్లాడిన ప్రతి మాట చేసిన ప్రతి పని దేవుడు మాట్లాడిన దానికి అనుగుణంగా ఉంది. దేవుడు చెప్పిన దాని ప్రకారం విశ్వాసం మాట్లాడుతుంది.

తరచూ మన జీవితాల్లో మన ప్రస్తుత స్థితిగతులు లేఖనాలలో రాసిపెట్టిన లేదా చేసిన వాగ్దానానికి వ్యతిరేకంగా ఉండవచ్చు. దేవుని వాక్యం చేసిన వాగ్దానానికి మన జీవిత అనుభవాలు పూర్తిగా వ్యతిరేకంగా ఉండి ఉండవచ్చు. దేవుడు యెహోవా రాఫా అని దేవుని వాక్యం ప్రకటిస్తుంది, అయితే శరీరం అనారోగ్యంతో క్షీణిస్తూ ఉండవచ్చు. మీరు చేసే ప్రతిపనిలో వర్ధిల్లుతారని దేవుని వాక్యం ప్రకటిస్తుంది. కానీ ఇటీవల అనుభవాలు వరుస ఓటమిని చూపించవచ్చు. విజయం సాధిస్తారని దేవుని వాక్యం వాగ్దానమిస్తుంది కానీ అనేక విషయాలలో అపజయాలు ఎదురై ఉండవచ్చు. అలాంటప్పుడు మనం ఏమి చేయాలి? ఇదే దేవుని చిత్తమని మన అనుభవాలను అంగీకరించాలా లేదా దేవుని వాక్యమే మన జీవితాలకి దేవుని చిత్తమని అంగీకరించాలా?

అబ్రాహాము విశ్వాసపు అడుగులలో నడవడానికి మనల్ని పిలిచారు. నిరీక్షణకు ఏ ఆధారం లేనప్పటికి మనం నిరీక్షణ ఉంచి దేవున్ని, ఆయన వాక్యాన్ని నమ్మాలి. వాస్తవాల వలన మీ విశ్వాసాన్ని కృంగిపోనివ్వకండి. మీ విశ్వాసాన్ని ప్రకటించండి.

# 52
# జీవం కలిగి పాలించండి — ఆధిపత్యం కలిగిన మాటలను ప్రకటించండి

**రోమా 5:17**
**మరణము ఒకని అపరాధమూలమున వచ్చినదై ఆ యొకని ద్వారానే యేలినయెడల కృపాబాహుళ్యమును నీతిదానమును పొందువారు జీవముగలవారై, మరి నిశ్చయముగా యేసుక్రీస్తను ఒకని ద్వారానే యేలుదురు.**

ఆదాము ఉంచిన ప్రతి కాడి నించి యేసు ప్రభువు మనల్ని బయటకు తీసుకువచ్చారు. మనం విస్తారమైన కృపను నీతియనే బహుమానంను పొందుకున్నాము. దేవుడు తన కృపను మన జీవితాల మీద కుమ్మరించారు. క్రీస్తులోని మనకున్న విశ్వాసం ద్వారా ఆయన తన నీతిని బహుమానంగా అనుగ్రహించారు. మనం గతంలో పాపులుగా ఉన్నాము. కానీ ఇప్పుడు పరిస్థితులు వేరుగా ఉన్నాయి. మనం దేవుని నీతిగా ఉన్నాము. విస్తారమైన దేవుని కృపను మనం పొందుకున్నాము. దేవుడు మనకిచ్చిన కృపను పొందడానికి మనకు ఏ అర్హత లేదు, దానిని మనం సొంతంగా సంపాదించుకోలేము. దేవుడు కృప ద్వారా మనకు ఇచ్చింది నిజంగా మనదే. అది మన దగ్గర ఉంది. ఆస్వాదించడానికి, జీవించడానికి మన సొంతం చేసుకోడానికే దేవుడు దానిని ఇచ్చారు.

దేవుడు కృపద్వారా మనకు ఉచితంగా ఇచ్చిన అనేక విషయాలలో ఒక విషయమేమిటంటే, యేసు క్రీస్తు ద్వారా జీవితంలో రాజుల వలె జీవిస్తూ పాలించడానికి ఆయన మనల్ని ఉంచారు. యేసు ప్రభువు ద్వారా, అంటే ఆయనను బట్టే, ఆయన అనుగ్రహించే అధికారంతో మనం జీవితంలో పాలించి ఆధిపత్యం చేయాలి. ఈ సత్యాన్ని అర్థం చేసుకోండి. మీకు ఆత్మీయ అధికారం, ఆధిపత్యం ఉంది. మీరు వాటిని

ఉపయోగించకపోతే దాని వలన ఏ ప్రయోజనమూ లేదు. రాజులు ఏమి చేస్తారు? రాజులు తమకున్న అధికారాన్ని, ఆధిపత్యాన్ని తమ మాటల ద్వారా వ్యక్తపరుస్తారు. వారు మాట్లాడతారు, శాసనాలను చేస్తారు. అప్పుడు వారి శాసనాలు వారి రాజ్యంలో స్థిరపడతాయి.

ఆదాము మనల్ని పాపం, సాతాను, వాని దురాత్మల అధికారం క్రింద అలాగే మానవుడు పడిపోయిన తర్వాత వచ్చిన ప్రతి విషయం అంటే అనారోగ్యం, పేదరికం, దురాత్మల ప్రభావం మొదలైనవాటి అధికారం క్రింద ఉంచాడు. ఆదాము మన మీద పెట్టిన ప్రతి దాని అధికారం నుండి యేసు ప్రభువు మనల్ని బయటకు తీసుకునివచ్చి జీవం కలిగి వాటన్నిటి మీద ఆధిపత్యం చేసి పాలించే స్థానంలో ఆయన మనల్ని నిలబెట్టారు. అయితే మనం మన ఆధిపత్యాన్ని ఉపయోగించకపోతే మనమేది అనుభవించలేము. ఆజ్ఞలను ప్రకటించండి. వాక్యాన్ని ప్రకటించండి. మీ విశ్వాసాన్ని ప్రకటించండి తరువాత మీరు ప్రభావితం చేయగలిగే పరిధిలోనున్న ప్రతిదాన్ని దేవుని రాజ్యపు సత్యంతో పాలించండి.

# 53
# విశ్వాసం ఇలా చెప్తుంది

**రోమా 10:6-8**
**6-7 అయితే విశ్వాసమూలమగు నీతి యీలాగు చెప్పుచున్నది–ఎవడు పరలోకములోనికి ఎక్కిపోవును? అనగా క్రీస్తును క్రిందికి తెచ్చుటకు; లేక –ఎవడు అగాధములోనికి దిగిపోవును? అనగా క్రీస్తును మృతులలోనుండి పైకి తెచ్చుటకు అని నీవు నీ హృదయములో అనుకొనవద్దు.**
**8 అదేమని చెప్పుచున్నది? – వాక్యము నీయొద్దను, నీ నోటను నీ హృదయములోను ఉన్నది; అది మేము ప్రకటించు విశ్వాసవాక్యమే.**

అపొస్తలుడైన పౌలు రోమా 4వ అధ్యాయంలో అబ్రాహాము దేవునిలో విశ్వాసముంచాడు కాబట్టి దేవుడు అది అతనికి నీతిగా ఎంచెను అని రాసాడు. క్రీస్తులో మనకు అత్యధిక కృప దేవుని నీతియనే బహుమానం ఇవ్వబడిందనే విషయాన్ని అతడు స్థిరంగా తెలిపాడు. ఇప్పుడు మనం దేవునితో సరియైన స్థానంలో నిలబడి ఉన్నామని గ్రహించాక, దేవునిలో మనకున్న విశ్వాసం ఎలా వ్యక్తమవుతుంది? మనం ఎలా మాట్లాడతాము? విశ్వాసం, నీతి గలవారమైన మనం ఎలా మాట్లాడతాము?

మనం నిరాశ, నిస్పృహలను ప్రకటించము. దేవుడు ఎంతో దూరంగా పరలోకంలో ఉండి మనకు సహాయం చేయలేరు అన్నట్లు మనం మాట్లాడము. దేవుడు జీవం లేనివాడని, మనకు సహాయం చేయడానికి శక్తిలేని వాడని మనం మాట్లాడము. దానికి బదులు, అపొస్తలుడైన పౌలు నూతన నిబంధన విశ్వాలుమైన మనకు పాత నిబంధన సత్యాన్ని అన్వయిస్తున్నాడు. ద్వితీయోపదేశకాండము 30:11-14లో మోషే దేవుని ప్రజలకు చెప్పిన విషయాన్నే అతడు మనకు కూడా చెప్తున్నాడు. వాక్యం మీ చెంతనే ఉంది దేవుడు మాట్లాడిన వాక్యం మీ నోటిలోనే, మీ హృదయంలోనే ఉంది. ఇక్కడ

అర్థమయ్యే విషయమేమిటంటే మీ హృదయంలోనున్న వాక్యం మీరు నమ్మడానికే ఉంది, మీ నోటిలో ఉన్న వాక్యం మీరు ప్రకటించడానికే ఉంది. మనం ప్రకటించే యేసు ప్రభువు సువార్త వర్తమానమైన విశ్వాసపు వాక్కుకు అతడు దానిని అన్వయించాడు.

విశ్వాసం ప్రకటిస్తుందనేది మనమిక్కడ గమనించవలసిన ముఖ్యమైన సత్యము. విశ్వాసం దేవుని వాక్యాన్ని ప్రకటిస్తుంది. అది మన హృదయాలలో నోటిలో నిత్యం ఉంచుకోవాలి. నిరాశగా ఎన్నడూ మాట్లాడకండి. నిస్పృహను ఎన్నడూ ప్రకటించకండి. దేవుని వాక్యం మీ హృదయంలో మీరు నమ్మడానికే ఉంది. మీ నోటిలోనే మీరు ప్రకటించడానికే ఉంది.

# 54
# ఒప్పుకోవడం రక్షణ పొందడానికే

**రోమా 10:6-10**
**[6-7] అయితే విశ్వాసమూలమగు నీతి యీలాగు చెప్పుచున్నది–ఎవడు
పరలోకములోనికి ఎక్కిపోవును? అనగా క్రీస్తును క్రిందికి తెచ్చుటకు; లేక –ఎవడు
అగాధములోనికి దిగిపోవును? అనగా క్రీస్తును మృతులలోనుండి పైకి తెచ్చుటకు
అని నీవు నీ హృదయములో అనుకొనవద్దు.**
**[8] అదేమని చెప్పుచున్నది? – వాక్యము నీయొద్దను, నీ నోటను నీ హృదయములోను
ఉన్నది; అది మేము ప్రకటించు విశ్వాసవాక్యమే.**
**[9] అదేమనగా–యేసు ప్రభువని నీ నోటితో ఒప్పుకొని, దేవుడు మృతులలోనుండి
ఆయనను లేపెనని నీ హృదయమందు విశ్వసించినయెడల, నీవు రక్షింపబడుదువు.**
**[10] ఏలయనగా నీతి కలుగునట్లు మనుష్యుడు హృదయములో విశ్వసించును, రక్షణ
కలుగునట్లు నోటితో ఒప్పుకొనును.**

ఈ వాక్యభాగం నుండి మనం గ్రహించాల్సిన మరొక సత్యమేమిటంటే, విశ్వసించానికి అలాగే నోటితో ఒప్పుకోవడానికి ఉన్న ప్రాముఖ్యత. మన హృదయాలలో దేవుని వాక్యాన్ని నమ్మితే దేవునితో సరియైన సంబంధం కలిగి ఉంటాము ("ఒకరు హృదయంతో నీతిని నమ్ముతారు"). మనం దేవునినుండి పొందుకోవడానికి సరియైన స్థలంలో స్థానంలో ఉన్నాము. తరువాత, ఇంకొక అడుగువేయమని లేఖనాలు మనల్ని సూచిస్తున్నాయి. అదే మన నోటితో ఒప్పుకోడం, దాని ఫలితంగా మనం రక్షణ అనుభవాన్ని పొందుతాము. ("నోటితో ఒప్పుకోవడం రక్షణ పొందడానికే").

యేసు క్రీస్తు ప్రభువు తాను పొంది సిలువ మరణం ద్వారా, మరణము నుండి పునరురత్థానం చెందడం ద్వారా మనల్ని నీతిమంతులుగా చేసి రక్షణ అనే బహుమానాన్ని మనకు అనుగ్రహించారు. ఇది అందరికి అందుబాటులో ఉంది. రక్షణ అనుగ్రహించబడింది, కానీ దానిని పొందుకోవాలంటే మనం

నమ్మి మన నోటితో ఒప్పుకోవాలి. నోటితో ఒప్పుకోవడానికున్న ప్రాముఖ్యతను గమనించండి. మనం నమ్మినప్పుడు, పొందుకొనే స్థానంలో ఉంటాము. కానీ దానిని మన నోటితో ఒప్పుకున్నప్పుడు అది రక్షణను స్వాస్థ్యముగా ఇస్తుంది.

నూతన నిబంధనలో మనం అర్ధం చేసుకున్నట్లు రక్షణ అంటే, - నిత్యమైన రక్షణ, పాపాల క్షమాపణ, పాపం మీద విజయం, వ్యాధులనుండి స్వస్థత, పోరాటంలో జయం, శత్రువు యొక్క ప్రతి కార్యంనుండి విడుదల, హాని నుండి కాపుదల, అపాయం నుండి సంరక్షణ, సంపూర్ణ క్షేమం అనే అర్థాలున్నాయి. దాని అర్ధం రక్షింపబడడం, స్వస్థత పొందడం, విడుదల పొందడం, విమోచించబడడం, భద్రపర్చబడడం, సంపూర్ణంగా చేయబడడము. దేవుని వాక్యాన్ని నమ్మి దానిని ఒప్పుకోవడం ద్వారా ఈ పైనున్న ప్రతి అనుభవాలను మనం పొందుకుంటాము. మీ విశ్వాసాన్ని ప్రకటించండి ఎందుకంటే నోటితో ఒప్పుకోవడం వలన రక్షణ కలుగుతుంది.

# 55

# ఆయన ఇచ్చిన అన్ని వాగ్దానాలకు మీరు "అవును, ఆమెన్" అని ప్రకటించండి

**2 కొరింథీయులకు 1:19,20**
**[19] మాచేత, అనగా నా చేతను సిల్వాను చేతను తిమోతిచేతను, మీలో ప్రకటింపబడిన దేవుని కుమారుడగు యేసుక్రీస్తు అవునని చెప్పి కాదనువాడై యుండలేదు గాని ఆయన అవుననువాడై యున్నాడు.**
**[20] దేవుని వాగ్దానములు ఎన్నియైనను అన్నియు క్రీస్తునందు అవునన్నట్టుగానే యున్నవి గనుక మనద్వారా దేవునికి మహిమ కలుగుటకై అవి ఆయనవలన నిశ్చయములైయున్నవి.**

దేవుడు కొన్నిసార్లు సహాయం చేస్తారని, మరికొన్నిసార్లు సహాయం చేయరని ప్రజలు చెప్పడం మనం వింటాము. అది మనకు ఖచ్చితంగా తెలియదు. దేవుని వాగ్దానాలు కొన్నిసార్లు నెరవేరతాయని, మరికొన్ని సార్లు నెరవేరవని ప్రజలు చెప్తారు. దేవునిపై విశ్వాసముంచినప్పటికి విఫలమైన లేదా చనిపోయి లేదా విపత్తును అనుభవించిన వారందరిని చూడండి. అయితే ఇవన్నీ వాస్తవాలు నిజాలైనప్పటికీ కొద్దిమంది అనుభవాలను ఆధారం చేసుకుని దేవుడు ఏమైయున్నారో లేదా వాక్యం ఏమి చెప్తుందో అనే దానిని మార్చే హక్కు మనకుందంటారా? దేవునికన్నా, ఆయన వాక్యం కన్న మన అనుభవాలనే నమ్మవచ్చా? మన నమ్మకం ప్రజల అనుభవాలను ఆధారం చేసుకుని ఉందా లేక దేవున్ని ఆయన వాక్యాన్ని ఆధారం చేసుకుని ఉందా?

ఇతరులు అంటున్నట్లు దేవుడు చంచలమైనవారు కాదని అపొస్తలుడైన పౌలు స్పష్టం చేశాడు. యేసు ప్రభువులో "అవును" అని గాని "లేదు" అని ఉండదు కానీ ఎప్పుడు ఖచ్చితమైన "అవును" అని మాత్రమే ఉంది. దేవునిలో ఏ మోసం లేదు, రెండు

రకాల మాటలుండవు, అస్థిరమైనదేది ఉండదు, ఆయన మార్పు లేనివాడు (యాకోబు 1:17 మెసేజ్ బైబిలు ప్యాషన్ అనువాదం ప్రకారం రాసింది). యేసు ప్రభువులో దేవుని వాగ్దానాలన్నీ “అవును” అన్నట్లుగానే ఉన్నాయని అపొస్తలుడైన పౌలు ధైర్యంగా ప్రకటించాడు. దేవుని వాగ్దానాలన్నీ నిజమైనవి, నమ్మదగినవి యేసు ప్రభువులో అవి నెరవేరతాయి.

యేసు ప్రభువులో దేవుని వాగ్దానాలన్నీ “అవును ఆమెన్” అన్నట్లుగానే ఉన్నాయి. మనకు ఈ నిరీక్షణ ఉండాలి. దేవుడు, మన జీవితాల ద్వారా మహిమ పొందేలా దేవుని వాగ్దానాలన్నీ యేసు ప్రభువులో నెరవేరడం చూస్తాము. యేసు ప్రభువులో దేవుని వాగ్దానాలన్నీ మంచికే జరుగుతాయనే సత్యంలో స్థిరపడండి. అవి అవును అన్నట్లుగానే ఉన్నాయి. దేవుని వాగ్దానాలన్నిటిలో మీ విశ్వాసంను ప్రకటించండి. దేవుని వాగ్దానాలన్నీ జరగాలని మీరు ఎదురుచూస్తున్నట్లుగా వాటన్నింటికి మీరు “అవును ఆమెన్” అని ప్రకటించండి.

# 56
# మేము నమ్మాము కాబట్టి మేము ప్రకటిస్తాము

**2 కొరింథీయులకు 4:13-15**
**13 కృప యెక్కువమంది ద్వారా ప్రబలి దేవుని మహిమ నిమిత్తము కృతజ్ఞతాస్తుతులు విస్తరింపజేయులాగున, సమస్తమైనవి మీకొరకై యున్నవి. కాగా**
**14-15 – `విశ్వసించితిని గనుక మాటలాడితిని అని వ్రాయబడిన ప్రకారము అట్టి విశ్వాసముతోకూడిన ఆత్మగలవారమై, ప్రభువైన యేసును లేపినవాడు యేసుతో మమ్మును కూడ లేపి, మీతోకూడ తన యెదుట నిలువ బెట్టునని యెరిగి, మేమును విశ్వసించుచున్నాము గనుక మాటలాడుచున్నాము.**

అపొస్తలుడైన పౌలు కీర్తనలు 116:10వ వచనాన్ని ఇక్కడ రాసాడు. ఇంకా చెప్పాలంటే, అపొస్తలుడైన పౌలు పరిశుద్ధాత్మ దేవుని ప్రేరేపణతో ఆ వచనంలోని కొంత భాగాన్ని మాత్రమే రాసినప్పటికి ఒక ఆత్మీయ సత్యాన్ని విశ్వాసులు కలిగివుండాలనే ఆశతో చెప్పి ఉండవచ్చు. మనం నమ్మిన దాని ప్రకారమే మనం మాట్లాడతాము. మనం మన విశ్వాసాన్ని ప్రకటించాలి. విశ్వాసం ప్రకటిస్తుంది. "విశ్వాసపు ఆత్మ" రెండు నిబంధనలలోను మార్పు చెందలేదు. దేవునిలో విశ్వాసమనేది పాతనిబంధన ప్రజలలో గాని క్రొత్త నిబంధన ప్రజలలో గాని ఏ మార్పు లేకుండా అలాగే ఉంది. విశ్వాస నియమం ఎప్పుడు ఒకే రీతిగా ఉంది - నాకు విశ్వాసం ఉంది, నేను నా విశ్వాసాన్ని ప్రకటిస్తాను లేదా విశ్వాసం ప్రకటిస్తుంది.

మనం నమ్ముతాము కాబట్టి మనం నమ్మేది ప్రకటిస్తాము. మనకు విశ్వాసముంది, మన విశ్వాసాన్ని ప్రకటిస్తాము. బైబిలంతటిలో ఉన్న మూలాధారమైన నియమం ఇదే. మనం నమ్మేదే మాట్లాడాలి. విశ్వాసాన్ని ప్రకటించాలి. మనం దేవుడిని, ఆయన వాక్యాన్ని నమ్ముతాము. కాబట్టి దాని ప్రకారమే మాట్లాడాలి. దేవుని పట్ల

మనకున్న విశ్వాసాన్ని, ఆయన మనకు చేసిన వాగ్దానాలను మనం ప్రకటిస్తాము.

మనం యేసు ప్రభువును నమ్ముతున్నాము. తరువాత, మనం సిలువపై మరణించి పునరుత్థానుడై పరలోకానికి ఆరోహణమైన ఘనతనొందిన యేసు నా కొరకు చేసిన వాటన్నింటిని నమ్ముతున్నాము. అందుకే మనం దాని గురించి మాట్లాడి, ప్రకటిస్తాము. మీ విశ్వాసాన్ని ప్రకటించండి.

# 57
# కృప కలిగిన మాటలనే మాట్లాడండి

**ఎఫెసీయులకు 4:29**
**వినువారికి మేలు కలుగునట్లు అవసరమునుబట్టి క్షేమాభివృద్ధికరమైన అనుకూలవచనమే పలుకుడి గాని దుర్భాషయేదైనను మీ నోట రానియ్యకుడి.**

మాటలు వినేవారికి ఏదోకటి అందిస్తాయి. చెడు మాటలు (దుష్ట, కుళ్లిపోయిన, వ్యర్థమైన) చెడుతనాన్ని (ఎందుకు పనికిరాని వాటిని) తీసుకువస్తాయి. మంచి మాటలు బలాన్ని కృపను తరువాత సంపూర్ణతను తీసుకువస్తాయి.

మాటలు పాత్రలువంటివి. మాటలు వాహనాలు వంటివి. మాటలు ప్రసారమవుతాయి. మాటలు "పరిచారకులు"వంటివి. వినేవారికి అవి తప్పకుండా ఏదొక ఒకటి చేస్తాయి.అవి ఆశీర్వాదకరంగా ఉంటాయి, నిలబెడతాయి బలపరుస్తాయి. లేదా అవి పడగొట్టి, బలహీనపరచి, గాయపరిచి, నాశనం చేస్తాయి.

విశ్వాసులుగా మనం ఇతరులకు విశ్వాసాన్ని కలిగించే మాటలనే మాట్లాడాలి. మన మాటలు వినేవారిలో విశ్వాసాన్ని నింపి, ప్రేరేపించి పురిగొల్పేలా విశ్వాసంతో నిండిన మాటలను ప్రకటించండి. మనం జ్ఞానంగల మాటలను మాట్లాడాలి. మనం సహాయం చేసి, పోషించి, నడిపించే, ఆశీర్వదించే మాటలనే మాట్లాడాలి. జ్ఞానం కలిగి మీ మాటలను ఉపయోగించండి. మీ మాటలను ప్రజలను ఆశీర్వదించడానికి ఉపయోగించండి. ప్రజలను ఆశ్వీర్వదించడనికి వాటిని వాడండి. ఇతరులను ఆశీర్వదించడానికి విశ్వాసాన్ని ప్రకటించండి.

# 58
# ఆత్మ ఖడ్గాన్ని ఉపయోగించండి

**ఎఫెసీయులకు 6:17**
**మరియు రక్షణయను శిరస్త్రాణమును, దేవుని వాక్యమను ఆత్మఖడ్గమును ధరించుకొనుడి.**

అపొస్తలుడైన పౌలు ఎఫెసీయులకు 6:17లో చెప్పినట్లు మనం ఆత్మీయ పోరాటంలో ఉన్నాము. శత్రువు ఓడిపోయాడు, అయినాసరే సమయం ఇంకా మిగిలి ఉంది కాబట్టి దాడి చేయడానికి ఇంకా పన్నాగాలు వేస్తునే ఉ``న్నాడు. విశ్వాసులమైన మనం విజయం పొంది శక్తివంతంగా పరిచర్య చేయడానికి సరిపోయే ఆత్మీయ యుద్ధోపకరణములను దేవుడు మనకు ఇచ్చారు. ఈ ఆత్మీయ యుద్ధోపకరణములలో శత్రువుని హతమార్చే ఒక శక్తివంతమైన ఆయుధమే ఆత్మ ఖడ్గము. పరిశుద్ధాత్మ దేవుని ద్వారా ఈ ఖడ్గం మనకివ్వబడింది. అది శక్తివంతమైన పరిశుద్ధాత్మ ద్వారానే బలం పొందుకుని పనిచేస్తుంది. అయితే మనం ఆ ఖడ్గాన్ని తీసుకుని ఉపయోగించాలి. మనం ఈ ఖడ్గాన్ని వాడినప్పుడు పరిశుద్ధాత్మ దేవుడే మన తరపున కార్యం చేస్తారు ఎందుకంటే అది ఆయన ఖడ్గము.

శత్రువుతో పోరాడి చీల్చడానికి మనం ఉపయోగించే ఖడ్గం దేవుని వాక్యమే. మనం ఆ ఖడ్గాన్ని ఎలా ఉపయోగిస్తాము? మనం మాటలతో ఏమి చేస్తాము? మనం మాట్లాడతాము. యేసు ప్రభువు గురించి ప్రకటన గ్రంథములో ఒక స్పష్టమైన వివరణ చూస్తాము. *“దేవుని వాక్యము అను నామము ఆయనకు పెట్టబడియున్నది, ... ఆయన నోటనుండి వాడిగల ఖడ్గము బయలు వెడలుచున్నది”* (ప్రకటన 19:13,15). కాబట్టి, వాడిగల ఖడ్గం అంటే మన నోటితో

ప్రకటించే దేవుని వాక్యమే.

దేవుని వాక్యాన్ని ప్రకటించడం ద్వారా మనం ఆత్మ ఖడ్గాన్ని ఉపయోగిస్తాము. మీరు దేవుని వాక్యాన్ని, దేవుని వాక్యం పట్ల మీకున్న విశ్వాసాన్ని ప్రకటిస్తున్న ప్రతిసారి శత్రువుకి దెబ్బ తగులుతుంది. శత్రువు మీమీదికి వచ్చినప్పుడు అంటే మీ మనసులో తప్పుడు ఆలోచనలు పుట్టించినప్పుడు లేదా మీ జీవితంలో ఏదొక విధంగా జోక్యం చేసుకున్నప్పుడు అతని మీద ఆత్మ ఖడ్గాన్ని ఉపయోగించండి. పరిశుద్ధాత్మ దేవుని ముందు అతడు నిలబడలేడు. దేవుని వాక్యాన్ని ప్రకటించండి. మీ విశ్వాసాన్ని ప్రకటించండి.

# 59
# ప్రవచనాత్మక మాటలతో మంచి పోరాటం పోరాడండి

**1 తిమోతికి 1:18**
**నా కుమారుడవైన తిమోతీ, నీవు విశ్వాసమును మంచి మనస్సాక్షియు కలిగినవాడవై, నిన్ను గూర్చి ముందుగా చెప్పబడిన ప్రవచనముల చొప్పున ఈ మంచి పోరాటము పోరాడవలెనని వాటినిబట్టి యీ ఆజ్ఞను నీకు అప్పగించుచున్నాను.**

ప్రవచనాత్మక మాటలు అంటే పరిశుద్ధాత్మ ప్రేరేపణతో ఇవ్వబడిన మాటలు. ప్రవచన వరం, ప్రవచన పరిచర్య క్రీస్తు సంఘంలో నేటికీ కొనసాగుతూనే ఉంది. మనకు ప్రవచనాలు ఇవ్వడానికి అనేక కారణాలలో ఒక కారణం, మనల్ని ఆత్మీయ పోరాటానికి సన్నద్ధులుగా చేయడానికేనని మనం గ్రహించాలి. శత్రువు మీద మంచి పోరాటం పోరాడడానికి మనం ఈ ప్రవచనాలను ఉపయోగించాలి.

శత్రువైన సాతాను, వాని దురాత్మలు దొంగిలించడానికి హత్య చేయడానికి ఇంకా నాశనం చేయడానికి వస్తాయి. అవి ఏదో విధంగా దేవునికి మన పట్ల ఉన్న ఉద్దేశాల నుండి మనల్ని దూరం చేయడానికి, దారి తప్పించడానికి, చెదరగొట్టడానికి మార్గాలను వెతుకుతాయి. మన జీవితాలలో దేవుని ఉద్దేశాన్ని, దేవుని వాగ్దానాలను అలాగే దేవుని సామర్థ్యాన్ని ప్రకటించే ప్రవచనాలను మనం పట్టుకోవాలి. ఈ ప్రవచనాలతో మనం మంచి పోరాటం పోరాడతాము. మనకున్న ఆత్మీయ పోరాటాలలో శత్రువుకు వ్యతిరేకంగా ఈ ప్రవచనాత్మక మాటలను ఉపయోగించాలి. జ్ఞాపకముంచుకోండి, మాటలు ప్రకటించాలి. మీ జీవితం మీద ప్రకటించిన ప్రవచనాత్మక మాటలను ప్రకటించండి (అయితే అవి మీరు ఆత్మ నుండి వచ్చినవే అని పరీక్షించి తెలుసుకోవాలి). దేవుడు మీ గురించి ఆత్మ ద్వారా చెప్పింది ప్రకటించండి. ఆ మాటలే శత్రువుకు వ్యతిరేకంగా ఉండే మీ ఆయుధాలని దేవుడు చెప్పారు. ప్రవచనాత్మక మాటలను ప్రకటించండి. విశ్వాసంతో ప్రకటించండి.

# 60
# క్రీస్తును బట్టి మీలో ఉన్న ప్రతి మంచి విషయాన్నీ అంగీకరించండి

**ఫిలేమోనుకు 1:6**
**క్రీస్తునుబట్టి మీయందున్న ప్రతి శ్రేష్ఠమైన వరము విషయమై నీవు అనుభవపూర్వకముగా ఎరుగుటవలన ఇతరులు నీ విశ్వాసమందు పాలివారగుట అనునది కార్యకారి కావలయునని వేడుకొనుచున్నాను.**

పౌలు ఫిలేమోనుకు పత్రిక రాసిన సందర్భం చాలా ఆసక్తికరంగా ఉంటుంది. ఒకప్పుడు దాసుడుగా ఉండి పారిపోయి పౌలు సహవాసంలో విశ్వాసిగా మారిన ఓనేసిమును తన యజమాని ఫిలొమోను దగ్గరకు పంపిస్తూ పౌలు ఉత్తరం రాసాడు. అతడిప్పుడు తన దాసునికి ప్రభువులో సోదరునిగా ఉన్నాడు. పౌలు ఈ చిన్న ఉత్తరాన్ని ప్రారంభిస్తూ క్రీస్తులో మనకున్న ప్రతి మంచి విషయాన్నీ (అన్ని సంపదలు ఆశీర్వాదాలు) అంగీకరించినప్పుడు (పూర్తిగా గుర్తించినప్పుడు) విశ్వాసంలో మన సహవాసం మరింత మెరుగ్గా (ప్రభావంతంగా, శక్తివంతంగా, ఉత్సాహకరంగా) మారుతుందనే సత్యాన్ని రాసాడు.

దేవుడు క్రీస్తు దగ్గరకు తీసుకుని రావడంతో ద్వారా మనలో ఉంచిన ప్రతి మంచి విషయాన్ని చెప్పడం, అంగీకరించడం, గుర్తించడం మనం నేర్చుకోవాలి. క్రీస్తులో మనమేమై ఉన్నామో గుర్తించి అంగీకరించాలి. మనతో పాటు ఇతరుల విషయంలో కూడా ఇది చేయాలి. ఇది మీకును తరువాత ఇతరులకు చేయండి. దేవుడు క్రీస్తులో మనకు చేసిన దాని చుట్టూ మనం సహవాసం చేస్తాము. ఇదే మన సహవాసాన్ని శక్తివంతంగా చేస్తుంది. మన బలహీనతల గురించి అంటే మన పేదరికం గురించి దయనీయమైన స్థితిని గురించి, మన

పాపాల గురించి దుర్మార్గత గురించి మాట్లాడే బదులు, మనం క్రీస్తులో ఉన్న కారణంగా మనలో ఉన్న మంచి విషయాలను అంగీకరిద్దాము.

**గమనించండి:** పాపాన్ని ఎత్తి చూపించకూడదని గాని ఏదైనా తప్పు జరిగితే దాన్ని సరి చేయకూడదనిగాని పట్టించుకోకూడదని మేము చెప్పడం లేదు. మనం ఖచ్చితంగా పొరపాట్లను తప్పులను ఎదుర్కొని ఎక్కడ దిద్దుబాటు అవసరమో అక్కడ సరిచేసుకోవాలి. కానీ మనం దిద్దుబాటు అంగీకరించి సరిచేసుకున్నామని తెలిసాక, గతాన్ని విడిచిపెట్టి క్రీస్తును బట్టి మనలో ప్రతి ఒక్కరిలో ఉన్న మంచి విషయాలను చూడాలి.

# 61
# ఆయన వాక్యం మీ లోకాన్ని నిలబెట్టి క్రమపరుస్తుంది

**హెబ్రీయులకు 1:3,4**
**3-4 ఆయన దేవుని మహిమయొక్క తేజస్సును, ఆయన తత్వముయొక్క మూర్తి మంతమునైయుండి, తన మహత్తుగల మాటచేత సమస్తమును నిర్వహించుచు, పాపముల విషయములో శుద్ధీకరణము తానే చేసి, దేవదూతలకంటె ఎంత శ్రేష్ఠమైన నామము పొందెనో వారికంటె అంత శ్రేష్ఠుడై, ఉన్నత లోకమందు మహామహుడగు దేవుని కుడిపార్శ్వమున కూర్చుండెను.**

పాత నిబంధనలో మనం అనేకసార్లు చూసిన విషయాలనే మరొకసారి హెబ్రీలో పత్రికలో చూస్తాము. అన్ని విషయాలు, సృష్టి యావత్తు కూడా ఆయన వాక్కు శక్తి చేత నిలబెట్టబడి క్రమపరచబడుతున్నాయని లేఖనాలు మనకు నేర్పిస్తున్నాయి.

అదే సర్వశక్తిగల దేవుడు భూమ్మీద మన జీవితాల కొరకు తన వాక్యాన్నిచ్చారు. ఖచ్చితంగా, ఆయన మనకిచ్చిన ఆయన వాక్యం మనల్ని ఎత్తిపట్టుకుని, నిలబెట్టి, క్రమపరచి మన చిన్ని ప్రపంచాలు కూడా సరిగ్గా పనిచేసేలాగా చేస్తుంది.

అయితే ఆయన మనకు లిఖితపూర్వకంగా ఇచ్చి పరిశుద్ధ లేఖనాలలోని ఆయన వాక్యాన్ని తీసుకుని దానిని మన లోకంలోనికి తీసుకుని రావడమే చాలా కీలకము. లేఖనమంతటిలో మనం చూసిన ఒక విధానమేమిటంటే, ఆయన వాక్యాన్ని నమ్మి, మన లోకంలో ఆయన వాక్యాన్ని ప్రకటించడమే.

దేవుని వాక్యానికి మీ లోకాన్ని నిలబెట్టి క్రమపరచే శక్తి

అవసరమైన దానికన్నా ఎన్నో రెట్లు ఉందని తెలుసుకోండి. కొన్నిసార్లు కొన్ని విషయాలు చెదిరిపోతున్నట్లుగా ఉండవచ్చు. కొన్ని మన చేదాటిపోతున్నట్లుగా అదుపు తప్పిపోతున్నట్లుగా ఉండవచ్చు. అయినా కాని దేవుని వాక్యానికున్న శక్తి మీద విశ్వాసముంచండి. ఆయన వాక్యాన్ని మీ జీవితం మీద, మీ వర్తమానం మీద, మీ భవిష్యత్తు మీద, మీ పరిస్థితుల మీద ప్రకటించండి. ఆయన వాగ్దానాలను ప్రకటించండి. మీ లోకంలోనున్న ప్రతిదీ, దేవుని వాక్యానికి లోబడి ఉందని, ఆయన వాక్యానికి అనుగుణంగా ఉంటుందని ప్రకటించండి. మీ విశ్వాసాన్ని ప్రకటించండి. దేవుని వాక్యపు శక్తి మీ జీవితంలో కార్యం చేయడం చూస్తారు.

# 62
# యేసు ప్రభువు మనం ఒప్పుకున్నదానికి ప్రధాన యాజకుడు

**హెబ్రీయులకు 3:1**
**ఇందువలన, పరలోకసంబంధమైన పిలుపులో పాలు పొందిన పరిశుద్ధ సహోదరులారా, మనము ఒప్పుకొనిన దానికి అపొస్తలుడును ప్రధానయాజకుడునైన యేసుమీద లక్ష్యముంచుడి.**

ముందున్న ఒక అధ్యాయంలో, "ఒప్పుకోలు" అనే పదానికి అర్థం (గ్రీకుపదం *'హోమోలోగియా'*) "కలిసి ఒకటే విషయాన్నీ చెప్పడం, మాటలను అంగీకరించడం" అని వివరించాము. నూతన నిబంధనలో ఒప్పుకోలు అనే మాటకు దేవునితోను ఆయన వాక్కుతోను అంగీకరించడమని అర్థము. దేవుడు చెప్పిందే మనం చెప్పినప్పుడు, లేదా మన మాటలతో దేవునితో ఏకీభవించినప్పుడు మనం ఒప్పుకుంటున్నాము.

హెబ్రీయులకు పత్రిక రచయత మనకు యేసు ప్రభువు గురించి చెప్తూ, మనం ఒప్పుకున్న దానికి ఆయన అపొస్తలుడని (ముందున్నవాడు, ముందుగా వెళ్లేవాడు) ప్రధాన యాజకుడని (మనకి ప్రాతినిధ్యం వహిస్తున్నారని) ప్రకటించాడు. యేసు ప్రభువు పరలోకంలో మనం ఒప్పుకుంటున్న విశ్వాసానికి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. దీని అర్థం, మనం మాట్లాడేది దేవుని వాక్యానికి అనుగుణంగా ఉండి దేవుడు చెప్పిన దానితో ఏకీభవిస్తే మన తరపున యేసు ప్రభువు దానిని తండ్రి ఎదుట ఒప్పుకుని మనకు ప్రాతినిధ్యం వహిస్తారు.

యేసు ప్రభువు మనం ఒప్పుకున్న దానికి ప్రధాన యాజకుడని జ్ఞాపకముంచుకోండి. ఆయన వాక్యాన్ని అంగీకరించి ప్రకటించండి. మీ విశ్వాసాన్ని ప్రకటించండి.

# 63
# మీరు ఒప్పుకొన్నదానిని గట్టిగా పట్టుకోండి

**హెబ్రీయులకు 4:14**
**ఆకాశమండలముగుండా వెళ్లిన దేవుని కుమారుడైన యేసు అను గొప్ప ప్రధానయాజకుడు మనకు ఉన్నాడు గనుక మనము ఒప్పుకొనినదానిని గట్టిగా చేపట్టుదము.**

**హెబ్రీయులకు 10:23**
**వాగ్దానము చేసినవాడు నమ్మదగినవాడు గనుక మన నిరీక్షణ విషయమై మన మొప్పుకొనినది నిశ్చలముగా పట్టుకొందము.**

మనకు యేసు ప్రభువు ప్రధాన యాజకునిగా ఉన్నారు కాబట్టి, మనం మన ఒప్పుకోలుని గట్టిగా పట్టుకొని ఉండాలి (బలాన్ని ఉపయోగించి చేజారిపోకుండునట్లు గట్టిగా పట్టుకొని ఉండాలి), అంటే మనం ప్రకటించేది ఆయన వాక్యంతో ఏకీభవించాలి. అంతే కాకుండా మనకు వాగ్దానం చేసినవాడు నమ్మదగినవాడని మనకు తెలుసు. ఆయన తన వాగ్దానాలను నెరవేర్చకుండా విఫలం కారు. కాబట్టి, మనం మన విశ్వాసపు ఒప్పుకోలును చెదిరిపోకుండా పట్టుకోవాలి.

దేవుని గురించి ఆయన వాక్యం గురించి మనకున్న నమ్మకాన్ని సవాలు చేసే విషయాలు ఉన్నప్పటికీ మనం ఒప్పుకున్నదానిని చెదిరిపోకుండా గట్టిగా పట్టుకోవాలి. దేవునితో ఆయన వాక్యంతో ఏకీభవిస్తూ మీ విశ్వాసాన్ని ప్రకటిస్తూనే ఉండండి.

దేవుని వాక్యం నెరవేరడం ఆలస్యం అవుతున్నట్లు కనపడినా సరే మనం ఒప్పుకున్నదానిని చెదిరిపోకుండా గట్టిగా పట్టుకోవాలి. దేవునితో ఆయన వాక్యంతో ఏకీభవిస్తూ మీ విశ్వాసాన్ని ప్రకటిస్తూనే ఉండండి.

పరిస్థితులు చాలా కష్టంగా మారినప్పుడు కూడా మనం స్థిరంగా నిలబడి మన విశ్వాసపు ఒప్పుకోలును చెదిరిపోకుండా గట్టిగా పట్టుకోవాలి. మన ఒప్పుకోలుకు ప్రాతినిధ్యం వహిస్తూ, తన వాగ్దానాలకు నమ్మకంగా ఉన్న గొప్ప ప్రధాన యాజకుడు పరలోకంలో మనకు ఉన్నారు. దేవునితో ఆయన వాక్యంతో ఏకీభవిస్తూ మీ విశ్వాసాన్ని ప్రకటిస్తూనే ఉండండి.

# 64
# ఆయన మాటలు ఈ లోకాన్ని రూపొందించాయి

**హెబ్రీయులకు 11:3**
**ప్రపంచములు దేవుని వాక్యమువలన నిర్మాణమైనవనియు, అందునుబట్టి దృశ్యమైనది కనబడెడు పదార్థములచే నిర్మింపబడలేదనియు విశ్వాసముచేత గ్రహించుకొనుచున్నాము.**

దేవుని వాక్యంచేత ఈ లోకములు నిర్మితమయ్యాయని (సృష్టించబడ్డాయి, ఏర్పరచబడ్డాయి, రూపుదిద్దబడ్డాయి, నిర్మించబడ్డాయి) విశ్వాసం వలన మనం గ్రహిస్తున్నాము. కనిపించే సహజ లోకము కనపడని ఆత్మీయ రంగము నుండి వచ్చింది. దేవుడు తన వాక్కుతో సమస్తాన్ని సృష్టించారు, ఆయన లేనిదానిని ఉనికిలోనికి తీసుకువచ్చారు. ప్రకృతి సహజమైన, కంటికి కనిపించే ప్రతిదీ దేవునికి, దేవుని వాక్యానికి లోబడి ఉంది.

కాబట్టి, మనం పరిస్థితులను ఇలా చూద్దాము. మనలో ప్రతి ఒక్కరు తమ తమ ప్రపంచాలలో జీవిస్తారు. "మన ప్రపంచాలు" అంటే మన బాధ్యతలు ప్రభావాన్ని కలిగి ఉండే వ్యక్తిగత పరిధిలు అనగా మన గృహాలు, కుటుంబాలు, ఉద్యోగాలు, పరిచర్యలు మొదలైన వాటి గురించి చెప్తున్నాము. మన లోకాల్లో ఉండని కొన్ని విషయాలు కూడా ఉన్నాయి. మన లోకాల్లోకి ఎన్నడూ లేని వాటిని దేవుడు తన వాక్యపు శక్తి ద్వారా ఉనికిలోనికి తీసుకుని రాగలరు. ఆయన వాక్యం మన లోకాలను సృష్టించగలదు, ఏర్పరచగలదు, రూపుదిద్దగలదు, నిర్మించగలదు. మీరు కనుక మీ లోకాన్ని చూసినప్పుడు అది "నిరాకారముగా శూన్యముగా" ఉండవచ్చు, చీకటిగా ఖాళీగా ఉండవచ్చు. బహుశా మీరు ఆశించినవి, దేవుని వాక్యంలో వాగ్దానం

చేసిన అనేక విషయాలు మీ లోకంలో ఉనికిలో లేకపోవచ్చు. దేవుని వాక్యానికి మీ లోకంలో సృష్టించే శక్తి ఉందని మీరు నమ్ముతున్నారా? దేవుని వాక్యం మీ లోకంలో లేనిదానిని ఉనికిలోనికి తీసుకుని రాగలదని నమ్ముతున్నారా? దేవుని వాక్యాన్ని గట్టిగా పట్టుకోండి. ఆయన వాక్యమే సత్యము. ఆయన వాక్యం సజీవమైంది, శక్తితో నిండి ఉంది. ఆయన వాక్యాన్ని నమ్మండి. ఆయన వాక్యాన్ని మీ లోకం

# 65
# దేవుడు చెప్పారు కాబట్టి మనం ధైర్యంగా చెప్తాము

**హెబ్రీయులకు 13:5,6**
**[5] ధనాపేక్షలేనివారై మీకు కలిగినవాటితో తృప్తిపొంది యుండుడి.**
**–నిన్ను ఏమాత్రమును విడువను, నిన్ను ఎన్నడును ఎడబాయను అని ఆయనయే చెప్పెను గదా.**
**[6] కాబట్టి –ప్రభువు నాకు సహాయుడు, నేను భయపడను,**
**నరమాత్రుడు నాకేమి చేయగలడు? అని మంచి ధైర్యముతో చెప్పగలవారమై యున్నాము.**

హెబ్రీయులకు పత్రిక రచయత, మనం ఎలా మాట్లాడాలనే దానికి ఒక సులువైన క్రమాన్ని తెలిపాడు—దేవుడు చెప్పారు కాబట్టి మనం ధైర్యంగా చెప్తున్నాము. మనం దేవుడే స్వయంగా చెప్పిన దానిని ధైర్యంగా నమ్మి దానితో ఏకీభవించి మాట్లాడతాము.

దేవుడు, *"నేను నిన్ను విడువను ఎడబాయను"* అని చెప్పారు. కాబట్టి మనం ధైర్యంగా, "ప్రభువే నా సహాయకుడు, నేను భయపడను" అని చెప్తాము.

దేవుడు *"ఆయన పొందిన గాయములు చేత మనకు స్వస్థత"* అని చెప్పారు కాబట్టి మనం ధైర్యంగా "ఆయన నా వ్యాధులను తీసుకున్నారు, మన బాధలను మోశారు, ఆయన పొందిన గాయములతో నేను స్వస్థతను పొందాను" అని చెప్పగలము.

దేవుడు, "మీరు నీటియోరను నాటబడిన చెట్టువలే ఉంటారని" చెప్పారు కాబట్టి మనం ధైర్యంగా "నేను తగిన కాలమున పంటను కాస్తాను, నా ఆకు వాడదు, నేను చేసిన ప్రతీది వర్ధిల్లుతుంది" అని

చెప్పగలము.

మనం దీనికి కూడా జత చేయవచ్చు.

దేవుడు చెప్పిన దానిని మీరు ప్రతి పరిస్థితిలో నిత్యం ధైర్యంగా చెప్పడం అలవాటు చేసుకోండి. మీ విశ్వాసాన్ని ధైర్యంగా ప్రకటించండి ఎందుకంటే, దేవుడు ఏమి చెప్పారో మీకు తెలుసు, మీరు ఆయనతో ఏకీభవించి మాట్లాడతారు. ఆయన మిమల్ని నిరాశపర్చరు.

ఇద్దరూ అంగీకరిస్తేనే వారు కలిసి నడువగలరు (ఆమోసు 3:3). మనం దేవునితో అంగీకరించినప్పుడే ఆయనతో నడువగలము. మనం ఆయన వాక్యంను అంగీకరించడం ద్వారా దేవునితో ఏకీభవిస్తాము. దేవుడు చెప్పారు కాబట్టి, మనం ఉద్దేశపూర్వకంగా ధైర్యంగా ఆయనతో ఏకీభవిస్తూ మాట్లాడగలము.

# 66
# మీ నాలుకను నియంత్రించి, మీ వ్యక్తిత్వమంతటిని పాలించండి

**యాకోబు 1:26**
**ఎవడైనను నోటికి కళ్లెము పెట్టుకొనక తన హృదయమును మోసపరచుకొనుచు భక్తిగలవాడనని అనుకొనినయెడల వాని భక్తి వ్యర్థమే.**

**యాకోబు 3:1-6**
**1 నా సహోదరులారా, బోధకులమైన మనము మరి కఠినమైన తీర్పు పొందుదుమని**
**తెలిసికొని మీలో అనేకులు బోధకులు కాకుండుడి.**
**2 అనేకవిషయములలో మన మందరము తప్పిపోవుచున్నాము. ఎవడైనను**
**మాటయందు తప్పనియెడల అట్టివాడు లోపము లేనివాడై, తన సర్వశరీరమును**
**స్వాధీనమందుంచుకొన శక్తిగలవాడగును.**
**3 గుర్రములు మనకు లోబడుటకై నోటికి కళ్లెముపెట్టి, వాటి శరీరమంతయు**
**త్రిప్పుదుము గదా**
**4 ఓడలను కూడ చూడుడి; అవి ఎంతో గొప్పవై పెనుగాలికి కొట్టుకొని పోబడినను,**
**ఓడ నడుపువాని ఉద్దేశముచొప్పున మిక్కిలి చిన్నదగు చుక్కానిచేత త్రిప్పబడును.**
**5 ఆలాగుననే నాలుక కూడ చిన్న అవయవమైనను బహుగా అదిరి పడును. ఎంత**
**కొంచెము నిప్పు ఎంత విస్తారమైన అడవిని తగులబెట్టును!**
**6 నాలుక అగ్నియే, నాలుక మన అవయవములలో ఉంచబడిన పాపప్రపంచమై**
**సర్వశరీరమునకు మాలిన్యము కలుగజేయుచు, ప్రకృతి చక్రమునకు చిచ్చుపెట్టును;**
**అది నరకముచేత చిచ్చు పెట్టబడును.**

పూర్తిగా ఎదిగి పరిణితి చెంది, ఆత్మీయంగా మాట్లాడుతూ, తన నాలుకను అదుపులో ఉంచగలవారే "సంపూర్ణమైన వ్యక్తి". మన మాటలను జాగ్రత్తగా చూసుకుంటూ నాలుకను అదుపు చేయగలిగితే, మన పూర్తి శరీరంపై నియంత్రణ ఉంటుంది లేదా "అన్ని విధాలుగా మనల్ని మనం నియంత్రించుకోగలుగుతాము" (పాషన్ ట్రాన్సలేషన్).

మన నాలుకను అదుపులో ఉంచుకోడానికి లేదా మన మాట్లాడేది నియంత్రించడానికి ఉన్న ప్రాముఖ్యతను ఇది తెలియజేస్తుంది.

మన మాటలను నియంత్రించడానికి మనం చేయవలసిన అనేక క్రమశిక్షణలలో ఒకటి ఏమిటంటే దేవుడు అంగీకరించే దానినే మనం ఎప్పుడూ మాట్లాడగలగడము. దేవుని దృష్టికి అంగీకారమైన దానినే మాట్లాడండి. దేవున్ని మహిమపరచే దానినే ప్రకటించండి. ఆయన వాక్యంతో ఏకీభవించే దానినే ప్రకటించండి. విశ్వాసాన్ని ప్రకటించండి. మనం ఇది చేయగలిగితే అన్ని విధాలుగా మనల్ని మనం పాలించుకోగలము.

మన నాలుకలను అదుపు చేసే అనేకమైన శ్రేష్ఠమైన మార్గాలలో ఒకటి, ఉద్దేశపూర్వకంగా దేవుని వాక్యం చెప్పే దానినే చెప్పడం. లేఖనంలో అనేక ఆత్మీయ అభ్యాసాలను మనం చూస్తాము. ఉదాహరణకు, దేవునికి స్తుతి ఆరాధన అనే అర్పణలు అర్పిస్తామని మనకు తెలుసు. మనకు ఎలా ప్రార్థించాలో, వివిధ రకాల ప్రార్థనలు ఎలా చేయాలో తెలుసు. మనకు దేవుని వాక్యాన్ని ఎలా చదవాలో ఎలా అభ్యసించాలో, ఎలా ధ్యానించాలో తెలుసు. అదే రీతిగా మన ఆత్మీయ క్రమశిక్షణలో భాగంగా, వాక్యాన్ని ప్రకటించడానికి సమయాన్ని తీసుకోవచ్చు. ఈ పుస్తకం ప్రారంభంలోనే మనకు వ్యక్తిగతంగా జీవితంలోని అన్ని అంశాల గురించి దేవుని వాక్యం నుండి కొన్ని ప్రకటనల ఉదాహరణలు ఇచ్చాము. ఈ మాదిరిని గాని వేరే విధానాన్ని గాని దేవుని వాక్యాన్ని మీ జీవితం మీద ప్రకటించడానికి ఉపయోగించండి. అర్థంలేని ఆచారంగా లేదా నామకార్థ దినచర్యగా దీనిని చేయకండి. మీ విశ్వాసాన్ని ప్రకటించడానికి ఉన్న ప్రాముఖ్యతను గ్రహించినవారిగా సత్యంచే ప్రేరేపించబడిన దీనిని చేయండి. మీ నాలుకను సాధు చేసుకుంటూ ఉంటే మీ మాటలను జాగ్రత్తగా చూసుకోవడం అలవాటుగా మారుతుంది. అప్పుడు మీరు ఆయన వాక్యంతో ఏకీభవించి మాట్లాడగలుగుతారు. మీ విశ్వాసాన్ని ప్రకటించడం మీకు అలవాటైన విషయంగా ఉంటుంది.

# 67
# మీ మాటలు మీ జీవితాన్ని నడిపిస్తాయి, పాలిస్తాయి, ఆశీర్వదిస్తాయి

**యాకోబు 3:3-6**
**3 గుర్రములు మనకు లోబడుటకై నోటికి కళ్లెముపెట్టి, వాటి శరీరమంతయు త్రిప్పుదుము గదా**
**4 ఓడలను కూడ చూడుడి; అవి ఎంతో గొప్పవై పెనుగాలికి కొట్టుకొని పోబడినను, ఓడ నడుపువాని ఉద్దేశముచొప్పున మిక్కిలి చిన్నదగు చుక్కానిచేత త్రిప్పబడును.**
**5 ఆలాగుననే నాలుక కూడ చిన్న అవయవమైనను బహుగా అదిరిపడును. ఎంత కొంచెము నిప్పు ఎంత విస్తారమైన అడవిని తగులబెట్టును!**
**6 నాలుక అగ్నియే, నాలుక మన అవయవములలో ఉంచబడిన పాపప్రపంచమై సర్వశరీరమునకు మాలిన్యము కలుగజేయుచు, ప్రకృతి చక్రమునకు చిచ్చుపెట్టును; అది నరకముచేత చిచ్చు పెట్టబడును.**

పరిశుద్ధాత్ముని నడిపింపుతో యాకోబు తన పత్రికలో మనం మాట్లాడే మాటలకుండే శక్తిని ప్రభావాన్ని తెలియజేయడానికి మన లోకంలోని కొన్ని సాదృశ్యాలను ఉపయోగించాడు. అతడు ఉపయోగించిన సాదృశ్యాలను గమనించండి - గుర్రముల నోటిలో కళ్లెములు, ఓడ చుక్కాని, అడవి తగలబెట్టు నిప్పు. ఒక బలమైన గుర్రాన్ని దాని నోటికి వేసిన కళ్లెముతో నియంత్రిస్తూ ఆ గుర్రాన్ని నడిపేవాడు తనకు కావలసిన రీతిగా దానిని నడిపిస్తాడు. అదే రీతిగా అలలు గాలుల మధ్యలో ఉన్న సరే ఒక పెద్ద ఓడను చిన్న చుక్కానిని ఉపయోగించి నావికుడు నడిపిస్తాడు. ఒక చిన్న నిప్పు పెద్ద అడవిని సైతం తగలబెట్టగలదు. ఇక్కడ విషయమేమిటంటే, మన మాటలు అల్పం, బలహీనంగా లేదా ప్రాముఖ్యతలేనివిగా ఉండవచ్చు. కానీ, మనం మాట్లాడే మాటలు చాలా శక్తివంతమైనవని, అవి మన జీవితమంతటిని నడిపించి, దారి చూపించి, పాలించగలవని మనం తెలుసుకోవాలని పరిశుద్ధాత్మ దేవుడు కోరుకుంటున్నారు.

6వ వచనంలో యాకోబు చెడ్డ నాలుక గురించి రాస్తున్నాడు. చెడ్డ నాలుక నరకం నుండే వచ్చే దుష్టత్వంతో ప్రేరేపించబడి చిచ్చుపెడుతుంది లేదా నిప్పు అంటిస్తుంది. ఇక్కడ తెలిపిన చెడ్డ నాలుక ప్రభావాన్ని గమనించండి. చెడ్డ నాలుక ఒకని పూర్తి శరీరాన్ని లేదా పూర్తిగా వానిని (ఆత్మ, మనసు, శరీరం) మలినం చేస్తుంది. అది వారి వ్యక్తిగత జీవితానికి కూడా "నిప్పు పెడుతుంది" లేదా ప్రభావితం చేస్తుంది. చెడ్డ మాటలు మన వ్యక్తిత్వాన్ని మన జీవిత గమనాన్ని మలినం చేసి నాశనం చేస్తాయి. ఇప్పుడు మనకు మంచి నాలుక—అంటే దేవుని వాక్యమనే నిప్పు అంటుకున్న నాలుక ఉంటే ఎలా ఉంటుంది? (దేవుని వాక్యం అగ్నివంటిది. యిర్మీయా 23:29). మంచి నాలుక దేవుని వాక్యానుసారంగా ప్రేరేపించబడే మాటలు ప్రకటిస్తుంది. అలాంటి మాటలు మనల్ని సంపూర్ణంగా కట్టి ఆశీర్వదిస్తాయి, మన జీవిత గమనాలను ఆశీర్వదించి నడిపిస్తాయి.

మన మాటలు మన జీవిత గమనాన్ని నడిపిస్తాయి, పాలిస్తాయి అలాగే నిర్దేశిస్తాయి. మన మాటలు పూర్ణంగా కట్టి ఆశీర్వదిస్తాయి, మన జీవిత గమనాలను ఆశీర్వదించి నడిపిస్తాయి. వాక్యాన్ని ప్రకటించండి. విశ్వాసంతో కూడిన మాటలు ప్రకటించండి. మీరు మాట్లాడే మాటలు మిమ్మల్ని ఆశీర్వదించి మీ జీవితాన్ని కట్టాలి.

# 68
# విశ్వాసాన్ని నిలకడగా ప్రకటించండి

**యాకోబు 3:7-12**
**7 మృగ పక్షి సర్ప జలచరములలో ప్రతిజాతియు నరజాతి చేత సాధుకాజాలును, సాధు ఆయెను గాని**
**8 యే నరుడును నాలుకను సాధుచేయనేరడు, అది మరణకరమైన విషముతో నిండినది, అది నిరర్గళమైన దుష్టత్వమే.**
**9 దీనితో తండ్రియైన ప్రభువును స్తుతింతుము, దీనితోనే దేవుని పోలికెగా పుట్టిన మనుష్యులను శపింతుము.**
**10 ఒక్కనోటనుండియే ఆశీర్వచనమును శాపవచనమును బయలువెళ్లును; నా సహోదరులారా, యీలాగుండకూడదు.**
**11 నీటిబుగ్గలో ఒక్క జెలనుండియే తియ్యని నీరును చేదునీరును ఊరునా?**
**12 నా సహోదరులారా, అంజూరపుచెట్టున ఒలీవ పండ్లయినను ద్రాక్షతీగెను అంజూరపు పండ్లయినను కాయునా? అటువలెనే ఉప్పు నీళ్లలోనుండి తియ్యని నీళ్లును ఊరవు.**

యాకోబు పరిశుద్ధాత్మ ద్వారా, మనం మాట్లాడే మాటలలో స్థిరంగా మంచిగా, సరైనదిగా, స్వచ్ఛంగా పవిత్రంగా ఉండడానికి ఉన్న ప్రాముఖ్యతను తెలియజేస్తాడు. మనం అన్నివేళలా మన మాటలు మీద నియంత్రణ కలిగి ఎప్పుడూ జీవాన్ని ఆశీర్వాదాన్ని ప్రకటించేవారిగా ఉండాలి. మనం రెండు నాలుకలుగలవారిగా అంటే కొన్నిసార్లు జీవాన్ని ఆశీర్వాదాన్ని తరువాత మరికొన్నిసార్లు మరణాన్ని శాపాన్ని పలికేవారిగా ఉండకూడదు. ఎప్పుడూ అన్నివేళలా ప్రతి పరిస్థితిలోను నిలకడగా జీవాన్ని ఆశీర్వాదాన్ని మాత్రమే ప్రకటించండి.

అదే రీతిగా మనం కొన్నిసార్లు విశ్వాసంతో మాట్లాడి మరికొన్నిసార్లు భయాలు, సందేహాలు, అవిశ్వాసం కలిగి మాట్లాడకూడదు. ఎల్లవేళలా నిలకడగా విశ్వాసాన్ని ప్రకటించండి. మనం నిరంతరం మన హృదయాలను మనసులను దేవుని వాక్యంతో నింపుకుంటూ ఉంటేనే ఇలా చేయగలము. మనల్ని మనం నిరంతరం

విశ్వాసపు మాటలతో పోషించుకుంటే, నిలకడగా విశ్వాసపు మాటలు ప్రకటించేవారిగా ఉంటాము.

మీ నాలుకను సాధు చేసుకోండి. మీరు ఎప్పుడూ జీవాన్ని ఆశీర్వాదాన్ని విశ్వాసాన్ని ప్రకటించేవారిగా మిమ్మల్ని మీరు మలచుకోండి.

# 69
# అపవాదిని ఎదరించండి

**యాకోబు 4:7**
**కాబట్టి దేవునికి లోబడియుండుడి, అపవాదిని ఎదిరించుడి, అప్పుడు వాడు మీయొద్దనుండి పారిపోవును.**

మనం దేవునికి లోబడి అపవాదిని ఎదిరించాలి. "ఎదిరించుడి" అనే మాటకు "అపవాది మన ముందు పెట్టే వాటికి విరోధంగా నిలిచి వ్యతిరేకించడమని" అర్ధము. మనం నూతన నిబంధనలో గమనించినట్లు, దేవుని వాక్యంలో "ఇలా రాయబడి ఉందని... "ప్రకటించి ద్వారా దేవుని వాక్యమనే ఆత్మ ఖడ్గాన్ని వాడుతూ, యేసు క్రీస్తులో మనకున్న అధికారంతో ఆజ్ఞాపిస్తూ మనం దుష్టున్ని ఎదిరిస్తాము. దేవుని వాక్యం ప్రాముఖ్యమైనదని మనం ఆలోచిస్తున్నప్పుడు, అపవాది శోధించాలని చూస్తున్న దానిని బలంగా ఎదిరించి వ్యతిరేకించడానికి దేవుని వాక్యాన్ని ప్రకటించడం కూడా అంతే ప్రాముఖ్యమైందని గ్రహించాలి.

శత్రువు మన మనసులలోకి తన తప్పు ఆలోచనలు, దుష్ట ఆలోచనలు, ప్రణాళికలు, ఊహలు, వాదనలు, తర్కములను పెట్టాలని చూస్తున్నప్పుడు, దాని గురించి దేవుని వాక్యం ఏమి చెప్తుందో దానిని మీ జ్ఞాపకం చేసుకోవడం చాలా ముఖ్యము. అంతే కాకుండా అపవాది పెట్టే చెడ్డ ఆలోచనల గురించి దేవుని వాక్యం ఏమి చెప్తుందో దానిని ప్రకటించడం కూడా ముఖ్యమే. "ఇలా రాయబడిందని..." మనంప్రకటిస్తాము.

ఇలా చేయడంలో స్థిరంగా పట్టుదలగా ఉండండి. మీ విశ్వాసంలో స్థిరంగా ఉంటూ అపవాదిని ఎదిరించండి (1 పేతురు 5:9). మీ విశ్వాసాన్ని ప్రకటించండి. అతడు వచ్చిన ప్రతిసారి మీ విశ్వాసాన్ని ప్రకటించండి. అపవాదికి మీ జీవితంలో చోటివ్వరని తెలియజేయండి.

# 70

# దీవెనకరమైన మాటలను మాట్లాడండి

**1 పేతురు 3:8-12**
**8 తుదకు మీరందరు ఏకమనస్కులై యొకరి సుఖదుఃఖములయందు ఒకరు పాలుపడి, సహోదర ప్రేమ గల వారును, కరుణాచిత్తులును, వినయమనస్కులునై యుండుడి.**
**9 ఆశీర్వాదమునకు వారసులవుటకు మీరు పిలువబడితిరి గనుక కీడుకు ప్రతి కీడైనను దూషణకు ప్రతి దూషణయైనను చేయక దీవించుడి.**
**10 –జీవమును ప్రేమించి మంచి దినములు చూడగోరు**
**వాడు చెడ్డదాని పలుకకుండ తన నాలుకను,**
**కపటపు మాటలు చెప్పకుండ తన పెదవులను కాచుకొనవలెను.**
**11 అతడు కీడునుండి తొలగి మేలుచేయవలెను,**
**సమాధానమును వెదకి దాని వెంటాడవలెను.**
**12 ప్రభువు కన్నులు నీతిమంతుల మీదను,**
**ఆయన చెవులు వారి ప్రార్థనల వైపునను ఉన్నవి గాని**
**ప్రభువు ముఖము కీడుచేయువారికి విరోధముగా ఉన్నది.**

మనం తిరిగి ఆశీర్వదించే మార్గాల్లో ఒకటేమిటంటే, మనల్ని శపించినా లేదా మనకు అన్యాయం చేసినా సరే ఆశీర్వాదాన్ని తిరిగి ఇవ్వడానికి ఉన్న ఒక మార్గం వారిని దీవించడమే. యేసు ప్రభువు మనకు *"మీ శత్రువులను ప్రేమించుడి. మిమ్మును హింసించు వారికొరకు ప్రార్థన చేయుడి"* (మత్తయి 5:44), *"మిమ్మల్ని శపించువారిని దీవించండి"* (లూకా 6:28) అని బోధించారు. కాబట్టి మన పట్ల తప్పుగా ప్రవర్తించివారి గురించి మనం దీవెనకరమైన మాటలనే మాట్లాడాలి. దీనినే మనం ఎంచుకోవాలి. మీ నాలుకను అదుపు చేసుకుని, చెడ్డ మాటలు పలుకకుండా జాగ్రత్త పడాలి. వాటికి దూరంగా ఉండండి. దానికి బదులుగా దీవెనకరమైన మాటలనే మాట్లాడాలని ఎంచుకోండి. దేవుని ముందుకు వెళ్లి, "తండ్రీ, యేసు నామములో ఫలానా వ్యక్తి మీద ఈ ఆశీర్వాదాన్ని ప్రకటిస్తున్నాను. వారు నన్ను బాధపెట్టినప్పటికీ యేసు నామములో వారి జీవితాలమీద

ఆశీర్వాదాన్ని ప్రకటిస్తాను. వారి జీవితంలో ప్రతి విషయంలో వారికి క్షేమం కలగాలి. వారు ఫలించి దీవించబడాలి" అని చెప్పండి.

ఒక్కసారి మీరు వ్యక్తిగతంగా వారిని దీవించిన తర్వాత, వారు మీతో తప్పుగా నడుచుకున్నారని, మిమ్మల్ని బాధపెట్టారని ఇతరులతో చెప్పకండి. చెడు పలకకుండా మీ నాలుకను నియంత్రించండి. దీవించడం ద్వారా ఆశీర్వాదాన్ని వారసత్వంగా పొందుకునే స్థానంలో మిమ్మల్ని మీరు ఉంచిన వారవుతారు. ప్రభువు కనుదృష్టి మీ మీద ఉంది. ఆయన మీకు మంచి జీవితం ఉండేలా మీరు మంచి రోజులు చూసేలాగా చేస్తారు. ఎప్పుడూ దీవెనకరమైన మాటలనే మాట్లాడండి. విశ్వాసంతో దీవెనకరమైన మాటలను ప్రకటించండి.

# 71
# మాటలు విజయం కొరకు మీ విశ్వాసాన్ని విడుదల చేస్తాయి

**1 యోహాను 5:1,4**
**[1] యేసే క్రీస్తయి యున్నాడని నమ్ము ప్రతివాడును దేవునిమూలముగా పుట్టియున్నాడు. పుట్టించినవానిని ప్రేమించు ప్రతివాడును ఆయన మూలముగా పుట్టిన వానిని ప్రేమించును.**
**[4] దేవుని మూలముగా పుట్టినవారందరును లోకమును జయించుదురు; లోకమును జయించిన విజయము మన విశ్వాసమే.**

యేసు క్రీస్తులో ఉన్న విశ్వాసం ద్వారా మనం దేవునిలో జన్మించాము. మనకు జీవముంది అలాగే మనలో దేవుని స్వభావముంది. మనం ఆయన కుమారులు కుమార్తెలము. తరువాత, మనం దేవుని మూలంగా పుట్టాం కాబట్టి మనం జయించేవారిగా ఉన్నాము. ఈ లోకంపై శరీరంపై దుష్టునిపై విజయంతో జీవించడానికి కావలసిన అన్నిటితో మనం నిండి ఉన్నాము. అలాగే, దేవునిలో మనకున్న విశ్వాసమే మనకు విజయమని ఈ లేఖనభాగం స్పష్టం చేస్తుంది. మనం జయించేవారిగా జీవించాలంటే విశ్వాసంలో నడవాలి. కేవలము స్వీయ సంకల్పంతోనో లేదా సొంత తెలితేటలతోనో మనం విజయాన్ని పొంది జయించినవారిగా జీవించలేము. విశ్వాసం ద్వారానే లోకం మీద విజయాన్ని పొందగలమని దేవుడు చెప్పారు.

ఈ పుస్తకంలో మేము ప్రాముఖ్యంగా చెప్పింది, లేఖనాలలో మనం చూసే విశ్వాసపు నియమాలలో ఒకటి విశ్వాసం ప్రకటిస్తుంది. విశ్వాసం మాటల ద్వారా వ్యక్తమవుతుంది. దేవునిలో ఆయన వాక్యంలో మరియు యేసు క్రీస్తు మన కోసం నెరవేర్చిన దానిలో మనకున్న విశ్వాసాన్ని వ్యక్తపరిచే విశ్వాసపు మాటలను మనం

ప్రకటించాలి. అలా చేయడమనేది మనం లోకాన్ని శరీరాన్ని దుష్టుని జయించే మార్గాలలో ఒక మార్గము.

మీ విశ్వాసాన్ని ప్రకటించండి. విజయంతో మరియు జయించేవారిగా జీవించడానికి ఇది చాలా కీలకము.

# 72

# మనం దేవుని సంబంధులం, కాబట్టి మనం దేవుని సంబంధులుగా మాట్లాడతాము

**1 యోహాను 4:4-6**
**4 చిన్నపిల్లలారా, మీరు దేవుని సంబంధులు; మీలో ఉన్నవాడు లోకములో ఉన్నవాని కంటె గొప్పవాడు గనుక మీరు వారిని జయించియున్నారు.**
**5 వారు లోకసంబంధులు గనుక లోక సంబంధులైనట్టు మాటలాడుదురు, లోకము వారి మాట వినును.**
**6 మనం దేవుని సంబంధులము; దేవుని ఎరిగినవాడు మన మాట వినును, దేవుని సంబంధి కానివాడు మన మాట వినడు. ఇందువలన మనము సత్య స్వరూపమైన ఆత్మ యేదో, భ్రమపరచు ఆత్మ యేదో తెలిసికొనుచున్నాము.**

అపొస్తలుడైన యోహాను రెండు రకాల ప్రజల గురించి మాట్లాడుతున్నాడు. వారిలో ఒకరు లోకానికి చెందినవారైతే మరొకరు దేవుని సంబంధులు. అతడు ఈ లోకానికి చెందిన వారు "లోక సంబంధులైనట్టు మాటలాడుదురు" అని చెప్పాడు. వారు ఈ లోక భాషను, లోకసంబంధమైన వాటిని మాట్లాడి, లోకపు ఆత్మను వ్యక్తపరుస్తారు. కాబట్టి లోకం వారి మాటలు వింటుంది. అయితే దేవుని సంబంధులమైన మనం దేవుని సంబంధులుగా మాట్లాడతాము; దేవున్ని తెలుసుకున్నవారు, మనం మాట్లాడే మాటలను శ్రద్ధగా విని గ్రహిస్తారు.

మనం "దేవుని సంబంధులు" కాబట్టి, "దేవుని సంబంధులుగానే" మాట్లాడతాము. మనం భిన్నమైన భాషను మాట్లాడతాము. మనం దేవుని వాక్యమనే భాషను మాట్లాడతాము. మనం దేవుని వాక్యంలోని సత్యానికి అనుగుణంగా మాట్లాడతాము.

మీరు "దేవుని సంబంధులు" అని జ్ఞాపకముంచుకోండి. మీ చుట్టూ

లోక సంబంధులు ఉన్నప్పుడు, మీరు కూడా లోకసంబంధులతో ఏకీభవించి మాట్లాడాలనే ఒత్తిడిని ఎదుర్కొంటారు. కానీ మీరు లోక ఒత్తిడులకు లోబడక్కరలేదు. మీరు దేవుని సంబంధులు. మీరు జయించేవారు. తప్పిదాలు చేసే ఆత్మను, ఈ లోకపు దేవతను, క్రీస్తుకు విరోధంగా ఉన్న ఆత్మను మీరు జయించారు. మీలోనున్నవాడు ఈ లోకంలో ఉన్న వానికన్నా గొప్పవాడు. మీరు ఈ లోకపు భాషతో అంగీకరించనవసరం లేదు, లోకసంబంధుల వలే మాట్లాడనక్కరలేదు. మీరు మీ మాటలను ఎంచుకుంటారు. మీరు దేవుని సంబంధుల వలే మాట్లాడుతారు. మీరు దేవుని వాక్యానికి అనుగుణంగా మాట్లాడుతారు. మీ విశ్వాసాన్ని ప్రకటించండి.

# 73

# మనం గొర్రెపిల్ల రక్తం ద్వారా, మనమిచ్చిన సాక్ష్యం ద్వారా జయిస్తాము

**ప్రకటన 12:11**
**వారు గొర్రెపిల్ల రక్తమునుబట్టియు, తామిచ్చిన సాక్ష్యమునుబట్టియు వానిని జయించియున్నారు గాని, మరణమువరకు తమ ప్రాణములను ప్రేమించినవారు కారు.**

సాతాను మన శత్రువు. సాతాను, వాని దయ్యాలు ఓడిపోయి శక్తిహీనంగా ఉన్నాయి. అవి ఉన్న బలహీన స్థితిలో అవి చేయగలిగేది అంత కేవలం అబద్ధాలు, మోసాలు, అపనిందలు, బెదిరింపులతో మన మనసులతో చెలగాటమాడడమే. అందుకనే సాతానును సోదరుల మీద నేరారోపణ చేసేవానిగా పిలుస్తారు. అతని నేరారోపణలు మన మనసుల మీద నిత్యం పనిచేసేలాగా చేయడంవలన, మన మనసులు దేవుని ముందు నేరారోపణ చేస్తాయి. దేవుని ఎదుట మనం వ్యర్థమైన వారిగా, నిందించబడినవారిగా అలాగే ప్రేమను పొందుకోని వారిగా ఉండేలా అతడు ప్రయత్నిస్తాడు.

విశ్వాసులమైన మనం ఈ విరోధిని అతని ఆరోపణలను ఎలా అధిగమించాలనే దాని గురించి యోహాను ప్రకటన 12లో ఒక కీలకమైన విషయాన్ని చెప్పాడు. మనం గొర్రెపిల్ల రక్తం ద్వారా మనమిచ్చిన సాక్ష్యం ద్వారా సాతానును జయిస్తాము. మనం యేసు ప్రభువు రక్తం మనకు చేసిన దానినంతా నమ్ముతాము తరువాత మన సాక్ష్యాన్ని అంటే యేసు ప్రభువు రక్తం మనకు వ్యక్తిగతంగా చేసిన దానిని ప్రకటిస్తాము. యేసు ప్రభువు రక్తం మన కొరకు చేసిన దానిని మనం ప్రకటించి సాక్ష్యం చెప్పాలి. మనం, యేసు క్రీస్తు మనకొరకు సిలువ ద్వారా ముగించిన కార్యం గురించి ప్రకటించి

దానిని మనం నమ్ముతున్నామని మన నోటితో ఒప్పుకోవాలి. మన కొరకు గొర్రెపిల్ల రక్తం చేసిన కార్యం గురించి మనం ప్రకటించడం వలన శత్రువు అణగద్రొక్కబడుతుంది. మీ కోసం క్రీస్తు సిలువ ద్వారా చేసిన కార్యం మీద మీకున్న విశ్వాసాన్ని ప్రకటించండి. మీ విశ్వాసాన్ని ప్రకటించండి.

# నిన్ను ప్రేమించే దేవుడు నీకు తెలుసా?

దాదాపు 2000 సంవత్సరాల క్రితం, దేవుడు మనిషిగా ఈ ప్రపంచంలోకి వచ్చాడు. అతని పేరు యేసు. అతను సంపూర్ణ పాపరహిత జీవితాన్ని జీవించాడు. యేసు శరీరరూపము దాల్చిన దేవుడు అయినందున, ఆయన చెప్పిన మరియు చేసిన ప్రతిదీ మనకు దేవుణ్ణి వెల్లడి చేసింది. ఆయన పలికిన మాటలు దేవుని మాటలు. ఆయన చేసిన పన ఎన్నో అద్భుతాలు చేశాడు. అతను రోగులను మరియు బాధపడతున్న వారిని స్వస్థపరిచాడు. అతను గుడ్డివారికి చూపును దయచేసాడు, చెవిటివారికి వినికిడిని ఇచ్చాడు, కుంటివారిని లేవనెత్తి నడిపించాడు మరియు అన్ని రకాల రోగాలను మరియు వ్యాధులను నయం చేశాడు. అతను కొన్ని రొట్టెలను అద్భుతంగా విస్తరింపజేసి ఆకలితో ఉన్న వారికి ఆహారంగా ఇచ్చాడు, తుఫానును శాంతింపజేసాడు మరియు అనేక ఇతర అద్భుతకార్యాలు చేశాడు.

**ఈ కార్యాలన్నీ దేవుడు మంచివాడని, ప్రజలు క్షేమంగా, సంపూర్ణంగా, ఆరోగ్యంగా మరియు సంతోషంగా ఉండాలని కోరుకుంటున్నాడని మనకు తెలియజేస్తున్నాయి. దేవుడు ప్రజల అవసరాలను తీర్చాలని కోరుకుంటున్నాడు.**

అలాంటప్పుడు దేవుడు మనిషిగా మారి మన ప్రపంచంలోకి అడుగు పెట్టాలని ఎందుకు నిర్ణయించుకుంటాడు? యేసు ఎందుకు వచ్చాడు?

మనమందరం పాపం చేసి, మనలను సృష్టించిన దేవుని యెదుట అయోగ్యులుగా ఉన్నాము. పాపం వలన పరిణామాలు ఉంటాయి . పాపం అనేది దేవునికి మరియు మానవునికి మధ్య ఉన్న దాటలేని ఒక గొప్ప గోడ లాంటిది. పాపం మనల్ని దేవుని నుండి వేరు చేస్తుంది. అది మనల్ని సృష్టించిన సృష్టికర్తతో సహవాసాన్ని కలిగి ఉండకుండా అడ్డుకుంటుంది. అందుకే, మనలో చాలా మంది ఈ వెలితిని ఇతర విషయాలతో పూరించడానికి ప్రయత్నిస్తాము.

మన పాపాల యొక్క మరొక పరిణామం దేవుని నుండి శాశ్వతంగా విడిపోవడం. దేవుని న్యాయస్థానంలో, పాపానికి శిక్ష మరణం. మరణం అనేది నరకంలో దేవుని నుండి శాశ్వతంగా విడిపోవడం.

కానీ శుభవార్త ఏమిటంటే, మనం పాపం నుండి విముక్తి పొంది దేవునికి పునరుద్ధరింపబడవచ్చు. "*ఏలయనగా పాపమువలన వచ్చు జీతము మరణము, అయితే దేవుని కృపావరము మన ప్రభువైన క్రీస్తుయేసునందు నిత్యజీవము.*" **(రోమా 6:23)** అని బైబిల్ చెబుతోంది. యేసు సిలువపై మరణించి సర్వ లోక పాపాలకు పరిహారం చెల్లించాడు. మూడు రోజుల తరువాత, అతను పునరుద్ధరించి (తిరిగి లేచి), అనేకమందికి తనను తాను సజీవంగా ప్రత్యక్షపరచుకొని పరలోకానికి తిరిగి వెళ్ళాడు.

దేవుడు ప్రేమామయుడు మరియు దయగల దేవుడు. ఏ మనిషి కుడా నరకానికి చేరుకోవాలని అతను కోరుకోడు. కాబట్టి, సర్వ మానవ జాతి పాపం మరియు దాని శాశ్వత పరిణామాల నుండి విముక్తినిచ్చే ఒక మార్గాన్ని అందించడానికి ఆయన వచ్చాడు. అతను పాపులను రక్షించడానికి వచ్చాడు—నీ వంటి మరియు నా వంటి వారిని పాపం మరియు శాశ్వతమైన మరణం నుండి రక్షించడానికి వచ్చాడు.

ఈ ఉచిత పాప క్షమాపణను పొందాలంటే, మనం కేవలం ఒక్కటి మాత్రమే చేయాలని బైబిల్ చెబుతోంది—ప్రభువైన యేసుక్రీస్తు సిలువపై చేసిన దానిని నమ్మి, అంగీకరించి, ఆయనను హృదయపూర్వకంగా విశ్వసించాలి.

**"*ఆయనయందు విశ్వాసముంచువాడెవడో వాడు ఆయన నామము మూలముగా పాపక్షమాపణ పొందును...*" (అపొస్తలుల కార్యములు 10:43).**

**"*...యేసు ప్రభువని నీ నోటితో ఒప్పుకొని, దేవుడు మృతులలోనుండి ఆయనను లేపెనని నీ హృదయమందు విశ్వసించినయెడల, నీవు రక్షింపబడుదువు.*" (రోమా 10:9).**

మీరు కూడా ప్రభువైన యేసుక్రీస్తును విశ్వసిస్తే మీ పాపాలకు క్షమాపణ మరియు పాప ప్రక్షాళనను పొందవచ్చు.

ప్రభువైన యేసుక్రీస్తును విశ్వసించాలని మరియు సిలువపై ఆయన మీ కోసం చేసిన కార్యాన్ని మీరు విశ్వసించాలని నిర్ణయించుకోవడంలో మీకు సహాయపడటానికి ఈ క్రింది ప్రార్థన. ఈ ప్రార్థన యేసు మీ కోసం చేసిన దానికి మీ అంగీకారాన్ని తెలియజేయడానికి మరియు మీ పాపాలకు క్షమాపణ మరియు ప్రక్షాళనను పొందడంలో మీకు సహాయం చేస్తుంది. ఈ ప్రార్థన ఒక మార్గదర్శకం మాత్రమే. మీరు మీ స్వంత మాటలలో కూడా ప్రార్థించవచ్చు.

*యేసు ప్రభువా, సిలువపై మీరు నా కోసం ఏమి చేశారో ఈ రోజు నేను అర్థం చేసుకున్నాను. మీరు నా కోసం మరణించారు, మీరు మీ విలువైన రక్తాన్ని చిందించారు మరియు నేను క్షమించబడేలా నా పాపాలకు వెలను చెల్లించారు. నిన్ను విశ్వసించే వారు తమ పాపాలకు క్షమాపణ పొందుతారని బైబిల్ నాకు చెబుతోంది.*

*ఈ రోజు, నేను నిన్ను విశ్వసించాలని నిర్ణయించుకుంటున్నాను మరియు మీరు నా కోసం సిలువపై మరణించడం మరియు మృతులలో నుండి తిరిగి లేవడం వంటి వాటిని నమ్మి, అంగీకరించాలని నిర్ణయించుకుంటున్నాను. నా*

*స్వంత మంచి పనుల ద్వారా నన్ను నేను రక్షించుకోలేనని నాకు తెలుసు, అలాగే మరే వ్యక్తి నన్ను రక్షించలేడు. నేను నా పాపాలకు క్షమాపణ పొందలేను.*

*ఈ రోజు, మీరు నా కోసం మరణించారని, మీరు నా పాపాలకు వెలను చెల్లించారని, మీరు మృతులలో నుండి తిరిగి లేచారని నేను నా హృదయంలో విశ్వసిస్తున్నాను మరియు నా నోటితో ఒప్పుకుంటున్నాను, మరియు మీపై విశ్వాసం ద్వారా, నేను నా పాపాలకు క్షమాపణ మరియు ప్రక్షాళనను పొందుతున్నాను.*

*యేసయ్య, నీకే కృతజ్ఞతలు. నిన్ను ప్రేమించడానికి, నిన్ను మరింత తెలుసుకోవటానికి మరియు నీకు నమ్మకంగా ఉండటానికి నాకు సహాయం చెయ్యి.*

*ఆమెన్.*

# ఆల్ పీపుల్స్ చర్చ్ గురించి

బెంగుళూరు నగరానికి ఉప్పు మరియు వెలుగుగా వుండటం, మన దేశానికి మరియు ఇతర దేశాలకు స్వరంగా వుండటం, మా ఆల్ పీపుల్స్ చర్చ్ యొక్క దర్శనం.

ఆల్ పీపుల్స్ చర్చ్ యేసును ప్రేమించే, వాక్యాన్ని కేంద్రీకరించిన, ఆత్మతో నిండిన, ఒక కుటుంబ చర్చి, ఒక శిక్షణా కేంద్రం, మిషన్స్ మీద దృష్టి ఉంచి ప్రపంచాన్ని చెరుకోవలనుకునే చర్చి.

- ఒక **కుటుంబ చర్చి**గా, మేము క్రీస్తు-కేంద్రీకృత సహవాసంలో ఒక సంఘంగా కలిసి పెరుగుతాము, దేవుని సంఘంగా ఒకరినొకరు ప్రేమతో సంరక్షించుకుంటూ సేవ చేసుకుంటాము.
- ఒక **శిక్షణా కేంద్రం**గా, మేము ప్రతి విశ్వాసిని విజయవంతంగా జీవించడానికి, క్రీస్తువలె పరిణతి చెందడానికి మరియు వారి జీవితం పట్ల దేవుని ఉద్దేశాలను నెరవేర్చడానికి శిక్షణ ఇస్తాము.
- **మిషన్స్ మీద దృష్టి ఉంచె** ఒక చర్చిగా, దేవుని వాక్యం మరియు పరిశుద్ధాత్మ శక్తి యొక్క అద్భుతమైన ప్రదర్శనల ద్వారా యేసు క్రీస్తు యొక్క సువార్తతో మా నగరం, దేశం మరియు ఇతర దేశాలను ఆశీర్వదించడానికి మేము అర్థవంతమైన పరిచర్య చేస్తాము.
- **ప్రపంచాన్ని చెరుకోవలనుకునే** ఒక చర్చిగా, దేవుని రాజ్యం కోసం తమ ప్రాంతాలను ప్రభావితం చేయగల దైవభక్తిగల నాయకులను మరియు పరిశుద్ధాత్మతో నిండిన చర్చిలను పెంపొందించడానికి మేము స్థానికంగా మరియు ప్రపంచవ్యాప్తంగా సేవ చేస్తాము.

APC లో, మేము దేవుని పరిశుద్ధాత్మ అభిషేకం ద్వారా సంపూర్ణ మరియు రాజీపడని దేవుని వాక్యాన్ని అందించడానికి కట్టుబడి ఉన్నాము. మంచి సంగీతం, సృజనాత్మక ప్రదర్సనలు, అద్భుతమైన విశ్వాస జ్ఞానము, సమకాలీన పరిచర్య పద్ధతులు, సరికొత్త సాంకేతికతలు మరియు ఇతర సంకేతాలు—అద్భుతాలు, సుచక క్రియలు మరియు ఆత్మ సంబంధమైన వరములతో, పరిశుద్ధాత్మ శక్తితో (1 కొరింథీయులకు 2:4,5; హెబ్రీయులకు 2:3,4) దేవుని వాక్యాన్ని ప్రకటించే దేవుడు నియమించిన విధానాన్ని ఎన్నటికీ ప్రత్యామ్నాయం చేయవని మేము నమ్ముతున్నాము. యేసే మా నేపథ్యం, దేవుని వాక్యమే మా విషయ సూచిక, పరిశుద్ధాత్మ యొక్క శక్తి మా పద్ధతి, ప్రజలే మా పిలుపు మరియు మా లక్ష్యం క్రీస్తు వంటి పరిపక్వత.

బెంగుళూరులో మా ప్రధాన స్థావరంతోపాటు, ఆల్ పీపుల్స్ చర్చి భారతదేశంలో అనేక ఇతర చర్చిలను కలిగి ఉంది. ఆల్ పీపుల్స్ చర్చి స్థానాల యొక్క ప్రస్తుత జాబితా మరియు సంప్రదింపు సమాచారాన్ని పొందడానికి, దయచేసి మా వెబ్‌సైట్ **apcwo.org/locations**ను సందర్శించండి లేదా **contact@apcwo.org**కి ఇమెయిల్ పంపండి.

# ఉచిత ప్రచురణలు

A Church in Revival
A Real Place Called Heaven
A Time for Every Purpose
Ancient Landmarks
Baptism in the Holy Spirit
Being Spiritually Minded and Earthly Wise
Biblical Attitude Towards Work
Breaking Personal and Generational Bondages
Change
Code of Honor
Divine Favor
Divine Order in the Citywide Church
Don't Compromise Your Calling
Don't Lose Hope
Equipping the Saints
Foundations (Track 1)
Fulfilling God's Purpose for Your Life
Gifts of the Holy Spirit
Giving Birth to the Purposes of God
God Is a Good God
God's Word—The Miracle Seed
How to Help Your Pastor
Integrity
Interpreting Scripture
Kingdom Builders
Laying the Axe to the Root
Living Life Without Strife
Marriage and Family
Ministering Healing and Deliverance
Offenses—Don't Take Them
Open Heavens
Our Redemption
Receiving God's Guidance
Revivals, Visitations and Moves of God
Shhh! No Gossip!
Speak Your Faith
The Conquest of the Mind
The Father's Love
The House of God
The Kingdom of God
The Mighty Name of Jesus
The Night Seasons of Life
The Power of Commitment
The Presence of God
The Redemptive Heart of God
The Refiner's Fire
The Spirit of Wisdom, Revelation and Power
The Wonderful Benefits of Praying in Tongues
Timeless Principles for the Workplace
Understanding the Prophetic
Water Baptism
We Are Different
Who We Are in Christ
Women in the Workplace
Work—Its Original Design

కొత్త పుస్తకాలు క్రమం తప్పకుండా విడుదలవుతాయి. ఆల్ పీపుల్స్ చర్చ్ క్రిస్టియన్ పుస్తకాలను .PDF, ఆడియో మరియు ఇతర ఫార్మాట్లలో ఉచితంగా డౌన్‌లోడ్ చేయడానికి దయచేసి **apcwo.org/books** ని సందర్శించండి. వీటిలో చాలా పుస్తకాలు ఇతర భాషల్లో కూడా అందుబాటులో ఉన్నాయి. ఉచిత ఆడియో మరియు వీడియో ప్రసంగాలు, ఉపన్యాస పాఠాలు మరియు అనేక ఉచిత ఇతర వనరుల కోసం **apcwo.org/sermons** ని కూడా సందర్శించండి.

# క్రిసాలిస్ కౌన్సెలింగ్

క్రిసాలిస్ కౌన్సెలింగ్ మనుషుల జీవితంలోని సవాళ్లను ఎదుర్కోవడానికి మరియు అధిగమించడానికి వ్యక్తిగత సలహాలను అందిస్తుంది. క్రిసాలిస్ కౌన్సెలింగ్ అనేది శిక్షణ పొందిన మరియు అనుభవజ్ఞులైన క్రైస్తవ సలహాదారుల నిపుణుల బృందం.

మా సేవలు అన్ని వయసుల వారి కోసం అందించబడతాయి మరియు జీవితంలోని అనేక సవాళ్లను పరిష్కరిస్తాయి.

**యుక్తవయస్కులు**
**వ్యక్తిగత సర్దుబాట్లు**
**సంబంధాల సవాళ్లు**
**విద్యాసంబంధమైన వెనుకబాటు**
**పని సంబంధిత సమస్యలు**
**కుటుంబం / జంటలు: వివాహానికి ముందు, వైవాహిక**
**తల్లిదండ్రులు / పిల్లలు / తోబుట్టువులు / తోటివారు**
**ప్రవర్తన రుగ్మతలు**
**వ్యక్తిత్వ లోపాలు**
**మానసిక / భావోద్వేగ సమస్యలు**
**ఒత్తిడి / ట్రామా**
**ఆల్కహాల్ / మత్తుపదార్థాల దుర్వినియోగం**
**ఆధ్యాత్మిక సమస్యలు**
**జీవిత శిక్షణ**

క్రిసాలిస్ కౌన్సెలింగ్ సేవలకు రుసుములు సరసమైనవి మరియు అందుబాటులో ఉంటాయి.

మా శిక్షణ పొందిన సలహాదారుల బృందంలో ఒకరితో అపాయింట్‌మెంట్ షెడ్యూల్ చేయడానికి:

**వెబ్‌సైట్**: **chrysalislife.org**
**ఫోన్:** +91-80-25452617 or toll-free (భారతదేశంలో) 1-800-300-00998
**ఇమెయిల్**: **counselor@chrysalislife.org**

క్రిసాలిస్ కౌన్సెలింగ్ అనేది ఆల్ పీపుల్స్ చర్చి & వరల్డ్ ఔట్రీచ్ యొక్క పరిచర్య.

# ఆల్ పీపుల్స్ చర్చ్‌తో భాగస్వాములు కండి

ఆల్ పీపుల్స్ చర్చి దాని స్థానిక చర్చి స్వంత సరిహద్దులను దాటి భారతదేశం అంతటా పరిచర్య చేస్తోంది, ప్రత్యేకించి ఉత్తర భారతదేశం. (అ) నాయకులను బలపరచడం, (ఆ) యువకులను పరిచర్యకు శిక్షణ చేయడం మరియు (ఇ) క్రీస్తు శరీరాన్ని నిర్మించడంపై ప్రత్యేక దృష్టి ఉంచుతుంది. యువకుల కోసం అనేక శిక్షణా సదస్సులు మరియు "క్రైస్తవ నాయకుల సదస్సు" ఏడాది పొడవునా జరుగుతాయి. అదనంగా, వాక్యం మరియు పరిశుద్ధాత్మలో విశ్వాసులను శిక్షణ చేసే ఉద్దేశ్యంతో అనేక వేల ప్రచురణల కాపీలు ఇంగ్లీష్ మరియు ఇతర భారతీయ భాషలలో ఉచితంగా పంపిణీ చేయబడతాయి.

ఒక పర్యాయ బహుమతి లేదా నెలవారీ ఆర్థిక బహుమతిని పంపడం ద్వారా ఆర్థికంగా మాతో భాగస్వామిగా ఉండటానికి మిమ్మల్ని ఆహ్వానిస్తున్నాము. మన దేశం అంతటా ఈ పనిలో మాకు సహాయం చేయడానికి మీరు పంపగల మొత్తం ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది.

"All Peoples Church"కి చెల్లించాల్సిన చెక్కు / బ్యాంక్ డ్రాఫ్ట్ ద్వారా మీరు మీ బహుమతిని మా కార్యాలయ చిరునామాకు పంపవచ్చు. లేదంటే, మీరు మా బ్యాంక్ ఖాతా వివరాలను ఉపయోగించి బ్యాంక్ బదిలీ ద్వారా నేరుగా మీ సహకారాన్ని చెల్లించవచ్చు.

**ఖాతా పేరు:** All Peoples Church
**ఖాతా సంఖ్య:** 50200068829058
**IFSC కోడ్:** HDFC0004367
**బ్యాంకు:** HDFC Bank, 7M/308 80 Ft Rd, HRBR Layout, Kalyan Nagar, Bengaluru - 560043, Karnataka.

**దయచేసి గమనించండి:** ఆల్ పీపుల్స్ చర్చి భారతదేశం ఆధారిత బ్యాంక్ ఖాతా నుండి మాత్రమే బ్యాంక్ విరాళాలను ఆమోదించగలదు. మీ సహకారాన్ని అందించేటప్పుడు, కావాలనుకుంటే, మీరు మీ సహకారాన్ని ఉపయోగించాలనుకుంటున్న నిర్దిష్ట అన్ని పీపుల్స్ చర్చి శాఖను సూచించవచ్చు. అదనపు వివరాల కోసం, దయచేసి **apcwo.org/give** ని సందర్శించండి.

అలాగే, దయచేసి మీకు వీలైనప్పుడల్లా మా కోసం మరియు మా పరిచర్య కోసం ప్రార్థించండి.

**ధన్యవాదాలు, దేవుడు మిమ్మును దీవించుగాక!**

## DOWNLOAD THE FREE APP!

*Search for*

"All Peoples Church Bangalore"
in the App or Google play stores.

Available on the App Store

ANDROID APP ON Google play







*A daily 5-minute video devotional.*
*A daily Bible reading and prayer guide.*
*5-minute Sermon summary.*
*Toolkit with Scriptures on various topics to build faith and information to share the Gospel.*
*Resources with sermons, sermon notes, TV programs, books, music and more.*

*IF YOU LOVE IT, TELL OTHERS ABOUT IT!*

# निःशुल्क ऐप डाउनलोड करें:

**ऐप स्टोर या प्ले स्टोर में खोजें**
**“ऑल पीपुल्स चर्च (APCWO)”/**
**All Peoples Church Hindi**




*विश्वास को मजबूत करने और सुसमाचार साझा करने के लिए विभिन्न विषयों पर आधारित वचनों के टूलकिट।*
*उपदेशों, टीवी कार्यक्रमों, पुस्तकों, संगीत और बहुत कुछ से भरे संसाधन।*
*अगर आपको यह पसंद आए, तो*
***दूसरों को भी इसके बारे में बताएं!***

# ఆల్ పీపుల్స్ చర్చ్ బైబిల్ కళాశాల

**apcbiblecollege.org**

భారతదేశంలోని బెంగుళూరులోని ఆల్ పీపుల్స్ చర్చ్ బైబిల్ కాలేజ్ మరియు మినిస్ట్రీ ట్రైనింగ్ సెంటర్, పరిశుద్ధాత్మతో నిండిన, అభిషేకించబడిన, ప్రయోగాత్మక శిక్షణ మరియు పరిచర్య కోసం పరిశుద్ధాత్మ యొక్క మానవాతీతమైన శక్తితో పాటు సిద్ధాంతపరమైన మరియు మేధోపరమైన దేవుని వాక్యంలో ఉత్తమ అధ్యయనాన్ని అందిస్తుంది. దైవిక స్వభావాన్ని, దేవుని వాక్యంలో లోతైన మూలాలను మరియు సంకేతాలు, అద్భుతాలు మరియు అద్భుతాల యొక్క శక్తివంతమైన ప్రదర్శనలను నొక్కిచెప్పే పరిచర్య కోసం ప్రభువుతో సన్నిహిత సంబంధం ద్వార ఒక వ్యక్తిని అభివృద్ధి చేయాలన్నది మా విశ్వాసం.

ఆల్ పీపుల్స్ చర్చ్ బైబిల్ కాలేజీ (APC-BC)లో, మంచి బోధనతో పాటు, మేము ప్రదర్శనలో దేవుని ప్రేమను, పరిశుద్ధాత్మ అభిషేకం మరియు ఉనికిని మరియు దేవుని మానవాతీతమైన పనిని నొక్కిచెబుతున్నాము. అనేకమంది యువకులు మరియు మహిళలు వారి జీవితాలపై దేవుని పిలుపును నెరవేర్చడానికి శిక్షణ పొందారు మరియు పంపబడ్డారు.

మేము మూడు కార్యక్రమాలను(ప్రోగ్రామ్‌లను) అందిస్తున్నాము.

- థియాలజీ మరియు క్రిస్టియన్ మినిస్ట్రీలో ఒక-సంవత్సరం సర్టిఫికేట్ (C.Th.)
- థియాలజీ మరియు క్రిస్టియన్ మినిస్ట్రీలో రెండు సంవత్సరాల డిప్లొమా (Dip.Th.)
- థియాలజీ మరియు క్రిస్టియన్ మినిస్ట్రీలో మూడు సంవత్సరాల బ్యాచిలర్స్ (B.Th.)

తరగతులు ప్రతి వారం, **సోమవారం నుండి శుక్రవారం వరకు, భారత కాలమానం ప్రకారం ఉదయం 9:00 నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు జరుగుతాయి (UTC+5:30).** మేము మూడు అభ్యాస ఎంపికలను అందిస్తున్నాము.

- **క్యాంపస్‌లో**: క్యాంపస్‌లో వ్యక్తిగత తరగతులకు హాజరవుతారు.
- **ఆన్‌లైన్**: ఆన్‌లైన్‌లో ప్రత్యక్ష ఉపన్యాసాలకు హాజరవ్వండి.
- **ఇ-లెర్నింగ్: apcbiblecollege.org/elearn** ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా స్వీయ-గమన(మీకు వీలైనప్పుడు) అభ్యాసం పొందవచ్చు.థియాలజీ మరియు క్రిస్టియన్ మినిస్ట్రీలో మూడు సంవత్సరాల బ్యాచిలర్స్

ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవడానికి మరియు కళాశాల, పాఠ్యాంశాలు, అర్హత ప్రమాణాలు, ట్యూషన్ ఖర్చుల గురించి మరింత సమాచారం కోసం మరియు దరఖాస్తు ఫారమ్‌ను డౌన్‌లోడ్ చేయడానికి, దయచేసి **apcbiblecollege.org**ని సందర్శించండి.

వాక్యమంతటిలో, దేవుడు తన ప్రజలను తమ విశ్వాసమును ప్రకటించమని సూచించడము మనము చూస్తాము. ఆయన వాక్యాన్ని, మన హృదయాలలోనున్న విశ్వాసముతో, ఆయన వాక్యాన్ని మన నోటితో ప్రకటించినప్పుడు; మనము ఉన్న ఈ శారీరక లోకములోనికి ఆయన యొక్క సృజనాత్మకమైన అద్భుతాలు చేసే శక్తిని విడుదల చేస్తుంది. మన నోటి నుండి వెలువడే ఆయన వాక్యము, శత్రువుని ఎదుర్కునే మన ఆయుధముగా మారుతుంది.

మన వర్తమానము మరియు భవిష్యత్తు గురించి  దేవుని వాక్యాన్ని ప్రకటించడము ద్వారా మన లోకాన్ని రూపుదిద్దుకోవచ్చు. అన్ని సమయాలలోను అలాగే అన్ని పరిస్థితుల్లోను, విశ్వాసముతో నిండిన దేవుని వాక్యాన్ని ప్రకటించడము మనము నేర్చుకోవాలి. విశ్వాసముతో ప్రకటించడమంటే, గొప్ప పర్వతము మనకు అడ్డముగా లేదని కాదు లేదా భయంకరమైన తుఫాను మనకు రాదని కాదు. అయితే నిజానికి; విశ్వాసము గొప్ప పర్వతమునకు అడ్డగావుండే దాని హక్కును నిరాకరిస్తుంది. విశ్వాసము గాలి తుఫానులతో మాట్లాడుట ద్వారా అవి వినాశనముచేసే హక్కును కోల్పోయి దానికి బదులుగా, దేవుడు ఇచ్చే, శాంతి సమాధానములకు మార్గము తెరుస్తుంది. విశ్వాసము, వ్యాధిని విడిచి వెళ్ళమని  ఆజ్ఞాపించగా, దేవుని నుండి వచ్చే సంపూర్ణ ఆరోగ్యము స్వస్థతను తెస్తుంది.

ఈ పుస్తకము, మిమ్ములను బైబిలు సత్యములో స్థిరపరచి, ఎల్లప్పుడూ మీ విశ్వాసమును వెల్లడిపరిచేలా ప్రేరేపిస్తుంది.


**All Peoples Church & World Outreach**
# 319, 2nd Floor, 7th Main, HRBR Layout,
2nd Block, Kalyan Nagar, Bangalore 560 043
Karnataka, INDIA

Phone: +91-80-25452617
Email: contact@apcwo.org
Website: apcwo.org